www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



శుక్రవారం | 8-3-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 323 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 9.59 తదుపరి చతుర్దశి; నక్షత్రం: శ్రవణం ఉ. 10.42 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: మ. 2.14-3.39; దుర్ముహూర్తం: ఉ. 8.54-9.41, మ. 12.50-1.37; అమృతఘడియలు: రా. 10.43-12.08; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 6.21 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్

ఎండీపై వేటు!

కేశవులును తప్పించాలని మంత్రి తుమ్మల ఆదేశాలు

ఐఏఎస్ అధికారి హరితకు ఎండీగా బాధ్యతలు

పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక అందజేయాలని కార్యదర్శికి ఆదేశం 3

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

శుక్రవారం | 8-3-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 323

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 9.59 తదుపరి చతుర్దశి; నక్షత్రం: శ్రవణం ఉ. 10.42 తదుపరి ధనిష్ఠ వర్జ్యం: మ. 2.14-3.39; దుర్ముహూర్తం: ఉ. 8.54-9.41, మ. 12.50-1.37; అమృతఘడియలు: రా. 10.43-12.08; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 6.21

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

13న షెడ్యూల్?

లోక్‌సభ ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వానికి సంకేతాలు!

అధికారులు అప్రమత్తం.. క్రియాశీలంగా కలెక్టర్లు.. పనులను త్వరగా పూర్తి చేయండి

కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ.. రెవెన్యూ సిబ్బందికి 8, 9, 10 తేదీల్లో సెలవులు రద్దు

రాజకీయ కాక షురూ.. పార్టీలు పారాహుషార్.. ప్రారంభోత్సవాలతో సీఎం రేవంత్ బిజీబిజీ



హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 13న వెలువడనుందా..? ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సంకేతాలు అందాయా? దీంతోనే అధికార యంత్రాగాన్ని పరుగులు పెట్టిస్తోందా? ఈ ప్రశ్నలకు ఔననే సమాధానమే వస్తోంది. కలెక్టర్లు క్రియాశీలంగా మారి.. మిగిలిపోయిన పనులు, శంకుస్థాపనలు, భవనాల ప్రారంభోత్సవాలను వెంటనే చేపట్టాలంటూ క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశిస్తున్నారు. పనులు వేగంగా జరగడానికి.. సిబ్బంది సెలవులను సైతం రద్దు చేస్తున్నారు. వాస్తవానికి 2019లో షెడ్యూల్ మార్చి 10న వెలువడింది. అదే నెల 18న నోటిఫికేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 11న తొలి దశ పోలింగ్ జరిగింది. ఈ దశలోనే తెలంగాణలోని లోక్‌సభ, ఏపీలోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈసారి షెడ్యూల్ ఈ నెల 13న వస్తుందని కొన్ని రోజుల కిందట ప్రచారం జరిగింది. ఇప్పుడు దానిని బలపరిచేలా వార్తలు వస్తున్నాయి. ఈ ఊహాగానాల రీత్యా రాష్ట్రంలో రాజకీయ కాక రాజుకుంది. మరోవైపు ప్రధాని మోదీ కొద్ది రోజుల నుంచి దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ పలు రాష్ట్రాల్లో సభల్లో పాల్గొంటున్నారు. ఈ సభలు 13వ తేదీన ముగియనున్నాయి. అదే రోజు సాయంత్రం లేదంటే మరుసటి రోజు షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని కూడా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పార్టీలన్నీ ఇప్పటికే అప్రమత్తమయ్యాయి. షెడ్యూల్ జారీతో దేశమంతటా ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. కేంద్ర ప్రభుత్వంతో సహా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొత్తగా ప్రారంభించడానికి వీలుండదు. కొత్త పథకాలను ప్రకటించే అవకాశం ఉండదు. అందుకే.. ప్రభుత్వంతో సహా రాష్ట్రంలోని పార్టీలన్నీ ఎన్నికలకు సంబంధించి విస్తృత కార్యాచరణను ప్రారంభించాయి. ద్వితీయ శ్రేణి నాయకులతో పాటు క్షేత్రస్థాయి కేడర్‌ను పరుగులు పెట్టిస్తున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. అటు ప్రభుత్వ, ఇటు పార్టీ కార్యక్రమాలను చురుగ్గా చేపడుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి నిత్యం

మిగతా 13వ పేజీలో...

కేంద్ర ఉద్యోగులకు 4% డీఏ


50 శాతానికి చేరనున్న కరువు భత్యం.. జనవరి నుంచి వర్తింపు 14

49 లక్షల మంది ఉద్యోగులు, 67 లక్షలమంది పెన్షనర్లకు మేలు

కృత్రిమ మేధ అభివృద్ధి, పరిశోధనలకు రూ.10 వేల కోట్లతో మిషన్

ఉజ్వల లబ్ధిదారులకు రూ.300 రాయితీ 2025 మార్చి 31 వరకు పొడిగింపు

కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు



ఆ అధికారం గవర్నర్‌కు లేదు

దాసోజు, కుర్రా నామినేషన్ల తిరస్కరణ చెల్లదు

పునఃపరిశీలనకు పంపే అధికారమే ఉంది 2

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల కేసులో హైకోర్టు తీర్పు

కోదండ, అలీ నియామక గెజిట్ కూడా కొట్టివేత

రాజ్యాంగబద్ధ నిర్ణయం తీసుకోవాలని సూచన

వారిది సంఘర్షణ.. మాది

సహకారం

అధికారంలోకి రాగానే కేంద్రానికి భూములిచ్చాం 13

ప్రతిగా కేంద్రం ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతిచ్చింది

ఇతర పథకాల కోసం ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశాం

గత సర్కారు ఘర్షణ ధోరణితో ప్రజలకు నష్టం జరిగింది

అల్వాల్‌లో ఎలివేటెడ్ కారిడార్ శంకుస్థాపనలో సీఎం

బాబు జగ్జీవన్‌రామ్ భవనాన్ని ప్రారంభించిన రేవంత్

అల్లుడితో సహా కాంగ్రెస్‌లోకి మల్లారెడ్డి! 2

సీఎం సలహాదారు నరేందర్ రెడ్డితో 3 గంటల చర్చలు

లక్ష మందితో కాంగ్రెస్ పార్టీలో చేరతానని ఆఫర్

అల్లుడి కాలేజీలో కూల్చివేతలు ఆపించాలని వేడుకోలు

అందులో తాను తలదూర్చలేనన్న వేం నరేందర్‌రెడ్డి

ఎంపీ సీట్లు ఎక్కువ ఇవ్వండి

అసెంబ్లీలో గెలవడం మీకు ముఖ్యమే కదా

చంద్రబాబుకు అమిత్ షా, నడ్డా ప్రతిపాదన

కీలక దశకు టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు

4 ఎంపీ, 6 అసెంబ్లీ స్థానాల్లో గెలుపు గ్యారెంటీ

ఎక్కువ తీసుకుంటే వైసీపీకి అయాచిత లబ్ధి

మనసులో మాట చెప్పిన చంద్రబాబు!? 13



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

బఫర్‌జోన్‌లో అక్రమ విల్లాల కూల్చివేత

- నెక్నాంపూర్ చెరువు స్థలంలోనే నిర్మాణాలు చేపట్టిన బిల్డర్
- తొమ్మిది విల్లాలు, ప్రహరీ నేలమట్టం
- బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు ఉపేక్షించం: అధికారులు

నార్సింగ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపారు. బఫర్‌జోన్ పరిధిలో బిల్డర్ అక్రమంగా విల్లాలను నిర్మించాడని వచ్చిన సమాచారంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. వివరాల్లోకి వెళితే... గండిపేట మండలం నెక్నాంపూర్ పెద్ద చెరువు బఫర్ జోన్‌లో ఓ బిల్డర్ విల్లాల నిర్మాణం చేపట్టాడు. తన పలుకుబడి, ధనబలంతో చెరువు పక్కన ఉన్న స్థలంతో పాటు చెరువు స్థలాన్నీ ఆక్రమించి ఏకంగా తొమ్మిది విల్లాలను నిర్మించాడు. ఒక్కో విల్లా పది కోట్లు ఉండవచ్చని సమాచారం. ఈ విషయమై స్థానికులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఈ విల్లాలను గురువారం కూల్చివేయించారు. అలాగే ప్రహరినీ నేలమట్టం చేశారు. బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన ఉపేక్షించేదిలేదని తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు. విల్లాల కూల్చివేతలో రెవెన్యూ సిబ్బందితో పాటు ఇద్దరు ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారని ఆయన తెలిపారు. అయితే, రెండు రోజుల క్రితం ఇదే విల్లాలను కూల్చివేసేందుకు రెవెన్యూ అధికారులు వెళ్లగా నిర్మాణదారులు, ఓ బీఆర్ఎస్ నేత అడ్డుకున్నారు. ఈ విల్లాలను గత ప్రభుత్వ హయాంలో కూల్చివేసినప్పటికీ తిరిగి నిర్మించారని, నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం సోదరుడు తిరుపతి రెడ్డికి గుండెపోటు

- ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది: కుటుంబసభ్యులు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డికి గురువారం గుండెపోటు వచ్చింది. దీంతో కుటుంబసభ్యులు ఆయన్ను మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు ఆయనకు చికిత్స అందిస్తున్నారని, ప్రస్తుతం తిరుపతి రెడ్డి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబసభ్యులు, బంధువులు తెలిపారు.

గాయని సుశీలకు గౌరవ డాక్టరేట్ ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7: ప్రఖ్యాత గాయని పి. సుశీలకు తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. గురువారం నిర్వహించిన యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ సుశీలకు డాక్టరేట్‌ను అందజేశారు. జ్ఞాపిక, ధ్రువీకరణ పత్రం, శాలువాతో సుశీలను గవర్నర్ సత్కరించారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం దిశగా అడుగులు

- వివిధ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల సమావేశం
- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి హాజరు

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం దిశగా ముందడుగు పడింది. వివిధ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల ప్రతినిధులు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో (దేశోద్ధారక భవన్) సమావేశమై పలు అంశాలపై చర్చించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు దక్కాలంటే సొసైటీలకు అతీతంగా కలిసి పనిచేయాలని, అందుకు అంతా కలిసి ఒకే వేదికగా ఏర్పాటు కావాలని, మూడు సొసైటీల సమన్వయం కోసం ఒక ప్రత్యేక కమిటీని నియమించాలనే అంశాలపై చర్చ జరిగింది. ఇందుకు మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. సమావేశానికి హాజరైన మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సొసైటీలన్నీ ఒకే వేదికమీదకు రావడమనే ఆలోచన శుభ పరిణామన్నారు. అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా సొసైటీలన్నీ దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డెక్కన్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్), తెలంగాణ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ, హైదరాబాద్ జర్నలిస్టుల మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పాల్గొన్నాయి.

2.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సేకరణకు టెండర్లు!

పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనపథకం, సంక్షేమ హాస్టళ్లకు, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమయ్యే సన్నబియ్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ సన్నబియ్యాన్ని ఓపెన్ మార్కెట్ ద్వారా కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ నిర్ణయించారు. ఈ- టెండర్ల పద్ధతిలో బియ్యం సేకరణ చేపట్టాలని గురువారం జీవో ఎమ్మెస్ నెంబరు 4ను జారీచేశారు. సంక్షేమ సంస్థలు, హాస్టళ్లకు నెలకు 13,500 మెట్రిక్ టన్నులు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి 4,500 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరమవుతున్నాయి. అదే విధంగా తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు 1,500 మెట్రిక్ టన్నులు, ఐసీడీఎస్ సెంటర్లకు 2,500 మెట్రిక్ టన్నుల బియ్యం కావాలి. ఈ మేరకు టెండరు నిబంధనలను ఖరారు చేశారు. సన్నబియ్యంలో నూకలు 10 శాతానికి మించకూడదని నిబంధన పెట్టారు. బీపీటీ- 5204(సాంబ మసూరి), బీపీటీ- 3291 (సోనామసూరి), హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్- 15048 (తెలంగాణ సోనా) బియ్యాన్ని మాత్రమే తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. బియ్యాన్ని కొత్త జూట్ బ్యాగుల్లోనే డెలివరీ ఇవ్వాలని కూడా నిబంధన విధించారు.

మల్లారెడ్డి అల్లుడి

కళాశాల భవనాల కూల్చివేత

దుండిగల్ ఏరోనాటికల్ కాలేజీలో అక్రమ నిర్మాణాలపై కొరడా



దుండిగల్ ఏరోనాటికల్ కాలేజీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన దృశ్యం

దుండిగల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి చెందిన కళాశాలల్లో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపారు. దుండిగల్‌లోని చిన్న దామెర చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) బఫర్ జోన్‌లో ఆయనకు చెందిన ఏరోనాటికల్, ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాలల్లోని రెండు శాశ్వత భవనాలు, ఆరు షెడ్లను కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో నిర్మించిన ఈ భవనాలు, షెడ్లు, పార్కింగ్ స్థలాలను, రోడ్డును కొద్దిరోజుల క్రితం కలెక్టర్ స్వయంగా పరిశీలించి.. వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో.. ఆ రోడ్డులో వేసిన మట్టిని అధికారులు కిందటివారమే తొలగించారు. వారం రోజుల క్రితం ఇచ్చిన నోటీసుకు తోడు.. బుధవారం మరోసారి నోటీసు జారీ చేశారు. గురువారం ఉదయాన్నే ఆరు గంటల సమయంలో.. దుండిగల్ తహశీల్దార్ సయ్యద్ మతిన్ ఆధ్వర్యంలో ఇరిగేషన్, మునిసిపల్ సిబ్బంది మూడు ఎక్స్‌కవేటర్లు, నాలుగు కంప్రెషన్ మిషన్లతో వచ్చి ఐదు అంతస్తుల భవనం కూల్చివేత పనులు చేపట్టారు. మొదటి అంతస్తులో శ్లాబ్‌కు అక్కడక్కడా రంధ్రాలు చేశారు. ఉదయం 9 గంటల సమయంలో కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని ఎక్స్‌కవేటర్‌కు అడ్డుపడుతూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భవనాన్ని కూల్చవద్దంటూ ఆందోళనకు దిగారు. ఆపేందుకు పోలీసులు ప్రయత్నించగా వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. మరోవైపు.. కూల్చివేతల విషయం తెలియగానే మర్రి రాజశేఖర్ రెడ్డితోపాటు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అక్కడికి చేరుకున్నారు. ఇన్నేళ్లుగా లేనిది ఇప్పుడు అక్రమ కట్టడాలంటూ కూల్చివేతలేంటని అధికారులను ప్రశ్నించారు. దీనికి వారు.. తమ చేతిలో ఏమీ లేదని, కలెక్టర్ ఆదేశిస్తే కూల్చివేతలను ఆపుతామని తేల్చిచెప్పారు. దీంతో ఎమ్మెల్యేలు కలెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు దాదాపు గంటసేపు ప్రయత్నించారు. అయినా ఆయన అందుబాటులోకి రాకపోవడంతో.. నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కలిసి మేడ్చల్ కలెక్టర్ ఆఫీసుకు వెళ్లారు. అప్పటికే ఒక వ్యాన్ నిండా సీఆర్‌పీఎఫ్ బలగాలు వచ్చి, కూల్చివేతలకు ఎవరూ అడ్డు రాకుండా బందోబస్తు చేపట్టాయి.

26 ఏళ్ల క్రితం కొన్నాం..

తాము 26 సంవత్సరాల క్రితమే రైతుల వద్ద ఈ స్థలాన్ని కొనుగోలు చేశామని.. తమవద్ద అన్ని పత్రాలూ ఉన్నాయని, ఎక్కడా చెరువును కబ్జా చేయలేదని మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తమను రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని.. ఇది మంచి పద్ధతి కాదని ఆందోళన వెలిబుచ్చారు. తాము కొనుగోలు చేసిన భూమికి దగ్గరగా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ కొంత ఉండొచ్చని.. దానిని క్రమబద్ధీకరించుకోవడానికి ఈ ప్రాంతం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడే ప్రభుత్వానికి దరఖాస్తుచేసుకున్నామని.. ప్రస్తుతం అది సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని వివరించారు. ఆ తరువాత ఈ ప్రాంతమంతా హెచ్ఎండీఏ పరిధిలోనిది కాబట్టి తప్పకుండా రెగ్యులరైజ్ చేసుకోవాల్సిందిగా అధికారులు సూచించారని.. వారి సూచన మేరకు తాము దరఖాస్తు కూడా పెట్టుకున్నామని పేర్కొన్నారు. అది ఇంకా పెండింగ్‌లో ఉందని.. గతంలో దీనికి ఆర్డీవో క్లియరెన్స్ కూడా ఇచ్చారని.. అయినా ఇంతలోనే ఇలా కూల్చివేయడం ఎంతవరకూ సమంజసమని రాజశేఖర్ రెడ్డి ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్య: కేపీ వివేకానంద్

ప్రత్యర్థులను రాజకీయంగా ఎదుర్కోలేకనే ప్రభుత్వం ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆరోపించారు. "ఈ కళాశాలలో ఆరు వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుత పరీక్షల సమయంలో ఇలాంటి దుశ్చర్య మంచిది కాదు. ప్రజల కోసం పథకాలను ప్రకటించి, అమలు చేయాల్సింది పోయి ఇలా ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపు ధోరణి అవలంబించడం సరికాదు" అన్నారు. రాష్ట్రంలో ఎన్నో నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి రెగ్యులరైజ్ చేస్తున్నారని.. వేలాది విద్యార్థులు చదివే ఇలాంటి కళాశాలలను కూడా అలాగే క్రమబద్ధీకరించి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చూడాలి గానీ, కూల్చడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు.

అల్లుడితో సహా కాంగ్రెస్‌లోకి మల్లారెడ్డి!

- లక్ష మందితో కాంగ్రెస్‌లో చేరతానని ఆఫర్
- కూల్చివేతలు ఆపించాలని వేడుకోలు
- తాను తలదూర్చలేనన్న వేం నరేందర్‌రెడ్డి

మేడ్చల్, మార్చి 7: బీఆర్ఎస్‌కు మరో భారీ షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, తన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో సహా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. గురువారం ఉదయం ఆరు గంటలకు.. రాజశేఖర్ రెడ్డి కళాశాలలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్రారంభం కావడంతో మల్లారెడ్డి అప్రమత్తమయ్యారు. ఉదయం ఏడు గంటల సమయంలో కుమారుడు మహేందర్ రెడ్డి, అల్లుడు రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నేత మంద సంజీవరెడ్డితో కలిసి హుటాహుటిన బయల్దేరి వేం నరేందర్ రెడ్డి ఇంటికి వెళ్లారు. మల్లారెడ్డిని చూసి ఆయన షాక్‌కు గురవడంతో.. 'నన్ను చూసి షాక్‌కు గురవుతున్నావా అన్నా?' అంటూ పలకరించారు. తన ఇంటి అడ్రస్ ఎలా తెలుసని ఆయన అడగ్గా.. 'తెలంగాణలో నీ ఇల్లు తెలియనివారు ఉన్నారా?' అంటూ మల్లారెడ్డి చమత్కారంగా మాట్లాడారు. అనంతరం.. తన అల్లుడి కాలేజీలో జరుగుతున్న కూల్చివేతలపై మాట్లాడారు. 'ఎలాగైనా నిలిపివేయించన్నా' అంటూ మల్లారెడ్డి ప్రాధేయపడినట్లు తెలిసింది. అయితే, ఈ విషయంలో తానేమీ చేయలేనని.. మేడ్చల్ రాజకీయాల్లో తలదూర్చలేనని వేం నరేందర్ రెడ్డి తెలపడంతో.. కనీసం సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరినట్టు తెలిసింది. "మీరు హామీ ఇస్తే లక్షమందితో పార్టీలో చేరుతా" అని మల్లారెడ్డి చెప్పినట్టు సమాచారం. దాదాపు 3 గంటలపాటు సాగిన వారి భేటీలో పలు అంశాలు ప్రస్తావనకు వచ్చినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ తరఫున తన కుమారుడికి మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇప్పించుకునేందుకు కూడా మల్లారెడ్డి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. అయితే, మల్లారెడ్డి వర్గీయులు మాత్రం కూల్చివేతలపైనే ఆయన మాట్లాడారని, రాజకీయ అంశాలేవీ ప్రస్తావనకు రాలేదని చెబుతున్నారు. దీనిపై మల్లారెడ్డిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

లోకం తీరు



మహిళలకు సరైన గుర్తింపు ఇచ్చుంటే.. ప్రపంచ గమనం మరోలా ఉండేది

- సృష్టికి మూలం మహిళ.. 'ఆమె' లేనిదే సృష్టి లేదు: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలకు సరైన గౌరవం, గుర్తింపు లభించి ఉంటే ప్రపంచ గమనం మరోలా ఉండేదని, శతాబ్దాలుగా అవమానాలు, తిరస్కరణలు, అణచివేతకు గురైనప్పటికీ మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో తమ ఉనికిని చాటుకుంటూ, స్వయం సాధికారతను సాధిస్తున్న తీరు మహిళా శక్తిని చాటుతున్నదని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈనెల 8న(శుక్రవారం) అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ తెలంగాణ సెక్రటేరియట్ వుమెన్స్ అసోసియేషన్.. సచివాలయంలో గురువారం ఆ వేడుకలను నిర్వహించింది. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళ.. మహిళ లేనిదే సృష్టి లేదని అన్నారు. "ఒక ప్రాణికి జన్మనివ్వడం ద్వారా మహిళలకు సృష్టించే శక్తి ఉంది. స్త్రీ దేవుడి ప్రతిరూపం. ప్రకృతికి మహిళ వరం లాంటిది. అందుకే మహిళను భూదేవితో పోలుస్తారు" అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మంత్రి హోదాలో ఈ కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని సురేఖ తెలిపారు.


శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

కుటుంబ సంరక్షణ నుంచి దేశ నిర్మాణం వరకు స్త్రీ సర్వశక్తిమంతురాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ మహిళలకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు రాజ్‌భవన్ వర్గాలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశాయి. మరో ప్రకటనలో రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ఆ అధికారం గవర్నర్‌కు లేదు

దాసోజు, కుర్రా నామినేషన్ల తిరస్కరణ చెల్లదు.. పునఃపరిశీలనకు పంపే అధికారం ఉంది

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల కేసులో హైకోర్టు తీర్పు
- కోదండ, అలీ నియామక గెజిట్ కూడా కొట్టివేత



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీలను నియమించే విషయంలో మంత్రి మండలి సిఫారసులను తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదని రాష్ట్ర హైకోర్టు తేల్చిచెప్పింది. పునఃపరిశీలన, సందేహాల నివృత్తి, అదనపు సమాచారం కోసం తిప్పి పంపే అధికారం మాత్రమే ఉందని స్పష్టం చేసింది. ఈమేరకు.. బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను తిరస్కరిస్తూ గవర్నర్ నిరుడు జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రివర్గం సిఫారసు మేరకు ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీలను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సైతం క్వాష్ చేసింది. ఈ వ్యవహారంపై రాజ్యాంగంలోని నిబంధనలను అనుసరించి గవర్నర్ తాజా నిర్ణయం తీసుకుంటారని తాము నమ్ముతున్నట్టు పేర్కొంటూ గురువారం తుది తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) ప్రకారం దఖలుపడ్డ అధికారాలను మంత్రిమండలి సలహా ప్రకారమే గవర్నర్ వినియోగించాలని స్పష్టం చేసింది. ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్ ఏ కోర్టుకూ జవాబుదారీకాదని, గవర్నర్‌కు సానుకూలంగా ఎలాంటి ఆదేశాలివ్వడం సైతం సాధ్యం కాదని పేర్కొంది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. దాసోజు, కుర్రాను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలంటూ నిరుడు జూలై 31న గవర్నర్‌కు మంత్రివర్గం సిఫారసు చేసింది. ఆ సిఫారసును సెప్టెంబరు 19న గవర్నర్ తిరస్కరించారు. దీంతో గవర్నర్ ఆదేశాలను సవాల్ చేస్తూ దాసోజు, కుర్రా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఇవి పెండింగ్‌లో ఉండగా జరిగిన కోదండరాం, అమీర్ అలీ నియామకాలను సైతం సవాల్ చేస్తూ వారు మధ్యంతర పిటిషన్లు వేశారు. వీటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ నిర్వహించి, గత నెల 15న తీర్పును రిజర్వు చేసింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆదిత్య సోంధి, మయూర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ గవర్నర్ చర్యలు న్యాయసమీక్ష పరిధిలోకి వస్తాయన్నారు. ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్‌కు వ్యక్తిగత రక్షణలను రాజ్యాంగం కల్పించిందే తప్ప గవర్నర్ చర్యలను సమీక్షించరాదని దాని అర్థం కాదన్నారు. ఆర్టికల్ 200, ఆర్టికల్ 356 కింద గవర్నర్‌కు విస్తృతమైన విచక్షణాధికారాలు కట్టబెట్టిన రాజ్యాంగం.. ఆర్టికల్ 171 (5) కింద మాత్రం విచక్షణాధికారాలు ఇవ్వలేదన్నారు. మంత్రివర్గ నిర్ణయానికి గవర్నర్ కట్టుబడి ఉండాలన్నారు. పిటిషనర్లు ఇద్దరూ సామాజిక సేవలో విస్తృతంగా పాల్గొన్నారని, ఆర్టికల్ 171లో స్పెషల్ అచీవ్‌మెంట్స్ అంటూ ప్రత్యేకంగా ఏమీ పేర్కొనలేదని వాదించారు. గవర్నర్ జారీ చేసిన తిరస్కరణ ఆదేశాలు పిటిషనర్ల చట్టబద్ధమైన ఆకాంక్షలను దెబ్బతీసేలా, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయన్నారు. రిట్ పిటిషన్లు హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా ప్రభుత్వం నూతన నియామకాలు చేపట్టడం సమంజసం కాదన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. మొదట చేసిన సిఫారసులను మంత్రివర్గం ఉపసంహరించుకుని, జనవరి 13న కోదండరాం, అమీర్‌అలీ పేర్లతో నూతన సిఫారసులను గవర్నర్‌కు పంపిందన్నారు. గవర్నర్ దానికి ఆమోద ముద్ర వేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలైందని తెలిపారు. ఆర్టికల్ 226 కింద పిటిషన్లు దాఖలు చేసే అధికారం పిటిషనర్లకు లేదన్నారు. మంత్రివర్గ సిఫారసుల్లో కానీ గవర్నర్ ఆదేశాల్లో కానీ వారు పార్టీలు కాదన్నారు. మంత్రివర్గ గత నిర్ణయాన్ని అమలు చేయాలని కోరే అర్హత పిటిషనర్లకు లేదని, ఎవర్ని సిఫారసు చేయాలనేది ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారమని పేర్కొన్నారు. గవర్నర్ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది అశోక్ ఆనంద్‌కుమార్ వాదనలు వినిపించారు. గవర్నర్ చర్యలను సమర్థించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మంత్రివర్గ సిఫారసులను అమలు చేయాలని కోరే అధికారం కానీ, దాని కోసం కోర్టును ఆశ్రయించే అర్హత కానీ పిటిషనర్లకు ఉండదన్నారు. మంత్రివర్గ సిఫారసులను ఆమోదించే క్రమంలో గవర్నర్‌కు విచక్షణాధికారాలు ఉంటాయన్నారు. ఇతర ప్రతివాదులు కోదండరాం, అమీర్ అలీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపించారు. ప్రస్తుత అంశం గవర్నర్, మంత్రి మండలికి సంబంధించిన వ్యవహారమని, పిటిషనర్లు క్వాలిఫై కాలేదు కాబట్టి నూతనంగా ఎంపికైన వారి నియామకం చెల్లదని చెప్పే అవకాశం లేదన్నారు. గవర్నర్ అధికారాలకు సంబంధించి న్యాయసమీక్షకు చాలా తక్కువ అవకాశం ఉంటుందన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్ల నామినేషన్‌కు సంబంధించి ఎలాంటి మెటీరియల్ అందుబాటులో లేదని గవర్నర్ పేర్కొన్నారని, నామినేషన్లను తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదని స్పష్టం చేసింది. పూర్తి వివరాల కోసం లేదా పునఃపరిశీలించాలని మంత్రిమండలికి తిప్పిపంపి ఉండాల్సిందని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో గవర్నర్ జారీ చేసిన పిటిషనర్ల నామినేషన్ తిరస్కరణ ఆదేశాలు, పరిణామ క్రమంలో నూతన ఎమ్మెల్సీల నియామక ఉత్తర్వులు చెల్లవని తీర్పు వెలువరించింది. ఈ తీర్పు నేపథ్యంలో రాష్ట్ర మంత్రివర్గం తాజాగా సిఫారసులు చేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ కోదండరాం, అమీర్ అలీ పేర్లను సిఫారసు చేసి గవర్నర్ ఆమోదం పొందే అవకాశం ఉంది.

ప్రణీత్‌రావుపై సర్కారుకు సమగ్ర నివేదిక!

ఎస్ఐబీలో హార్డ్‌డిస్క్‌ల ధ్వంసం, ఫైళ్ల మాయంపై వివరాలు.. ప్రణీత్‌రావు పదోన్నతిపైనా ఆరోపణలు

- దర్యాప్తు బాధ్యత సీఐడీకా? లేక సిట్ చేతికా??
- పంజాగుట్ట ఠాణా ప్రక్షాళన ఈ కేసు కోసమేనా!

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు నిర్వాకంపై ఉన్నతాధికారుల సమగ్ర నివేదిక ప్రభుత్వానికి చేరింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల రోజు రాత్రి.. సీసీ కెమెరాలను స్విచాఫ్ చేయించిన ప్రణీత్‌రావు 45 హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే..! దాంతోపాటు కీలక ఫైళ్లను అతను మాయం చేశాడని అధికారులు భావిస్తున్నారు. రాజకీయంగా అత్యంత సున్నితమైన అంశం కావడంతో.. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చే ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఈ కేసు దర్యాప్తులో ముందుకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

కుట్రలు ముందే గుర్తించి..?

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాగానే.. ప్రభుత్వం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ప్రణీత్‌రావు నిర్వాకంపై పక్కా సమాచారంతో పోలీసు ఉన్నతాధికారులు అతణ్ని బదిలీ చేశారు. అంతేకాదు.. ఎస్ఐబీ కార్యాలయం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ప్రభుత్వ ఆదేశాలు జారీ అయితే.. తొలుత కేసు నమోదు చేయాల్సింది పంజాగుట్ట పోలీసులే..! ఈ క్రమంలోనే ప్రభుత్వం చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఇటీవల పంజాగుట్ట ఠాణా మొత్తాన్ని ప్రక్షాళన చేసింది. హోంగార్డు మొదలు.. ఎస్‌హెచ్‌వో వరకు అందరినీ బదిలీ చేసింది. నిజానికి నగరం నడిబొడ్డున ఉండే పంజాగుట్ట ఠాణా అత్యంత కీలకమైనది. ఏ ఠాణాలో లేని విధంగా ఇక్కడ భారీ స్థాయిలో ఎస్సైల సంఖ్య ఉంటుంది. ఈ ఠాణాలో చీమ చిటుక్కుమన్నా.. గత సర్కారు పెద్దలకు తెలిసిపోతోందని అధికారులు గుర్తించారు. ప్రణీత్‌రావు కేసును వెలికితీసే క్రమంలోనే ఠాణా మొత్తాన్ని ప్రక్షాళన చేసినట్లు స్పష్టమవుతోంది. పోలీసు శాఖలో కూడా ఇప్పుడు ఇదే చర్చనీయాంశంగా ఉంది.

ప్రభుత్వం ఆదేశిస్తే బలమైన కేసు..!


ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే.. బలమైన సెక్షన్లతో కేసు నమోదు చేసేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉంది. ఎలాంటి అనుమతి లేకుండా అప్పటి విపక్ష నేతల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించి ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్‌లోని చట్టాల కింద కేసు నమోదు చేయనున్నారు. అంతేకాదు.. రహస్య సమాచార సేకరణ, వ్యక్తిగత వివరాల తస్కరణ(ఐటీ చట్టం), హార్డ్‌డిస్క్‌లను నాశనం చేసినందుకు ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంతోపాటు.. కుట్ర, విధుల దుర్వినియోగం, ఇతర క్రిమినల్ కేసులను నమోదు చేసే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇక కేసు నమోదయ్యాక.. ప్రణీత్‌రావును విచారిస్తే.. ఈ తతంగం వెనక ఉన్న పెద్దలెవరు? అనే వివరాలు బయటపడతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఓ ఉన్నతాధికారి ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. డీజీపీ ప్రణీత్‌రావును సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో అనుమతి లేకుండా ఆయన జిల్లా హెడ్‌క్వార్టర్‌ను దాటి వెళ్లడానికి వీల్లేదని ఆదేశించారు. దీన్నిబట్టి.. ఒక్కసారి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే.. పోలీసు శాఖ రంగంలోకి దిగుతుందని స్పష్టమవుతోంది. మరోవైపు.. ప్రణీత్‌రావు పదోన్నతి విషయంలోనూ అప్పట్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందాయని తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రణీత్‌రావు బ్యాచ్ మొత్తంలో ఆయన ఒక్కడికే ప్రమోషన్ వచ్చిందని.. నిజానికి అతను పదోన్నతికి అర్హుడు కాదని ఓ ఉన్నతాధికారి స్పష్టం చేసినట్లు తెలిసింది. సదరు ఉన్నతాధికారి సెలవులపై వెళ్లిన సమయంలో.. ఆగమేఘాల మీద ప్రణీత్‌రావు పదోన్నతి ఫైల్ క్లియర్ అయినట్లు సమాచారం.

సీఐడీకా... సిట్‌కా..?

అత్యంత సంచలనాత్మకంగా మారిన ఈ కేసు తీవ్రత నేపథ్యంలో దర్యాప్తు బాధ్యతలను సీఐడీకి అప్పగిస్తారని తెలుస్తోంది. లేనిపక్షంలో ఓ ఉన్నతాధికారి నేతృత్వంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)ను ఏర్పాటు చేసి, దర్యాప్తును కొనసాగిస్తారని సమాచారం. పోలీసు పెద్దలు, రాజకీయ ప్రముఖుల ప్రమేయం ఉన్న నేపథ్యంలో అత్యంత పకడ్బందీగా, గోప్యంగా కేసు దర్యాప్తు కొనసాగాల్సి ఉంటుంది. శాంతి భద్రతల విభాగం కేసు నమోదు చేస్తే.. గోప్యత పాటించడం కొంత ఇబ్బందికర పరిస్థితి ఉంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఐడీకి లేదా సిట్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉచితంగా విద్య, వైద్యం చాలు!

- రాష్ట్ర ఆర్థిక స్థితిని నేతలు మరిచిపోతున్నారు
- రాజకీయ హామీల చట్టబద్ధతకు చర్యలు చేపట్టాలి
- హామీల అమలుపై ప్రజలు ప్రశ్నించాలి: వెంకయ్యనాయుడు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 7: ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందిస్తే చాలని, మిగతావి ఉచితంగా ఇచ్చే వ్యవస్థను తాను వ్యతిరేకిస్తున్నానని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుడు వంగల్లు కోదండరామిరెడ్డి జీవిత విశేషాలతో ముద్రించిన పుస్తకాన్ని గురువారం నెల్లూరులోని డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఫంక్షన్ హాలులో వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు తమ సొంత డబ్బును ఉచితంగా ఇస్తే తప్పు లేదని, అయితే, ప్రజాధనాన్ని ప్రజలకే ఇవ్వడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు ఉచితాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో మరిచిపోతున్నారని విమర్శించారు. ప్రజలకు చేయూత ఇచ్చే కార్యక్రమాలను చేపట్టేలా అడుగులు వేయాలని సూచించారు. ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలను ఏవిధంగా అమలు పరుస్తారో ప్రజలు ఆయా పార్టీలను ప్రశ్నించాలన్నారు. ప్రజలకు రాజకీయ నేతలు ఇచ్చే హామీలకు చట్టబద్ధత కల్పించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నాడు విలువలతో కూడిన రాజకీయాలు ఉండేవని, ఇవాళ రాజకీయాల్లో విలువలు కొరవడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు ఎక్కువయ్యాయని, అది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

15 నుంచి ఒంటిపూట బడులు!

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- పదో తరగతి పరీక్షా కేంద్రాలుంటే మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల దాకా
- టెన్త్ హాల్‌టికెట్లు సిద్ధం.. 2,676 పరీక్ష కేంద్రాలు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ఈ మేరకు గురువారం పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం చివరి రోజైన ఏప్రిల్ 23 వరకు ఇదే పద్ధతి కొనసాగనుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుంది. విద్యార్థులకు 12.30 గంటలకు మధ్యాహ్న భోజనాన్ని అందించాల్సి ఉంటుంది. అయితే.. పదో తరగతి పరీక్షల కేంద్రాలున్న పాఠశాలల్లో మాత్రం మధ్యా హ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.



టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. ఈ సారి సైన్స్ పరీక్షను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. పార్ట్-1లో ఫిజికల్ సైన్స్ పార్ట్-2లో బయాలజీ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు జరగనున్నాయి. కాగా ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు 5,08,385 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. మొత్తం 2,676 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం (040-23230942)ను సంప్రదించి, విద్యార్థులు అవసరమైన సేవలను పొందవచ్చని అధికారులు సూచించారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే పాఠశాలలకు పంపించారు. అలాగే www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి కూడా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. హాల్ టికెట్లలో పొరపాట్లు ఉంటే.. సంబంధిత ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కాగా, ఇంటర్ సెకండ్ ఇయర్ మ్యాథ్స్, జంతుశాస్త్రం, చరిత్ర పరీక్షల్లో మొత్తం 13 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. గురువారం జరిగిన ఈ పరీక్షలకు 3,75,157 మంది హాజరు కావాల్సి ఉండగా 3,66,389 మంది విద్యార్థులు హాజరయ్యారు. కరీంనగర్‌లో 2, వికారాబాద్‌లో 9, ములుగులో 2 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి.

మేడిగడ్డలో ఎన్‌డీఎస్‌ఏ బృందం

7 గంటల పాటు ప్రాజెక్టు బ్యారేజీ వద్దే.. నీటి నిల్వను బ్యారేజీ తట్టుకోగలదా?

- ప్రవాహాన్ని తట్టుకునే సామర్థ్యం ఉందా?
- పగుళ్లకు దారితీసిన పరిస్థితులపై అధ్యయనం
- నేడు సుందిళ్ల బ్యారేజీ పరిశీలన
- 20 రకాల సమాచారం ఇవ్వండి
- కాళేశ్వరం 3 బ్యారేజీల వివరాలు కోరిన అయ్యర్ కమిటీ

భూపాలపల్లి, హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల బృందం పరిశీలించింది. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల బృందం గురువారం తొలుత మేడిగడ్డను సందర్శించి, దెబ్బతిన్న పియర్లను పరిశీలించింది. బ్యారేజీలో దెబ్బతిన్న ఏడో బ్లాక్‌లోని 19, 20, 21, 22 పిల్లర్ల వద్ద తనిఖీలు జరిపి.. పిల్లర్లు కుంగిపోవడానికి దారి తీసిన పరిస్థితులపై బృందం అధ్యయనం చేసింది. తొలుత దెబ్బతిన్న ప్రాంతంలో వంతెన పైభాగాన్ని పరిశీలించి.. ఆ తర్వాత పిల్లర్ నంబరు 19 నుంచి 22 వరకు దాదాపు 45 నిమిషాల పాటు నిపుణులు అధ్యయనం చేశారు. గేట్ల వద్ద దెబ్బతిన్న పియర్స్ మహారాష్ట్ర వైపు ఉండటంతో దిగువ భాగానికి వెళ్లి డ్యామ్ అంతర్భాగంలో పగుళ్లకు దారితీసిన పరిస్థితులపై వివిధ కోణాల్లో ఆరా తీశారు. పియర్స్ మధ్య భాగంలో నిర్మించిన కాంక్రీట్ దిమ్మెల మధ్య ఏవైనా పగుళ్లు ఏర్పడ్డాయా? అనే కోణంలోనూ పరీక్షించారు నిర్మాణ సంస్థ అవసరమైన నాణ్యతా ప్రమాణాలను పాటించిందా.. లేదా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు దెబ్బతిన్న పిల్లర్ల వద్ద నమూనాలను సేకరించారు. పిల్లర్ల మధ్య, అడుగుభాగాన మట్టి నాణ్యతను పరీక్షించేందుకు నమూనాలను సేకరించారు. ఉదయం 9.34 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభమైంది. మధ్యాహ్నం 1.45 వరకు భోజన విరామం తర్వాత మళ్లీ 3 గంటల నుంచి 5.30 వరకు సుమారు 7 గంటల పాటు సుదీర్ఘంగా నాణ్యత, డిజైన్, నిర్మాణ లోపాలు, పిల్లర్ల నిర్మాణం సందర్భంగా తవ్విన బోర్ హోల్ సాంకేతిక సమాచారం, భౌగోళిక, భూ సాంకేతిక సమాచారాన్ని తీసుకున్నారు. అలాగే ఇంకా ఏమైనా ఇతరత్రా భౌతిక కారణాలు ఉన్నాయా? పిల్లర్లు కుంగడంలో ఏమైనా కుట్ర ఉందా? మట్టి నాణ్యత ఎలా ఉంది? పిల్లర్ల నుంచి డ్యాం గేట్ల వరకు అడుగుభాగాన నిర్మించిన సిమెంట్ రాఫ్ట్ సరిగా ఉందా? ఎంత మందంతో నిర్మించారు? అనే అంశాలను పరిశీలించారు. డ్యాం నిర్మాణం నీటి నిల్వ, నీటి ప్రవాహాన్ని తట్టుకునే సామర్థ్యం కలిగి ఉందా? తదితర విషయాల్లో సుదీర్ఘంగా పరీక్షలు జరిపి సమాచారాన్ని సేకరించారు. సీసీ బ్లాక్స్, రాఫ్ట్‌లను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.


మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తున్న నిపుణుల బృందం

3 బ్యారేజీలపై 20 రకాల సమాచారం ఇవ్వండి

నిరుడు అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్ కుంగిపోవడంతో అప్పట్లో ఎన్డీఎస్ఏ నియమించిన మరో నిపుణుల కమిటీ ఆ బ్లాక్‌కి సంబంధించిన 20 రకాల సమాచారాన్ని సమర్పించాలని అప్పట్లో రాష్ట్ర నీటిపారుదల శాఖను కోరింది. తాజాగా చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ సైతం మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోని అన్ని బ్లాకులకు సంబంధించిన అదే 20 రకాల సమాచారాన్ని తమకు అందజేయాలని సూచించింది. మేడిగడ్డ బ్యారేజీ కింద భూగర్భంలో రాతిపొరల నిర్మాణ క్రమాన్ని తెలియజేసే 'జియోలాజికల్ సెక్షన్' డేటా, ప్రత్యేకించి బ్యారేజీకి సంబంధించిన ఒక్కో విభాగానికి సంబంధించిన 'సెక్షనల్ డ్రాయింగ్'లను రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా సమర్పించడంపై గతంలో ఎన్డీఎస్ఏ తీవ్ర అభ్యంతరం తెలిపింది. లోతైన పరిశీలన కోసం జియోలాజికల్ వివరాలతో కూడిన బ్యారేజీ విభాగాల డ్రాయిం గ్స్ (సెక్షనల్ డ్రాయింగ్స్) ను సమర్పించాలని కోరింది. ఇలాంటి డ్రాయింగ్స్‌ను తయారు చేయకుండానే బ్యారేజీని నిర్మించడంతో అప్పట్లో వాటిని సమర్పించలేకపోయారు. ఎన్డీఎస్ఏ పదేపదే కోరుతుండటంతో ఇటీవల జియోలాజికల్ వివరాలతో కూడిన సెక్షనల్ డ్రాయింగ్స్‌ను రూపొందించి నీటిపారుదల శాఖ ఎన్డీఎస్ఏకు పంపించింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ వ్యవస్థను రద్దు చేశామని, ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన నివేదికలేవి తమ వద్ద లేవని ఎన్డీఎస్ఏకు రాతపూర్వకంగా తెలియజేసింది.

ఎల్అండ్‌టీ కనుసన్నల్లోనే

నిపుణుల బృందం పర్యటన అత్యంత పకడ్బందీగా సాగింది. బృందం పరీక్షలు నిర్వహించే ప్రాంతానికి నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ సిబ్బందిని విననహాయిస్తే బయట వారిని ఎవరినీ అనుమతించలేదు. ముఖ్యంగా మీడియాను రాకుండా పోలీసులు నాకాబందీ నిర్వహించారు. వంతెనపైనుంచి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. నిపుణుల బృందం పర్యటనకు నిర్బంధాలు లేకున్నా తనిఖీలు, పరీక్షల సందర్భంగా సమాచారాన్ని బయటకు పొక్కనీయకుండా ఎల్అండ్‌టీ సంస్థ పోలీసుల సహాయంతో గోప్యత పాటించిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని బృందంలో న్యూఢిల్లీకి చెందిన సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ యు.సి.విద్యార్థి, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) డైరెక్టర్ శివ కుమార్ శర్మ, డ్యాం గేట్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ రెజిలియన్స్ డైరెక్టర్ రాహుల్ కుమార్ సింగ్, డైరెక్టర్ టెక్నికల్ టీం అమితాబ్ మీనా, ఎన్‌డీఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ సన్నీ యాదవ్, సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ పూణేకు చెందిన శాస్త్రవేత్త ఆర్. పాటిల్ ఉన్నారు.

నేను ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటా

- గెలిస్తే బీఆర్ఎస్ దుకాణం బంద్ చేస్తారా?
- ప్రజాహిత యాత్రలో కేటీఆర్‌కు బండి సంజయ్ సవాల్



చొప్పదండి, మార్చి 7: 'కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా.. గెలిస్తే బీఆర్ఎస్ దుకాణం బంద్ చేస్తారా?'..అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్.. కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గురువారం కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలో నిర్వహించిన ప్రజాహిత యాత్రలో భాగంగా పలు గ్రామాల్లో పాదయాత్ర చేసి చొప్పదండిలో ఆయన మాట్లాడారు. 'కేటీఆర్ నీ సవాల్‌కు నేను సిద్ధం. కేసీఆర్‌ను తీసుకురా.. కరీంనగర్‌కు ఎవరేం చేశారో చర్చించేందుకు సిద్ధం' అని ఆయన అన్నారు. దమ్ముంటే తన సవాల్‌కు స్పందించి రావాలన్నారు. కరీంనగర్ అభివృద్ధితోపాటు తాను చేసిన పోరాటాలు, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై కరీంనగర్ కమాన్ వేదికగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రాముడి పేరు చెప్పుకుని ఆనాడు ఎన్టీఆర్ వద్ద ఎమ్మెల్యే టికెట్ సంపాదించింది కేసీఆర్ అన్నారు. కేటీఆర్ అసలు పేరు అజయ్‌రావు అయితే ఎన్టీఆర్ దగ్గర టికెట్ కోసం తారక రామారావు అని పేరు పెట్టాడని విమర్శించారు. దేవుడిని నమ్మని కేటీఆర్‌కు రాముడి గురించి మాట్లాడడానికి సిగ్గుండాలన్నారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలను అభివృద్ధి చేస్తానని మోసం చేసింది కేసీఆర్ అన్నారు. అన్ని పనులకు మోదీ నిధులు ఇస్తే.. కాంగ్రెస్‌కు ఓటు వేశారని, ఈసారి మాత్రం అలా చేయవద్దని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ప్రధాని అభ్యర్థి ఎవరో తెలియదంటూ ఎద్దేవా చేశారు.

తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ ఎండీపై వేటు!

కేశవులును తప్పించాలని మంత్రి తుమ్మల ఆదేశాలు.. ఐఏఎస్ అధికారి హరితకు ఎండీగా బాధ్యతలు

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులుపై రాష్ట్ర ప్రభుత్వం వేటు వేసింది. కేశవులును తక్షణమే బాధ్యతల నుంచి తొలగించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. కేశవులు స్థానంలో రాష్ట్ర విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి హరితకు బాధ్యతలను అప్పగించారు. ఐఏఎస్ అధికారి అయిన హరిత రాష్ట్ర సహకారశాఖ రిజిస్ట్రార్‌గా కూడా పూర్తి అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. తాజాగా సీడ్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. సీడ్స్ కార్పొరేషన్, సీడ్ సర్టిఫికేషన్ అథారిటీలో జరిగిన అవకతవకలపై నెలరోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావును మంత్రి తుమ్మల ఆదేశించారు. 'సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం కథనం ప్రచురితమైన విషయం విదితమే! జయశంకర్ యూనివర్సిటీలో విత్తన పరిశోధన విభాగానికి చెందిన ప్రొఫెసర్ కె.కేశవులు సుదీర్ఘ కాలంగా జోడు పదవుల్లో(కార్పొరేషన్ ఎండీ, సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్) కొనసాగుతున్నారు. ఈ రెండు సంస్థల్లో పలు అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. 'ఇస్టా' కాంగ్రెస్ పదవిని అడ్డంపెట్టుకొని ఏకంగా 28 విదేశీ పర్యటనలు చేశారు. ఈ అంశాలపై పరిశోధనాత్మక కథనాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, చర్యలకు ఉపక్రమించింది. మంత్రి తుమ్మల గురువారం ఉదయమే చకచకా నిర్ణయాలు తీసుకున్నారు. సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.


వ్యవసాయ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

గత పదేళ్ల చిట్టా తీయండి..


వ్యవసాయం, ఉద్యాన, మార్కెటింగ్, సహకార అనుబంధ శాఖల పరిధిలోని పలు కార్పొరేషన్ల పనితీరుపై మంత్రి తుమ్మల గురువారం నాటి సమీక్ష సందర్భంగా అసంతృప్తి వ్యక్తంచేశారు. గడిచిన పదేళ్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. అవసరమైతే ఇంతకు ముందు తీసుకున్న నిర్ణయాలను పునఃసమీక్షించి సంస్థకు, రైతులకు మేలు చేకూర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. విచారణ బాధ్యతలను ఐఏఎస్ అధికారులు హరిత, డాక్టర్ గోపిలకు అప్పగించారు. పదిరోజుల్లో నివేదికను అందజేయాలని ఆదేశించారు. డాక్టర్ గోపికి 5 కార్పొరేషన్ల విచారణ బాధ్యతలను అప్పగించారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర రైతుబంధు సమితి, విత్తన-సేంద్రియ ధ్రువీకరణ సంస్థ, టీఎస్-ఆగ్రోస్, వేర్ హౌసింగ్ కార్పొరేషన్, హైదరాబాద్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ అసోసియేషన్(హాకా) ఉన్నాయి. టీఎస్-మార్క్‌ఫెడ్, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, స్టేట్ కో-ఆపరేటివ్ రూరల్ ఇరిగేషన్ కార్పొరేషన్, టీఎస్ కో-ఆపరేషన్ యూనియన్, టీఎస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ ఫెడరేషన్లలో పదేళ్ల కార్యకలాపాలపై విచారణ బాధ్యతలను హరితకు అప్పగించారు. మరోవైపు ఉద్యాన అభివృద్ధి సంస్థపై విచారణ బాధ్యతలను ఆ శాఖ డైరెక్టర్ అశోక్‌రెడ్డి నిర్వర్తిస్తారు.

ఇస్టా బాధ్యతలతోనే విదేశీ పర్యటనలు: డాక్టర్ కె. కేశవులు

కేంద్ర ప్రభుత్వం విడుదలచేసిన రూ.40 లక్షల నిధులతో స్టేట్ కో-ఆపరేటివ్ రూరల్ ఇరిగేషన్ కార్పొరేషన్(టీఎస్-సీఆర్ఐసీ)ద్వారా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీ ప్రాంగణంలో జీవోటీ ఫామ్‌ను అభివృద్ధి చేసినట్లు రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇస్టా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికవటంతో.. ఈ పదవిలో ఉన్నంతవరకు విత్తనాభివృద్ధి సంస్థ ఎండీగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణ సర్కారుకు సిఫారసు చేసిందని, అందుకు అనుగుణంగానే విధులు నిర్వర్తిస్తున్నట్లు వివరించారు. ఇస్టా కాంగ్రెస్ వైస్ చైర్మన్, అధ్యక్ష హోదాలోనే విదేశీ పర్యటనలు చేశానని, మెజారిటీ పర్యటనలకు సంబంధించిన ఖర్చులన్నీ ఇస్టానే భరించిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా విదేశాల్లో జరిగే సమావేశాల్లో ఇస్టా ప్రెసిడెంట్ హోదాలో పాల్గొనాల్సి ఉంటుందని వెల్లడించారు. సీడ్ సర్టిఫికేషన్ రిజిస్ట్రేషన్లను ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్‌కు మార్చటంతోనే.. రిజిస్ట్రేషన్లలో హెచ్చుతగ్గులు కనిపించాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇస్టా కాంగ్రెస్ నిర్వహణలో నిధుల గోల్‌మాల్ జరగలేదని తెలిపారు.

మెడకు తాడు బిగించి.. భర్త ప్రాణం తీసి..

- ఆత్మహత్యగా చిత్రీకరించిన భార్య
- కూతురు, అల్లుడితో కలిసి ఘాతుకం
- ఆర్థిక సమస్యలకు తోడు కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని హత్య
- ముగ్గురు నిందితుల అరెస్టు



తూప్రాన్, మార్చి 7: ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏర్పడిన మనస్పర్థలకు తోడు కుమార్తెను వేధిస్తున్నాడనే కారణంతో భర్తపై కోపం పెంచుకున్న భార్య ఘాతుకానికి పాల్పడింది. కూతురు, అల్లుడితో కలిసి భర్తను హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించి తప్పించుకోవాలని చూసింది. కానీ పోస్టుమార్టం నివేదిక అసలు నిజాన్ని బయటపెట్టింది. మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఫిబ్రవరి 11న జరిగిన ఈ హత్య కేసులో నిందితులు ముగ్గురు గురువారం కటకటాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన సైదాబేగం(40)కు కుమార్తె మహెక్ బేగం(19) పుట్టిన వెంటనే భర్త అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో అజీ పాషా(44) అనే వ్యక్తిని ఆమె వివాహం చేసుకోగా వారికి ఇద్దరు పిల్లలు పుట్టారు. లారీ డ్రైవర్‌గా పని చేసే పాషా, భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి తూప్రాన్‌లోని రావెల్లిలో నివాసముండేవారు. ఇటీవల డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు కావడంతో అక్కడికి మకాం మార్చారు. అయితే, సైదాబేగం మొదటి భర్త కూతురైన మహెక్ పట్ల అజీపాషా అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఈ క్రమంలో మహెక్ బేగంకు లంగర్‌హౌజ్‌కు చెందిన పాషా(25)తో ఫిబ్రవరి 5న వివాహం చేశారు. ఈ పెళ్లి ఖర్చులు, డబుల్ బెడ్‌రూం ఇల్లు గృహ ప్రవేశానికి చేసిన అప్పుల విషయంలో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మహెక్ బేగం తన భర్తతో కలిసి ఫిబ్రవరి 9న పుట్టింటికి వచ్చింది. అప్పుడు కూడా మహెక్ బేగం పట్ల అజీ పాషా అసభ్యంగా ప్రవర్తించాడు. ఆర్థిక సమస్యలకు తోడు కూతురి విషయంలో పద్ధతి మార్చుకోకపోవడంతో అజీపాషాను హతమార్చాలని సైదా బేగం నిర్ణయించుకుంది. ఫిబ్రవరి 11వ తేదీ రాత్రి కూతురు, అల్లుడి సాయంతో అజీపాషా మెడకు తాడు బిగించిన సైదాబేగం ఊపిరాడకుండా చేసి ప్రాణం తీసింది. అనంతరం, హత్యా నేరం నుంచి తప్పించుకునేందుకు.. అప్పుల బాధ తాళలేక అజీపాషా ఉరేసుకున్నాడని కట్టుకథ అల్లారు. ఈ మేరకు పోలీసులూ కేసు నమోదు చేశారు. అయితే, పోస్టుమార్టం నివేదిక అనుమానం రేకెత్తించడంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో సైదా బేగం, మహెక్ బేగం, పాషాను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

వీరభద్రస్వామి ఆలయం స్వాధీనంపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, మార్చి 7: మచిలేశ్వరనాథ్ ఆలయంగా పేరొందిన రంగారెడ్డి జిల్లాలోని వీరభద్రస్వామి ఆలయాన్ని తెలంగాణ ప్రభుత్వ తమ పరిధిలోకి తీసుకోవడంపై సుప్రీం కోర్టు గురువారం స్టే విధించింది. ఆలయ అర్చక బృందం, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య భూ వివాదం నేపథ్యంలో ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకొస్తూ ఎగ్జిక్యూటివ్ అధికారి (ఈవో)ని నియమించారు. దీనిని సవాలు చేస్తూ అర్చక బృందం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో డిసెంబరు 29, జనవరి 25న తెలంగాణ దేవాదాయ శాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టు బెంచ్ స్టే విధించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నిర్దోషి సాయిబాబా

ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, కవి, రచయిత జి.ఎన్. సాయిబాబా గురువారం ఉదయం నాగపూర్ జైలు నుంచి విడుదలైనప్పుడు, ఆయన అభిమానులలో, మిత్రులలో, ఉద్యమసహచరులలో రెండురోజులుగా భయకలవరాలతో సాగుతున్న నిరీక్షణ ముగిసినట్టయింది. నిజానికి గత మంగళవారం నాడు మహారాష్ట్ర హైకోర్టు నాగపూర్ బెంచి సాయిబాబాను, ఆయనతో పాటు మరో అయిదుగురిని నిర్దోషులుగా ప్రకటించినప్పుడే, నిర్బంధితుల ఆత్మీయులతో పాటు, దేశవ్యాప్తంగా వారి విడుదల కోసం ఉద్యమించిన ప్రజాస్వామిక వాదులంతా పెద్ద ఊరట పొంది ఉండాలి. కానీ, ఆ సంతోషం వెనుక ఒక భయం కత్తిలాగా వేలాడింది. 2022 అక్టోబర్‌లో జరిగినట్టు మళ్లీ జరుగుతుందా? ఈసారి కూడా విడుదలకు సుప్రీంకోర్టు చక్రం అడ్డు వేస్తుందా? అన్న ప్రశ్నలు ఉపశమనాన్ని ఉద్రిక్తతతో నింపివేశాయి.

నిందితుడు హైకోర్టుకు అపీలు చేసుకున్నప్పుడు, విచారణ పూర్తయ్యేదాకా కిందికోర్టు శిక్ష అమలును నిలిపివేయడం సాధారణంగా జరిగే పని. కేసు కొట్టివేసినప్పుడు ప్రాసిక్యూషన్ కూడా అపీలుకు వెళ్లవచ్చు కానీ, నిర్దోషిత్వ ప్రకటనను నిలిపివేయడం ఆనవాయితీ కాదు. కానీ, ఏడాదిన్నర కిందట, ఇదే హైకోర్టు ప్రక్రియాపరమైన కారణాలతో ఇదే కేసును కొట్టివేసినప్పుడు, మహారాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద సుప్రీంకోర్టును ఆశ్రయించడం, అత్యున్నత న్యాయస్థానం అంతే వేగంతో తీర్పును నిలిపివేయడం జరిగాయి. ప్రమాదకరమైన అభియోగాలున్న కేసులో ప్రక్రియా కారణాలతో కేసును ఎట్లా కొట్టివేస్తారు అని సుప్రీంకోర్టు అప్పుడు ప్రశ్నించింది. సాంకేతిక అంశాల ఆధారంగా కాక, ఈ సారి కేసులోని అంశాల ఆధారంగానే తీర్పు వచ్చినప్పటికీ, మరేదో మెలిక ముందుకు వచ్చి, సుప్రీంకోర్టులో అపీలు విచారణ ముగిసేదాకా నిర్బంధంలోనే కొనసాగాలన్న ఆదేశం వస్తుందేమోనన్న అనుమానం, భయం అందరిలో ఏర్పడ్డాయి. పదేళ్ల పాటు నడిచిన కేసులో, సుమారు ఎనిమిదేండ్లకు పైగా జైలు జీవితం గడిపి, న్యాయం దక్కించుకున్న సాయిబాబా విడుదలైన సందర్భంలో దేశంలో నెలకొని ఉన్న భయానక వాతావరణానికి ఈ రెండురోజుల ఉత్కంఠ ఒక గుర్తు. న్యాయస్థానం తీర్పు అమలు జరుగుతుందన్న నమ్మకం లేదు. ఏ తీర్పు తరువాతైనా ప్రభుత్వం తాను అనుకున్నది చేయగలదన్న భయం ఉన్నది. చట్టబద్ధపాలనపై పాలకులకు ఉండవలసిన విశ్వాసం ప్రజాస్వామ్యానికి ఒక ముఖ్యమైన షరతు. ప్రజాస్వామిక వ్యవస్థలన్నీ అస్వతంత్రంగా మారిపోయినప్పుడు, ఆ పరిపాలనకు నియంతృత్వమనో, ఫాసిజమనో ఏదో ఒక పేరుతో విమర్శలు రావడం సహజం.

సాయిబాబా ఆలోచనాపరుడు. తనదైన మంచీచెడ్డా విచక్షణ కలిగినవాడు. ఇప్పుడున్న సమాజం, పరిపాలన, విలువలు బాగాలేవని, వీటిని మార్చుకోవాలని తపించే వ్యక్తి. తన విద్యార్థులతో కూడా జ్ఞానాన్ని, వివేచనను పంచుకునేవాడు. ప్రశ్నలను ప్రోత్సహించేవాడు. అటువంటి వ్యక్తికి మావోయిస్టు సంబంధాలను ఆపాదించి, ఊపా చట్టం కింద తీవ్రమైన అభియోగాలను మోపి మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనను నిందితుడిని చేసింది. రాష్ట్రప్రభుత్వం నిమిత్తమాత్రమే, తెరవెనుక నడిపించిందంతా కేంద్రప్రభుత్వమే. ప్రజాఉద్యమాలతో కలసి నడిచే మేధావులను అర్బన్ నక్సలైట్లని పిలుస్తూ, వారిమీద తీవ్రనిర్బంధాన్ని ప్రయోగించాలన్న జాతీయ విధానం ఆధారంగానే సాయిబాబా కేసు కానీ, ఆ తరువాత రూపొందించిన భీమాకోరేగావ్ కేసు గానీ నడిచాయి, నడుస్తున్నాయి. చక్రాల కుర్చీ ద్వారానే కదలగలిగిన 90 శాతం వికలాంగుడిగా సాయిబాబా శారీరక పరిస్థితి, ఆయనను అండాసెల్‌లో నిర్బంధించడానికి కానీ, జైలులో కనీస సదుపాయాల కల్పనకు నిరాకరించడానికి కానీ, సెషన్స్ న్యాయస్థానం తీర్పు అనంతర అపీళ్ల విచారణలో జాప్యంలో కానీ అడ్డు కాలేదు. ఈ క్రమంలో భారతదేశంలో మానవహక్కుల పరిస్థితికి సాయిబాబా ఒక అంతర్జాతీయ చిహ్నంగా మారిపోయారు. కేంద్రప్రభుత్వం కూడా స్వతంత్రంగా, హేతుబద్ధంగా ఆలోచించగలిగేవారందరికీ ఒక హెచ్చరికగా ఉండాలని సాయిబాబా కేసులో తీవ్రకాఠిన్యాన్ని ప్రదర్శించింది. భీమాకోరేగావ్ కేసులో స్టాన్‌స్వామి మరణించినట్టే, ఈ కేసులో కూడా పాండు నరోటే అనే నిందితుడు మరణించారు. మంగళవారం నాటి తీర్పుతో మరణానంతర నిర్దోషిత్వాన్ని పొందాడు.

ఈ తీర్పు మీద మహారాష్ట్ర ప్రభుత్వం అపీలుకువెళ్లింది, నిర్దోషిత్వ తీర్పు మీద స్టే ఇవ్వమని కూడా అడిగింది. కానీ మరోసారి బాహాటపు అన్యాయానికి ఆస్కారం లేకుండా ఏదో అడ్డుపడి, విడుదల జరిగింది. 'స్టే' సంగతి ఇంకా తెలియదు కానీ, అపీలు మీద సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుంది. నాగపూర్ బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ వాల్మీకి మెనెజెస్, వినయ్ జోషి తమ తీర్పుకు ఇచ్చిన వివరణలను చూస్తే, సాయిబాబా మీద మోపిన అభియోగాలన్నీ తప్పుల తడక అని, మానవ, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలు, అనుమతులు ఏవీ సక్రమంగా లేవని అర్థమవుతుంది.

ప్రజల హక్కులను అనుమతించని పాలనల్లో, కర్కశమైన నిర్బంధ విధానాలు కొనసాగుతూనే ఉంటాయి. వాటికి ప్రజలు తమ ప్రతిస్పందనలను సహనంతో, సాహసంతో, సృజనాత్మకతతో రూపొందించుకుంటారు. ప్రజాస్వామ్యం సామాన్య ప్రజలకే ఎక్కువ అవసరం.

'పెద్దన్న' వ్యాఖ్యలో తప్పేమిటో...!?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక అధికారిక కార్యక్రమంలో ప్రధానమంత్రిని 'పెద్దన్న లాంటివారు' అనటంలో తప్పు ఏమిటో, దానిని కొందరు ఎందుకు వక్రీకరిస్తున్నారో అర్థం కావటం లేదు. ముఖ్యమంత్రి కాకముందు రేవంత్ రెడ్డి ఏ విధంగా ప్రతిపక్షాలను దుయ్యబట్టారో ప్రస్తుతం అనవసరం. కానీ, ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మంచి సాంప్రదాయాలను నెలకొల్పటానికి ప్రయత్నించటం ప్రజలు గమనిస్తున్నారు. రాజకీయనాయకులు అటు ప్రతిపక్షంలో వున్నా, ఇటు అధికార పక్షంలో వున్నా ప్రత్యర్థులే కాని శత్రువులు కారు. ప్రతిరోజూ ఏదో వంక పెట్టుకొని ఒకరిపై ఒకరు బురద జల్లుకోవటం కాదు, ఒకరినొకరు గౌరవించుకుంటూ ప్రజలకు మేలు చేకూర్చే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తలపెట్టాలి. అంతేగానీ తప్పుకానిచోట తప్పును వెతికే ప్రయత్నం చేయకూడదు. రేవంత్ రెడ్డి తన బాధ్యత గుర్తించబట్టే - ప్రధానమంత్రిని పెద్దన్నగా అభివర్ణిస్తూ ఇవీ రాష్ట్రానికి చేయాల్సిన సహాయాలు, అందించాల్సిన సహకారం అని అడగటంలో స్వచ్ఛమైన సంస్కారం కనబడుతున్నది. అధికార కార్యక్రమాలలో ముఖ్యమంత్రి - ప్రధానమంత్రితో ఏ విధంగా వ్యవహరించాలో ఇది చెబుతున్నది. తరువాత జరిగిన పార్టీల కార్యక్రమాలలో అటు నరేంద్రమోదీ బీజేపీ నాయకుడిగా, ఇటు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఒకరినొకరు విమర్శించుకున్న సంగతి ఈ 'పెద్దన్న' విషయంలో వక్రీకరణలు చేస్తున్నవారు కావాలనే విస్మరిస్తున్నారు. రేవంత్ రెడ్డి మంచి సాంప్రదాయాలు అవలంబిస్తున్నప్పుడు హర్షించాలి! కోడి గుడ్డు మీద ఈకలు పీకటం రాజకీయ అపరిపక్వతనూ, అజ్ఞానాన్నీ ప్రదర్శించటమే. ఢిల్లీలో తెలుగువారి రాజకీయ ప్రాముఖ్యత తగ్గింది, మళ్ళీ అది పెంచుకునే దిశగా కలిసికట్టుగా కృషిచేయాలని రేవంత్ చేసిన వ్యాఖ్య కూడా ఆయన రాజకీయ విజ్ఞతను కనపరుస్తున్నది.

జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి మద్రాసు నుండి రాజాజీ పదునైన విమర్శలు చేసేవారు. "నేనేది మాట్లాడినా- సౌత్ నుంచి ఒక పెద్దమనిషి తప్పుపట్టటమే పనిగా పెట్టుకున్నారు" అని నెహ్రూ జవాబు ఇచ్చారు కానీ పరుష పదజాలానికి తావివ్వలేదు. నెహ్రూ చనిపోయినప్పుడు 'ఢిల్లీలో గార్డ్ రూం ఖాళీ అయింది, నాకంటే ఎన్నో రెట్లు అన్నిట్లో గొప్పగా వుండే నెహ్రూ మరణం నన్ను జీవచ్ఛవంలా మార్చింది' అన్న రీతిలో రాజాజీ వాపోవటం ఇప్పటికీ చాలామందికి జ్ఞాపకం. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా మండల ఎన్నికల ప్రచార హడావిడిలో ఆదిలాబాదు ప్రాంతంలో పర్యటిస్తున్నప్పుడు అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ భద్రాచలం పర్యటనకు వస్తున్న సంగతి తెలిసింది. -'మీరు అర్థంతరంగా ప్రచారం వదిలిపెట్టి పోవల్సిన అవసరమేమీ లేదు' అని ఎన్టీఆర్‌తో పక్కనవున్నవారు అన్నప్పుడు -ఆయన సున్నితంగా ఓ హెచ్చరిక చేసారు. 'అలా మాట్లాడకండి! ప్రధానమంత్రి ప్రధానమంత్రే! ఆయన నా రాష్ట్రానికి వస్తున్నప్పుడు నేను ముఖ్యమంత్రిగా ఆయనను స్వాగతించటం సాంప్రదాయం. ఎదుటివారిని గౌరవించటం మన గౌరవాన్ని పెంచుతుంది' అని ప్రచార సభలను వాయిదా వేసుకొని మరీ భద్రాచలం వెళ్ళారు. ఎన్.టి.ఆర్ ముఖ్యమంత్రిగా తన బాధ్యతను ఆ విధంగా నిర్వర్తిస్తూనే, రాజకీయ నాయకుడిగా ప్రతిపక్షాలను కూడగట్టి - కూటమిని ఏర్పరిచి రాజీవ్ గాంధీ మీద యుద్ధం చేసిన విషయం విదితమే.

— రావులపాటి సీతారాంరావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

దక్షిణాదిని బీజేపీ గెలుచుకోగలదా?

లక్షద్వీప్ సముద్ర తీరంలో విహారాలు, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో గుడులు, గోపురాల సందర్శన, ఆలయ సేవలు..! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత రెండు నెలల్లో దక్షిణ భారతీయ రాష్ట్రాలలో నాలుగుసార్లు విస్తృత పర్యటనలు జరపడం కేవలం యాదృచ్ఛికమేనా? ఉత్తర, పశ్చిమ భారత రాష్ట్రాలలో ఎన్నికల విజయాలలో బీజేపీ ఒక గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో, దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి కేంద్రీకరించి, సార్వత్రిక ఎన్నికలలో సాధించే స్థానాల సంఖ్యా బలాన్ని మరింతగా పెంపొందించుకునేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృఢ సంకల్పంతో కృషి చేస్తున్నారు. ఉత్తర–దక్షిణ భారత రాష్ట్రాల మధ్య ఆందోళనకరంగా పెరుగుతున్న రాజకీయ అంతరాలను 2024 సార్వత్రిక సమరం అంతమొందిస్తుందా?

2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు 'యాక్సిస్ మై ఇండియా' నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో తదుపరి ప్రధానమంత్రి ఎవరు కావాలని కోరుకుంటున్నారన్న ప్రశ్నకు ప్రతిస్పందనగా ఒక్క దక్షిణాది మినహా దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలోనూ అత్యధికులు రాహుల్ గాంధీ కంటే నరేంద్ర మోదీనే ఇష్టపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలలో 40 శాతం మంది రాహుల్ గాంధీ వైపు మొగ్గు చూపగా అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేవలం 37 శాతం మంది మాత్రమే మద్దతునిచ్చారు. కర్ణాటకలో మటుకు మోదీకే ఎక్కువ మద్దతు లభించింది. ఆ రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాలలో 25ను బీజేపీ కైవసం చేసుకున్నది. తెలంగాణలో బీజేపీ ఆశ్చర్యకరంగా నాలుగు స్థానాలను గెలుచుకున్నది. వింధ్య పర్వత శ్రేణులకు దిగువన ఉన్న మరే రాష్ట్రంలోనూ బీజేపీ ఒక్కటంటే ఒక్క సీటునూ గెలుచుకోలేకపోయింది.

కాలాన్ని లంఘించి 2024కి వద్దాం. త్వరలో మళ్లీ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి దక్షిణాది రాష్ట్రంలోనూ ఒక ప్రత్యేక వ్యూహాన్ని బీజేపీ అనుసరిస్తోంది. కర్ణాటకలో దేవెగౌడ నాయకత్వంలోని జనతాదళ్ (సెక్యులర్)పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకున్నది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలలో అదే పార్టీని 'తండ్రీ – తనయుడి' కుటుంబ నిర్వహణ సంస్థగా బీజేపీ పదే పదే పరిహసించింది. మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్ప, ఆయన కుమారులకు పార్టీలో మళ్లీ కీలక పదవులు కట్టబెట్టడం ద్వారా గతంలో వలే లింగాయత్ సామాజిక వర్గానికి మళ్లీ అధిక ప్రాధాన్యమిచ్చేందుకు బీజేపీ పూనుకున్నదని స్పష్టమయింది. యడ్యూరప్ప ఇప్పుడు అష్టపదులకు పైబడిన వయసున్న వృద్ధ నాయకుడు. అయినప్పటికీ మార్గదర్శక్ మండల్ పదవీ విరమణ నియమాలను ఆయనకు వర్తింపచేసేందుకు బీజేపీ కేంద్ర నాయకత్వం సంసిద్ధంగా లేదు. ఎందుకంటే కర్ణాటకలో బీజేపీకి ప్రజల మద్దతు పొందగల ఏకైక నాయకుడు యడ్యూరప్ప మాత్రమే.

కేరళ విషయానికి వస్తే గత సార్వత్రిక ఎన్నికలలో ఆ రాష్ట్రంలో బీజేపీ ఒక్క సీటును కూడ గెలుచుకోలేకపోయింది. అయితే 12.9 శాతం ఓట్లను మాత్రం మూట గట్టుకున్నది. ఈ సారి కేరళలో తమ పార్టీ పదికి పైగా సీట్లను గెలుచుకోగలదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢంకా బజాయించి చెబుతున్నారు. దీన్ని ఒక బడాయి మాటగా కొట్టివేసినప్పటికీ వామపక్షాలు–కాంగ్రెస్ ప్రాబల్య ద్విధ్రువ రాజకీయ రంగంతో ఒక ప్రభావశీల ప్రతిపక్షంగా రూపొందడం ద్వారా ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంపొందించుకునేందుకు బీజేపీ స్పష్టంగా ప్రయత్నిస్తోంది. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో వామపక్షాలు, కాంగ్రెస్ భాగస్వాములుగా ఉన్నాయి. మరి, అధికారం కోసం తిరువనంతపురంలో తీవ్రంగా పోటీ పడుతూ, కేంద్రంలో జట్టు కట్టడంలో అసంబద్ధంగా లేదా అని బీజేపీ ప్రశ్నిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఇప్పటికీ సరైన ఉనికి లేని పార్టీగా మాత్రమే ఉన్నది. దేశంలో ప్రాంతీయ స్థాయిలో రెండు పార్టీల మధ్య నిజమైన పోరు జరుగుతున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని చెప్పాలి. జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబునాయుడులలో ఎవరు గెలిచినా గెలిచినవారి పక్షంతో బీజేపీ పొత్తు పెట్టుకుంటుంది. తెలంగాణలో బీజేపీ ఎదుర్కొంటున్న చిక్కులు మరింత తీవ్రమైనవి. గత సార్వత్రిక ఎన్నికలలో ఆ రాష్ట్రంలో బీజేపీ నాలుగు సీట్లను గెలుచుకున్నది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో బీజేపీ మూడో స్థానంలో ఉన్నది. అయితే లోక్‌సభ ఎన్నికలు ఆ పార్టీకి కొత్త అవకాశాలు కల్పించనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం నుంచి భారత రాష్ట్ర సమితి ఇప్పటికీ కోలుకోకపోవడంతో బీజేపీ విజయాకాశాలు మెరుగుయ్యాయని చెప్పవచ్చు.



దక్షిణ భారతావనిలో సంపూర్ణంగా విస్తరించేందుకు భారతీయ జనతా పార్టీ చేయవలసిందేమిటి? అధికార కేంద్రీకరణకు ఆరాటపడే ఢిల్లీ పెత్తందారీ ధోరణులను విడనాడి సమాఖ్య పాలనా విధాన స్ఫూర్తికి చిత్తశుద్ధితో నిబద్ధమవ్వాలి. తద్వారా మాత్రమే దక్షిణాది రాష్ట్రాలలో ఆ పార్టీ రాజకీయ పురోగతి సుసాధ్యమవగలదు. ఆర్థిక వనరులను కేటాయించడంలో తమ రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని దక్షిణాది ముఖ్యమంత్రులు తరచూ చేస్తున్న ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిగణనలోకి తీసుకోవాలి.

ఇక మిగిలింది తమిళనాడు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి రావడమనేది బీజేపీకి పలు విధాల ముఖ్యం. ఎందుకంటే ఒక విశిష్ట రాజకీయ సంస్కృతి ఉన్న రాష్ట్రం తమిళనాడు. ఆ విలక్షణ రాజకీయ సంస్కృతి బీజేపీ ప్రపంచ దృక్పథానికి సైద్ధాంతిక సవాళ్లను విసురుతోంది. ఉదాహరణకు ఇటీవల 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని' ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలనే తీసుకోండి. తమ ఓటు బ్యాంకును మరింతగా పటిష్ఠం చేసుకోవడంతో పాటు బీజేపీ హిందూత్వకు తమ బ్రాహ్మణేతర ద్రావిడియన్ గుర్తింపును దీటుగా నిలబెట్టడమే ఉదయనిధి లక్ష్యం. ద్రావిడ రాజకీయ సంస్కృతి ప్రకారం బీజేపీ రాజకీయాలు అగ్రవర్ణ బ్రాహ్మణ హిందూ ధర్మానికి ప్రాతినిధ్యం వహించేవి. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో సామాజిక న్యాయం అసాధ్యమని, ఆ భావనకు బీజేపీ రాజకీయాలలో తావులేదని డీఎంకే విశ్వసిస్తోంది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

హిందూత్వ వ్యతిరేక, బ్రాహ్మణ వాద విరుద్ధ ద్రావిడ ఉద్యమ సైద్ధాంతిక దృక్పథం కాల పరీక్షకు నిలిచి గెలిచింది. అయితే క్రమంగా కొత్త తరాలు కొత్త ఆలోచనలు చేస్తున్నాయి. రాజకీయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. రాజకీయాలలోకి ప్రవేశించిన 39 ఏళ్ల ఐపీఎస్ అధికారి కె.అన్నామలై ఈ కొత్త మార్పులకు ఒక నిదర్శనం తమిళనాడు బీజేపీ అధ్యక్షుడుగా 'కుటుంబ పాలన, అవినీతికి వ్యతిరేకంగా' ఆయన పోరాడుతున్నారు. ఆయన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 100 రోజుల యాత్ర రాష్ట్ర రాజకీయాలలో మౌలిక మార్పులను తీసుకురాలేదుగానీ రాష్ట్రంలో బీజేపీ మనుగడను సుస్థిరం చేసింది. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడిఎంకె జయలలిత మరణానంతరం అంతర్గత కుమ్ములాటలతో కూలిపోయిన తరుణంలో అన్నామలై బీజేపీకి ఎనలేని ప్రాధాన్యాన్ని సాధించారు. రానున్న లోక్‌సభ ఎన్నికలలో సీట్లు పెద్దగా రానప్పటికీ 20 శాతానికి పైగా ఓట్లను బీజేపీ గెలుచుకోగలదని ఇటీవల ఒక సర్వేలో వెలువడడం గమనార్హం.

దక్షిణాది రాష్ట్రాలలో అధికారాన్ని స్వాయత్తం చేసుకోవడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు కాంగ్రెస్ వలే అఖిల భారత రాజకీయ పక్షంగా ఆవిర్భవించాలని ఆ పార్టీ ఎంత ప్రగాఢంగా ఆకాంక్షిస్తుందో స్పష్టం చేస్తున్నాయి. సంఘ్ పరివార్ రాజకీయంగా, సైద్ధాంతికంగా ఒక సహనశీల దృక్పథాన్ని అలవరచుకునేందుకు కూడా ఇది దోహదం చేస్తుంది. 'ఒకే జాతి, ఒకే నాయకుడు, ఒకే మతం' అన్న విశ్వాసం నుంచి సంఘ్ పరివార్ దూరం జరగడానికి ఇది తప్పక దోహదం చేస్తుంది.

లోక్‌సభ ఎన్నికలలో వరుసగా రెండుసార్లు గెలిచినప్పటికీ బీజేపీ మూలాలు ఇప్పటికీ ఉత్తర భారతావని హిందీ–హిందూ–హిందుస్థాన్ రాజకీయాలలో ఉన్నాయి. కర్ణాటకతో పాటు అన్ని దక్షిణాది రాష్ట్రాలలోనూ జయపతాక ఎగురవేయాలంటే బహుళ సంస్కృతులకు ప్రాధాన్యమిచ్చే భారతీయ నాగరికతా ధర్మం వర్ధిల్లేందుకు మరింత సమ్మిళిత ప్రపంచ దృక్పథాన్ని బీజేపీ అనుసరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. హిందూత్వ జాతీయ వాదం తమిళ ఉప జాతీయ వాదంతో సర్దుబాటు చేసుకొని దానికి స్థానం కల్పిస్తుందా? కొత్త పార్లమెంటు భవనంలో ఒక సెంగోల్ (రాజదండం)ను ప్రతిష్ఠించడమనే ప్రతీకాత్మక చర్యకు మాత్రమే పరిమితం కాకుండా హిందీ భాషను దేశ ప్రజలు అందరిపై ఏ విధంగాను రుద్దకుండా భాషా వైవిధ్యాన్ని గుర్తిస్తుందా?

మరీ ముఖ్యంగా అధికార కేంద్రీకరణకు ఆరాటపడే ఢిల్లీ పెత్తందారీ ధోరణులను విడనాడి సమాఖ్య పాలనా విధాన స్ఫూర్తికి బీజేపీ చిత్తశుద్ధితో నిబద్ధమవ్వాల్సిన అవసరమున్నది. తద్వారా మాత్రమే దక్షిణాది రాష్ట్రాలలో ఆ పార్టీ రాజకీయ పురోగతి సుసాధ్యమవగలదు. ఆర్థిక వనరులను కేటాయించడంలో తమ రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతుందని దక్షిణాది ముఖ్యమంత్రులు తరచూ చేస్తున్న ఫిర్యాదులను నిష్పాక్షికంగా పరిగణనలోకి తీసుకోవాలి. ఎన్నికల ప్రయోజనాల నిమిత్తమే ఆ ముఖ్యమంత్రులు అలా మాట్లాడుతున్నారని కొట్టి పారవేయడం వల్ల ఆ ఫిర్యాదులు సమసిపోవు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుపరిచిన పాపానికి, భవిష్యత్తులో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యాన్ని తగ్గించే అసంబద్ధ చర్యలకు ఎట్టి పరిస్థితులలోను పాల్పడకూడదు. నిజమేమిటంటే అక్షరాస్య, విద్యా సంపన్న, ఆర్థికంగా అభివృద్ధి చెందిన, సామాజికంగా ప్రగతిశీల దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే 'వికసిత' సమాజాలుగా వర్ధిల్లుతున్నాయి. విశాల భారతదేశంలోని ఇతర రాష్ట్రాలూ ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలతో సమాన స్థాయికి చేరేందుకు దృఢ సంకల్పంతో, పటిష్ఠ కార్యాచరణతో ముందడుగు వేయాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రాజ్యాధికారంతోనే సాధికారత!

మాతృదేవోభవ అంటూ స్త్రీ గౌరవానికి అగ్రతాంబూలం ఇచ్చిన దేశం మనది. దేశాన్ని భరతమాత అని సంబోధిస్తున్నాం. స్త్రీని దేవతతో సమానంగా పూజించే భారతావనిలో మహిళలపై వేధింపులు నిత్యకృత్యమయ్యాయి. కాశ్మీరం నుంచి కన్యాకుమారి వరకు ఆడవారిపై ఏదో ఒక ఘాతుకం. అలనాటి నిర్భయ ఘటన యావత్ భారతావనిని తీవ్ర వేదనకు గురి చేసింది. ప్రజలు ఆగ్రహంగా ప్రతిస్పందించారు. హత్యాచారాలు లేని భారతదేశం కావాలని ముక్తకంఠంతో నినదించారు. నిర్భయ ఘటన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అటువంటి అకృత్యాలను నివారించడానికి నిర్భయ చట్టానికి రూపకల్పన చేసింది. కఠినమైన శిక్షలు ఉన్నా, ఆలోచనల్లో మార్పు రానంతవరకు ఎన్ని చట్టాలున్నా వృథా. అర్ధరాత్రి ఏ భయం లేకుండా స్త్రీ ఒంటరిగా ఎప్పుడైతే రోడ్లపై వెళ్తుందో అప్పుడే భారతావనికి నిజమైన స్వాతంత్ర్యం అని మహాత్ముడు అంటే, ఇప్పుడు కనీసం పట్టపగలు ఒంటరిగా తిరిగే పరిస్థితులు లేకుండా పోయాయి. గల్లీల్లో తిరిగే అబ్బాయిల నుంచి రాజకీయ నేతల వరకు మహిళలను వేధిస్తున్నారు. మహిళలు కనుక స్వేచ్ఛను కోరుకుంటే నగ్నంగా ఎందుకు తిరగడంలేదని వ్యాఖ్యానించి, స్వేచ్ఛ అనే పదానికి వక్రభాష్యం చెప్పారు హర్యానా సిఎం ఖట్టర్. మహిళా స్వేచ్ఛ వినాశనానికి పునాది అంటూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. మహిళను తీవ్ర ఆగ్రహానికి, ఆవేదనకు గురి చేసే వ్యాఖ్యలు చేశారు మరో బీజేపీ నేత బాబులాల్ గౌర్. కొన్ని సమయాల్లో మానభంగం సరైనదేనట, కొన్ని సమయాల్లో మాత్రమే తప్పట. టీఆరఎస్ పార్టీకి చెందిన ఓ మాజీ మంత్రి బానే ఊపుతున్నావని, మహబూబ్‌నగర్ జడ్పీ చైర్మన్ మహిళను కత్తిలా ఉన్నావని వ్యాఖ్యానించడం... ఇలా రాష్ట్రంలో ఎన్నో సంఘటనలు. తెలంగాణ ఉద్యమంలో పురుషులతో సమానంగా మహిళలు ఉద్యమించారు. జెండాలు మోసి, ప్రత్యేక రాష్ట్రం కోసం వీరోచితంగా పోరాడారు. అయినా కూడా దేశంలోనే మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వాన్ని నడిపిన ఘనత కేసీఆర్‌ది. మహిళా సాధికారత విషయంలో గత ప్రభుత్వ వైఫల్యాలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. తెలంగాణ నుంచి ఇప్పటివరకు ఒక్క బీసీ మహిళ కూడా లోక్‌సభలో అడుగుపెట్టలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇది జరగలేదు.



రాష్ట్రంలో రేవంతన్న ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజులకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ ప్రారంభించి విజయవంతం చేశారు. వంద రోజులు గడవక ముందే మరో రెండు హామీలు ఆడబిడ్డలకు కానుకగా రేవంత్ అన్న అందించారు. జీరో కరెంటు బిల్లు మరియు 500 రూపాయలకే సిలిండర్ అక్కాచెల్లెళ్లకు అందించినారు. తెలంగాణ రాష్ట్రంలో ఆడబిడ్డలు ఆర్థిక పరిపుష్టితో ఎదగాలన్న ఇందిరాగాంధీ లక్ష్యాన్ని రేవంతన్న నెరవేరుస్తున్నారు.

యూపీఏ హయాంలో రాజ్యసభలో బలం ఉండటంతో చారిత్రాత్మకమైన మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదానికి కాంగ్రెస్ కృషి చేసింది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసింది కానీ, ఈ పార్లమెంట్ ఎన్నికల్లోగా దానికి మోక్షం లేకుండా డీలిమిటేషన్‌తో ముడిపెట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ వలె బీసీ మహిళా కోటాను అమలు చేయాలని ఈ మహిళా దినోత్సవాన యావత్ మహిళా లోకం ఆశిస్తున్నది. రాజ్యాధికారంతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుంది.

— **ఇందిరాశోభన్,** కాంగ్రెస్ నాయకురాలు

మహిళా దినోత్సవాన్ని వృథాపోనీయద్దు!

అంతర్జాతీయ మహిళా దినం సందర్భంగా చర్చించుకోవాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. ప్రతిరోజు స్త్రీల మీద హింస పెరిగిపోతోంది. ఎందరో స్త్రీలు చనిపోతున్నారు, లేదా చనిపోతామన్న భయంతో బతుకుతున్నారు. ఇంకెంతోమంది మహిళలు మానసిక జబ్బులకు గురౌతున్నారు. వీటికి పైకి కనిపించే కారణాలు ఏవైనా అంతర్లీనంగా ఏదో విధమైన హింస ఉమ్మడి కారణంగా ఉంది. ఈ తరుణంలో మహిళా దినోత్సవాన్ని సెలబ్రేట్ చేసుకోవటం కంటే దృష్టి పెట్టాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి. ఈ సందర్భాన్ని మహిళలుగా మనం మన లక్ష్యాన్ని నిర్వచించుకునే వేళగానూ, మన పురోగతిని సమీక్షించుకునే అవకాశంగానూ చూడాలి. అంతేతప్ప, వంటల పోటీలు, ఫ్యాషన్ షోలతో ఎంజాయ్ చేసే సందర్భంగా చూడకూడదు.

ప్రధానంగా ఇవాళ స్త్రీలపై జరుగుతున్న హింసను నాలుగు రకాలుగా చెప్పవచ్చు: కుటుంబ హింస, లైంగిక హింస, రాజకీయ హింస, రాజ్యహింస. ఈ హింస నాలుగు గోడల మధ్య, సమాజంలో, రాజ్య యంత్రాంగంలో ఎక్కడైనా జరుగుతోంది. స్త్రీలకు లైంగికంగా, మానసికంగా హాని చేయడం, హాని చేస్తామని బెదిరించడం, బలవంతం చేయడం, వాళ్ల స్వేచ్ఛను అడ్డుకోవటం, కదలికలను నియంత్రించడం ఇవన్నీ పబ్లిక్‌గా జరిగినా, ప్రయివేట్‌గా జరిగినా హింసగానే పరిగణించాలి.

సాయుధ ఘర్షణలు జరిగిన సందర్భాల్లో మహిళలను రేప్ చేస్తున్నారు. స్త్రీలను బలాత్కరించడం ద్వారా ఒక కమ్యూనిటీని మొత్తంగా అవమానించవచ్చు అన్న దుష్ట ఆలోచన దీని వెనక కారణంగా ఉన్నది. ఇక్కడ ప్రధానంగా రాజ్య స్వభావాన్ని, కుట్రలను పసిగట్టాలి. దేశవ్యాప్తంగా విధ్వంసకర అభివృద్ధి, ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులవుతున్న ప్రజలు ముఖ్యంగా ఆదివాసీ ప్రజలు రాజ్యంపై పోరాడుతున్నారు. వారిపై రాజ్యం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. వేలాది మందిని జైళ్లల్లో నిర్బంధిస్తున్నది. పాలకుల విధానాలను ప్రశ్నిస్తున్న, ఎదిరిస్తున్న ప్రజలపై, ముఖ్యంగా స్త్రీలపై రాజ్యం అత్యాచారాలనే ఆయుధంగా ఎంచుకుంటున్నది. కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, దండకారణ్యంలో మహిళల మాన ప్రాణాలను తోడేస్తున్నారు.

మహిళా సాధికారత, మహిళా స్వతంత్రం అంటూ ఆకర్షణీయమైన మాటలు వల్లించే పాలకులు మరొక వైపు మహిళల పట్ల సమాజ దృక్పథం ఏ మాత్రం మారకుండా ఉండేందుకు తగిన భావజాలాన్ని పెంచి పోషిస్తున్నారు. బతుకమ్మ, సమ్మక్క, సారక్క, మైసమ్మ, దుర్గమ్మ, లక్ష్మీ, సరస్వతి, పార్వతి, రాజేశ్వరి వంటి దేవతల పూజలను, పండుగలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కానీ నిజజీవితాల్లో మాత్రం మహిళల్ని దేవతల్లా చూడటం అటుంచి కనీసం మనుషుల్లాగ కూడా చూడటం లేదు.

మహిళలకు వివక్ష లేని చదువు అందిస్తే వారు కొన్ని అంశాల్లో తమ పోరాటాల్ని తామే చేసుకోగలుగుతారు. నిర్భయ చట్టం, లింగ నిర్ధారణ పరీక్షలు నిరోధించే చట్టం, ఆస్తి హక్కు చట్టంపై వారిలో అవగాహన కలిగించాలి. వీటిని ఉపయోగించుకొని వారు తమపై జరుగుతున్న హింసను కొంతైనా నిరోధించగలుగుతారు. మహిళల మీద అమలవుతున్న సమస్త పీడనలకు మూలాలు దోపిడీ సమాజంలోనే ఉన్నాయి. కనుక తమ మీద జరుగుతున్న సమస్త పీడనాలను తొలగించుకోవడానికి మహిళలు దోపిడీ సమాజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగం కావాలి. అప్పుడే నిజమైన సాధికారత, స్వేచ్ఛ పొందగలరు.

— బండి శ్రామిక

నూట అరవై ఏడేళ్ల క్రితం...

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో పనిగంటల తగ్గింపు కోసం, పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పన కోసం, పురుషులతో సమానంగా వేతనం ఇవ్వాలని 1857 మార్చి 8న యువతులు తొలి అడుగు వేశారు. ఇది 146 మంది కాల్చివేతకు దారి తీసింది. ఈ వీర నారీమణుల బలిదానం ఆధునిక మహిళల అభ్యున్నతికి, తదుపరి సాధించిన సాధికారతకి, విజయాలకి, విశ్వాసాలకి స్ఫూర్తిగా నిలిచింది.

'కమ్యూనిస్టు భూతాన్ని' ప్రపంచం నుంచే తరిమేయాలని భావించిన అమెరికా గడ్డపైనే స్త్రీ కార్మికులు చేసిన గర్జన విజయం సాధించటమే గాక, అంతర్జాతీయంగా మహిళా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమైన రోజుగా మార్చి 8ని నిలిపింది. ఇవే సమస్యలపై పురుష కార్మికులు చేసిన ఉద్యమానికి మే 1– ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే)గా అవతరించింది. ఇలా స్త్రీ, పురుష కార్మికుల దీక్షా దినాలకి అమెరికా గడ్డ వేదికగా మారింది.

ఆకలి కడుపులతో చావటం కన్నా పోరాడుతూ చావటం మేలు అంటూ తెగువ ప్రదర్శించిన ఈ యువతుల్ని బయటకు వెళ్లకుండా గేట్లు మూసివేసి కాల్పులు జరిపిన యాజమాన్యాల కర్కశత్వం చూసి మహిళాలోకమే కాదు యావత్ మానవజాతి నివ్వెరపోయింది. భవిష్యత్ పోరాటాలకు స్త్రీ జాతిని ఈ సంఘటన సమాయత్తం చేసింది. 1910లో కోపెన్‌హెగెన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సదస్సు ఈ రోజుని శ్రామిక మహిళా దినోత్సవంగా జరపాలని పిలుపునిచ్చింది. చాలాకాలం తర్వాత 1975లో దీన్ని ఆమోదించి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించగా, భారతదేశం కూడా దీన్ని పాటిస్తోంది. సుదీర్ఘకాలం జరిగిన ఈ కృషిలో జర్మన్ కమ్యూనిస్టు నాయకురాళ్లు క్లారా జెట్కిన్, రోజా లగ్జెంబర్గ్, కారల్ మార్క్స్ కుమార్తె ఎలినార్, సోవియట్ తొలి మహిళా మంత్రి కొల్లంతోయ్‌ల పాత్ర ఉంది. 1917లో జారు పతనంతో ఏర్పడిన సోవియట్ యూనియన్ మహిళలకు ఓటు హక్కు ఇవ్వటంతో పాటు చట్టసభలకు కూడా వారిని ఎన్నిక చేసింది.

దీంతో 1917లోనే నార్వే, డెన్మార్క్‌లు, 1918లో ఇంగ్లండ్, 1920లో అమెరికా మహిళలకు ఓటుహక్కు కల్పించాయి. అయినా చట్టసభల్లో స్త్రీల ప్రాతినిధ్యం అభివృద్ధి చెందిన దేశాలుగా చెప్పుకొనే వాటిలో ఆశించిన స్థాయిలో పెరగలేదు. మనదేశం అయితే గత సంవత్సరం గణాంకాలలో 193 దేశాల సూచీలో 143వ స్థానంలో ఉంది. 1996లో రాజ్యసభ ఆమోదించిన మూడోవంతు రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో నెగ్గటానికి 27 సంవత్సరాలు పట్టటం మహిళల పట్ల మన అధికార రాజకీయ పక్షాలకున్న అభిమానంలోని డొల్లతనాన్ని ఎత్తి చూపుతుంది.

మహిళల అభ్యున్నతికోసంగా చెప్పబడే అనేక చట్టాలు – బాల్య వివాహాల నిషేధ చట్టం (1922), ప్రత్యేక వివాహ చట్టం (1955), వరకట్న నిరోధక చట్టం (1961), సమాన పనికి సమాన వేతనం చట్టం (1976), కుటుంబ కోర్టు చట్టం (1984), మహిళల్ని అసభ్యంగా చిత్రించటాన్ని నిరోధించే చట్టం (1986), ఆస్తి హక్కులో సమాన హక్కు (1986), భ్రూణ హత్యల నిరోధక చట్టం (1994), ర్యాగింగ్ నిరోధక చట్టం (1997), గృహహింస నిరోధక చట్టం (2005), ఇవిగాక ఐపీసీలో 498(ఎ), 376, 354 లాంటి చట్టాలేగాక, 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్త్రీలకు రిజర్వేషన్ కల్పించటం లాంటి అనేక చట్టాలు రూపొందించినా కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థల్లో ఏర్పడిన జడత్వం కారణంగా స్త్రీలకు ఆశించిన ప్రయోజనాలు అందటం లేదు.

ప్రపంచ సంపద, సమాజానికి అవసరమైన సంపద సృష్టిలో పురుషునికన్నా స్త్రీ పాత్ర ఎక్కువనేది నిస్సందేహం. కాని పితృస్వామిక క్షీణ విలువల కారణంగా ఇది విస్మరించబడుతున్నది. 365 రోజుల్లో ఈ ఒక్కరోజేనా? అనుకోవద్దు. ఈ రోజు గొప్పతనాన్ని గుర్తించాక 364 రోజులు వాటంతటవే దాని దగ్గరకు నడుచుకుంటూ వస్తాయి.



శాసనాలు చేయటం నాణేనికి ఒకవైపు కన్పడుతున్నా మరోవైపు ఆచరణలో వైఫల్యాలు గణనీయంగా కన్పిస్తున్నాయి. రాజ్యాంగం (14వ అధికరణ) లింగ వివక్షతని నిషేధిస్తున్నా అడుగడుగునా అది దర్శనమిస్తుంది. వైద్యరంగం ఎంతో ఆధునికతను, సాంకేతికతను సంతరించుకున్నా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఐదు లక్షల ప్రసూతి, ఇతర గర్భ సంబంధ సమస్యలతో మహిళలు మృతి చెందుతున్నారు. ఈ రేషియో యూరప్, ఆఫ్రికాల మధ్య 1:180గా ఉండటం ప్రపంచం ఎలా అసమతుల్యతతో ఉందో అర్థమవుతుంది. గత దశాబ్దకాలంలో మన దేశంలో మహిళలకు వ్యతిరేకంగా జరిగిన నేరాలు 22 లక్షల 40 వేలు అని గణాంకాలు చెబుతున్నాయి. 2022లో 4 లక్షల 4 వేల కేసులు నమోదైతే, 2023లో 4 లక్షల 45 వేల కేసులు నమోదయ్యాయి. ఈ 22 లక్షల కేసుల్లో 498(ఎ) వరకట్న వేధింపుల కేసులే 9 లక్షలున్నాయి. స్త్రీకి ఏ మాత్రం రక్షణలేని రాష్ట్రాలుగా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలు ఉండగా; నాగాలాండ్, కేరళ, తమిళనాడులు సేఫ్‌జోన్‌లో ఉన్నాయి. మన తెలుగు రాష్ట్రాలు మధ్యస్థంగా 15, 16 స్థానాల్లో ఉన్నాయి. నగరాల విషయంలో ఢిల్లీ రక్షణ లేమిలో ప్రథమస్థానంలో నిలవగా, చెన్నై సేఫ్‌జోన్‌లో ఉంది. జాతీయ నేర సమాచార బ్యూరో తెలుపుతున్న ఈ వివరాలు చట్టాల వల్ల స్త్రీలకు రక్షణ జరగదనే వాస్తవాన్ని నిరూపిస్తున్నాయి. చట్టం అమలుపరిచే విధానం క్రియాశీలకమై, నిజాయితీ కూడి ఉండాలి. అలా ఆ వ్యవస్థ మారేంతగా స్త్రీ జనం జాగృతం కావాలి. మన దేశంలో రోడ్డు ప్రమాదాల్లో కంటే ఎక్కువగా గృహహింస కారణంగానే మహిళలు గాయపడుతున్నారని వింటుంటే మహిళా సాధికారికత అనేది ఎంత అర్థరహితమైనదో తెలుస్తుంది. పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిసి భ్రూణ హత్యలకు పాల్పడటం ఇంకా కొనసాగుతూనే ఉంది.

మహిళలపై అత్యాచారాల మీద ఉక్కుపాదం మోపుతున్నాం అనే ప్రకటనల పక్కనే నిర్భయ (ఢిల్లీ), దిశ (హైదరాబాద్), హత్రాస్, ఉన్నావ్, వాకపల్లి లాంటి ఘటనలు కుప్పలు తెప్పలుగా ప్రచురితమవుతున్నాయి. ఇలాంటి స్థితిలో ఒక మహిళ దేశానికి ప్రథమ మహిళగా వుందని, ఎప్పుడో 2027లో ఓ 35 రోజులు జస్టిస్ నాగరత్న దేశ ప్రథమ ప్రధాన న్యాయమూర్తి కాబోతున్నారని, ఏడున్నర దశాబ్దాల తర్వాత ముగ్గురు మహిళా న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో ఉన్నారని ఉబ్బిపోవటం కాదు. ఒక మహిళ హైకోర్టు సాధారణ న్యాయమూర్తిగా, ప్రధాన న్యాయమూర్తిగా నియమితులవటానికి స్వతంత్ర భారత్‌లో మూడు దశాబ్దాలు పట్టిందని మనం సిగ్గుపడాలి. ఈ స్థితి నుండి మహిళలు ఉన్నతంగా ఎదగాలి, మానవ హక్కులంటే మహిళల హక్కులే అనే స్పృహ పెరగాలి. ప్రపంచ సంపద, సమాజానికి అవసరమైన సంపద సృష్టిలో పురుషునికన్నా స్త్రీ పాత్ర ఎక్కువనేది నిస్సందేహం. కాని పితృస్వామిక క్షీణ విలువల కారణంగా ఇది విస్మరించబడుతున్నది. 365 రోజుల్లో ఈ ఒక్కరోజేనా? అనుకోవద్దు. ఈ రోజు గొప్పతనాన్ని గుర్తించాక 364 రోజులు వాటంతటవే దాని దగ్గరకు నడుచుకుంటూ వస్తాయి.

● చెరుకూరి సత్యనారాయణ

(మార్చి 8 – అంతర్జాతీయ మహిళా దినోత్సవం)





లిబర్టీలో ఏర్పాటుచేసిన లింగానికి పుష్పార్చన చేస్తున్న మహిళ



విద్యుత్ ధగధగలతో మన్సూరాబాద్‌లోని శివాలయం

శివరాత్రి శోభ

శివరాత్రి పర్వదిన వేడుకలకు నగరవ్యాప్తంగా శివాలయాలు ముస్తాబయ్యాయి. కూకట్‌పల్లి గ్రామంలోని పాత శివాలయం, కేపీహెచ్‌బీలోని ఏకాంబరేశ్వర స్వామి, సూరారంలోని ఉమా మహేశ్వర ఆలయం, మన్సూరాబాద్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. లిబర్టీలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ హెడ్‌క్వార్టర్స్‌లో బ్రహ్మకుమారీస్ వివిధ ఆకృతుల్లో ఏర్పాటు చేసిన లింగాలు ఆకట్టుకున్నాయి.

కనులపండువగా
కీసర రామలింగేశ్వరుడి

బ్రహ్మోత్సవాలు

కీసర: కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీరామలింగేశ్వర స్వామివారి కల్యాణం జరిగింది. ఉన్నతాధికారులు, భక్తులు, గ్రామస్థులు కల్యాణాన్ని వీక్షించారు. తొలుత గర్భాలయంలోని మూలవిరాట్‌కు రుద్రాభిషేకం నిర్వహించారు. హోమంతో పాటు బిల్వార్చన, ప్రదోష కాల పూజ, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తుల పల్లకీసేవ కోలాహలంగా సాగింది. నంది వాహనదారుడికి దారిగుండా తమిళ భక్తులు, గ్రామస్థులు భక్తితో మంగళహారతులు, కొబ్బరికాయలు సమర్పించారు.

గుట్టలో నేటి పూజలు

మాఘ బహుళత్రయోదశిని పురస్కరించుకొని శుక్రవారం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, రుద్రస్వాహాకార హోమం, నందివాహన సేవ, సామూహికభజనలు, శ్రీరామలింగేశ్వర స్వామి వారికి సంతత ధారాభిషేకం జరుగుతాయి.




శివరాత్రి పండ్లకు

ధరల రెక్కలు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. గడిచిన వారం రోజులతో ఉన్న ధరలతో పోలిస్తే వ్యాపారులు పండ్ల ధరలను దాదాపు 30 శాతం పెంచేశారు. శివరాత్రి రోజు ఉపవాసదీక్షలు చేపట్టిన భక్తులు పండ్లను

మిగతా 8వ పేజీలో..

మహానగరంలో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మరో ప్లాంట్ అందుబాటులోకి రానుంది. 14.5 మెగావాట్ల సామర్థ్యంతో దుండిగల్‌లో నిర్మించిన ప్లాంట్‌ను త్వరలో ప్రారంభించనున్నారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్‌తో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ) పూర్తయింది. దీంతో ప్రారంభోత్సవానికి సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రారంభోత్సవానికి హాజరయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.



దుండిగల్‌లో నిర్మించిన విద్యుదుత్పత్తి ప్లాంట్

చెత్త నుంచి విద్యుత్.. మరో 14.5 మెగావాట్లు

- త్వరలోనే అందుబాటులోకి రానున్న దుండిగల్ ప్లాంట్
- ఇప్పటికే జవహర్‌నగర్‌లో 24 మెగావాట్ల ప్లాంట్

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పునర్వినియోగంలో భాగంగా తడిచెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ, పొడిచెత్తతో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డులో 24 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించిన ప్లాంట్ నవంబర్ 2020లో అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ తొలుత 19.8 మెగావాట్ల ప్లాంట్ నిర్మించిన ప్రైవేట్ ఏజెన్సీ.. కేంద్ర పర్యావరణ శాఖ అనుమతితో 24 మెగావాట్ల సామర్థ్యానికి పెంచింది. రెఫ్యూజ్ డిరైవ్డ్ ఫ్యుయల్ (ఆర్‌డీఎఫ్) విధానంలో ప్లాంట్‌లో విద్యుదుత్పత్తికి నిత్యం 2,500 మెట్రిక్‌టన్నుల చెత్త వినియోగిస్తున్నారు. దుండిగల్‌లోనూ అదే తరహా సాంకేతికతతో ప్లాంట్ నిర్మించారు. ఈ ప్లాంట్‌లో నిత్యం 1,500 మెట్రిక్‌టన్నుల పొడి చెత్త అవసరం. ఆరు నెలల క్రితమే ప్లాంట్ సిద్ధమైనా విద్యుత్‌శాఖతో పీపీఏ జాప్యం వల్ల ప్రారంభోత్సవం నిలిచిపోయింది.

98 మెగావాట్ల ప్లాంట్లు..

గ్రేటర్‌లో నిత్యం 8వేల మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. ఇందులో పొడిచెత్తను విద్యుదుత్పత్తికి వినియోగిస్తున్నారు. వచ్చే మూడు, నాలుగేళ్లలో 98 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన ప్లాంట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దుండిగల్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే చెత్త నుంచి విద్యుదుత్పత్తి 48.5 మెగావాట్లకు చేరనుంది. పురోగతిలో ఉన్న 24 మెగావాట్ల ప్లాంట్ కూడా అందుబాటులోకి వస్తే విద్యుదుత్పత్తి 72.5 మెగావాట్లకు పెరగనుంది. ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను టీఎస్ఎస్‌పీడీసీఎల్ కొనుగోలు చేస్తోంది. చెత్త పునర్వినియోగంతో డంపింగ్ స్థల విస్తీర్ణం కూడా తగ్గనుంది. పూర్తిస్థాయిలో నిర్వహణ ప్రారంభించకపోవడంతో జవహర్‌నగర్‌లో వందల ఎకరాల్లో వ్యర్థాల గుట్టలు పేరుకుపోయాయి. ఇక ముందు అలాంటి పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు.

ప్లాంట్‌ల స్వరూపం ఇది..

గ్రేటర్‌లో వెలువడే చెత్త	8000 మెట్రిక్ టన్నులు
జవహర్‌నగర్‌లో ప్రారంభించిన విద్యుదుత్పత్తి ప్లాంట్ సామర్థ్యం	నిత్యం 24 మెగావాట్లు
వినియోగిస్తున్న చెత్త	2,500 మెట్రిక్ టన్నులు
దుండిగల్ ప్లాంట్ సామర్థ్యం	14.5 మెగావాట్లు
వినియోగించనున్న చెత్త	1500 మెట్రిక్ టన్నులు
జవహర్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న మరో ప్లాంట్ సామర్థ్యం	24 మెగావాట్లు

అధునాతన సాంకేతికత

బెల్జియంలో వినియోగించే అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్లాంట్లలో వినియోగిస్తున్నారు. బొగ్గుతో విద్యుదుత్పత్తిలో బొగ్గును మండిస్తే, ఇక్కడ వ్యర్థాలను మండించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఆర్‌డీఎఫ్ బాయిలర్లలో చెత్త వేయడం వల్ల ఆ వేడికి నీళ్లు మరిగి వెలువడే ఆవిరితో విద్యుదుత్పత్తి జరుగుతుంది. ప్లాంట్ నుంచి వెలువడే ఉద్గారాలపై నిరంతర పర్యవేక్షణ జరుపుతారు. ఉద్గారాలు పరిమిత స్థాయిలోనే ఉన్నాయా లేక పరిమితిని మించుతున్నాయా? అన్నది ఆన్‌లైన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పరిశీలిస్తుంది.

బల్కంపేట ఆలయ అభివృద్ధికి

రూ. 4.40 కోట్లు

- భక్తులకు సకల సదుపాయాలు
- సంజీవయ్యపార్కులో రేపు లేజర్ షో ప్రారంభం - కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఎల్లమ్మ ఆలయం వద్ద మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

అమీర్‌పేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయ అభివృద్ధిపనులకు కేంద్రం రూ.4.40 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. సాంస్కృతిక మహోత్సవం 2024లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను వర్చువల్‌గా ఢిల్లీలో ప్రారంభించారు. ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్ర్కీన్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి శశిధర్ రెడ్డి, పాలక మండలి సభ్యులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఎల్లమ్మ ఆలయంలో రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. 15వ శతాబ్దం నాటి ఎల్లమ్మతల్లి దేవాలయం ప్రాంగణంలో రూ. కోట్ల కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టనున్న ప్రాజెక్ట్ వివరాలను వెల్లడించారు. అన్నదాన భవనం, వర్షపునీటి సంరక్షణ సదుపాయాలు, వరదనీటి డ్రైనేజీ వ్యవస్థ, బయో టాయిలెట్స్ వంటి సౌకర్యాలను కల్పిస్తామన్నారు. సంజీవయ్యపార్క్ వద్ద లైట్ అండ్ సౌండ్ షో

మిగతా 8వ పేజీలో..

యువతిలా చాటింగ్ చేసి..

రారమ్మని చంపేశారు..!

- పాతకక్షల నేపథ్యంలో ఘాతుకం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీహెచ్ శ్రీనివాస్

రాజేంద్రనగర్, మార్చి7(ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడి హత్యకు పథకం వేసిన నిందితులు ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అందమైన యువతి ఫొటోపెట్టి అతడితో చాటింగ్ చేయడం మొదలుపెట్టారు. కొన్నిరోజుల తర్వాత రహస్యంగా కలుద్దాం అని మెసేజ్ చేశారు. నిజంగానే అమ్మాయే పిలిచిందని నమ్మి వెళ్లిన యువకుడిని దారుణంగా చంపేశారు. ఈ నెల 5వ తేదీన చింతల్‌మెట్ ఎం.ఎం పహడీలో జరిగిన గుర్తుతెలియని వ్యక్తి హత్యకేసును పోలీసులు ఛేదించగా ఈ విషయం వెలుగుచూసింది. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. బాలాపూర్ షాహీన్‌నగర్ బిస్మిల్లాకాలనీకి చెందిన యూసుఫ్ కుమారుడు మహ్మద్ ఫహీమ్ (20) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అదేకాలనీలో ఉంటున్న మహ్మద్ యూసుఫ్ కుమారుడు మహ్మద్ యాసిన్ (22) చికెన్‌షాప్ నిర్వహించేవాడు. వారిద్దరికీ గత నెల 25వ తేదీన ఓ విషయంలో గొడవ జరిగింది. దీనిపై మహ్మద్ ఫహీమ్ కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చారు. అది మనుస్సులో పెట్టుకున్న మహ్మద్ యాసిన్ ఎలాగైనా

మిగతా 8వ పేజీలో..

పరీక్షల వేళ మమ్స్, స్కార్లెట్స్ జ్వరాలు

- ప్రభావం చూపుతున్న ఇన్‌ఫెక్షన్లు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

అసలే పరీక్షల సమయం. ఈటైమ్‌లో మమ్స్, స్కార్లెట్స్ జ్వరాలు సోకిన వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఒకరి నుంచి మరొకరికి త్వరగా సోకే లక్షణమున్న ఈ జ్వరం వల్ల మరింత ఎక్కువ మంది ఇబ్బందిపడే అవకాశమున్నది.



హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఫీవర్ ఆస్పత్రి ఓపీకి ప్రతీ రోజు 50 నుంచి వంద మంది వరకు మమ్స్ బాధితులు వస్తున్నారు. 15 నుంచి 20మంది ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల ఓపీల్లో ప్రతీ రోజు 10 నుంచి 20 మంది పిల్లలు స్కార్లెట్స్ జ్వరాలతో వస్తున్నారని వైద్యులు తెలిపారు. స్కార్లెట్స్ జ్వరం స్ట్రెప్టోకల్ ఫారింగైటిస్ బ్యాక్టీరియా కారణంగా ప్రబలుతున్నదని వారు పేర్కొన్నారు. బాధితులు తుమ్మినా, దగ్గినా ఇతరులకు ప్రబలే ప్రమాదముంది.

5 నుంచి 15 ఏళ్లలోపు వారికి..

మమ్స్, స్కార్లెట్స్ జ్వరాలు 5 నుంచి 15 ఏళ్లలోపు వారికి ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. మమ్స్, స్కార్లెట్స్ జ్వరాలు ఒకరి నుంచి ఒకరికి సులువుగా ప్రబలుతాయని, ఇంట్లో ఒకరికి వస్తే అందరికీ వచ్చే ప్రమాదముందని వారు పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే పిల్లలకు వ్యాక్సిన్ వేసి ఉంటే ఈ సమస్యలు రావని వైద్యులు పేర్కొంటున్నారు.

ఇవీ లక్షణాలు..

మమ్స్‌కు ముందు జ్వరం రావడం, నలతగా ఉండడం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కళ్లు ఎర్రగా ఉంటాయి. చెంప కింద

మిగతా 8వ పేజీలో..



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్వీఎస్‌రెడ్డి

నేడు ఓల్డ్‌సిటీలో మెట్రోకు శంకుస్థాపన

హైదరాబాద్ సిటీ/చాంద్రాయణగుట్ట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా శుక్రవారం ఓల్డ్‌సిటీ మెట్రో పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మొదటి దశలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మిగిలిన 5.5 కిలోమీటర్ల పనులను రెండోదశలో పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఆ పనులను రూ.2వేల కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఫలక్‌నుమా సమీపంలోని ఫారూఖ్‌నగర్‌లో సీఎం చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేసేందుకు మెట్రో అధికారులు ఏర్పాట్లు చేశారు. భూమి పూజ అనంతరం బహిరంగ సభ ఉంటుందని చెప్పారు.

మూడేళ్లలో పూర్తి

మూడేళ్లలో పాతబస్తీ మెట్రోరైలు నిర్మాణం పూర్తి చేస్తామని హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. అధికారులతో కలిసి గురువారం ఆయన ఫారూఖ్‌నగర్‌లో పనులను పరిశీలించారు. 5.5 కిలోమీటర్ల మేర, నాలుగు స్టేషన్లతో

మిగతా 8వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రోనాల్డ్‌రోస్

బ్యాంకు లావాదేవీలపై నిఘా

- వివరాలు ఇవ్వాలని బ్యాంకర్లకు రోనాల్డ్‌రోస్ సూచన

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ బ్యాంకర్లకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదలయ్యే అవకాశమున్న నేపథ్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు అధికారులు, నగదు రవాణా ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ.. పారదర్శక, ప్రలోభరహిత ఎన్నికల నిర్వహణకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. నగదు రవాణా సమయంలో సరైన పత్రాలు లేని ఏజెన్సీలు, బ్యాంకు కో ఆర్డినేటర్ల వాహనాలను సీజ్ చేస్తారన్నారు. ఒకే రోజు ఏ ఖాతాదారుడైనా రూ.లక్ష డిపాజిట్ చేసినా, విత్ డ్రా చేసినా, రూ.10 లక్షల నగదు బదిలీ చేసినా.. ఆ వివరాలను అందించాలని సూచించారు. రూ.10 లక్షలకు పైబడిన లావాదేవీల వివరాలు ఆదాయపు పన్ను శాఖ అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.

నిలోఫర్‌లో ఆధునిక ఐసీయూ

ప్రారంభించిన మంత్రి సీతక్క



నిలోఫర్‌లో వార్డును ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

మంగళ్‌హాట్/అఫ్జల్‌గంజ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రాణదానం చేసే దేవాలయం లాంటి నిలోఫర్ ఆస్పత్రికి సహకారం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయం అని మంత్రి అనసూయ(సీతక్క) అన్నారు. నిలోఫర్‌లో నవజాత శిశువుల చికిత్స కోసం ఆధునికీకరించిన ఐసీయూను సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ. 50 లక్షలు వెచ్చించి ఐసీయూ ఆధునికీకరణకు సహకరించిన రోటరీక్లబ్‌ను అభినందించారు. కరోనా కాలంలో రోటరీక్లబ్ సేవలను తమ ఏజెన్సీ ప్రాంతప్రజల అవసరాల కోసం ఉపయోగించుకున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వం తరఫున ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, వైద్యులు వాణి, జ్యోతి రోటరీక్లబ్ మావెరిక్స్ అధ్యక్షురాలు వనశ్రీ, కార్యదర్శి దేశిని లక్ష్మీనారాయణ, రోటరీ గ్లోబల్ విజార్డ్ శ్రీవర్ధన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి శుభాకాంక్షలతో
నేడే బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

లక్ష్మీకళ - మూసాపేట్ 11.30,2.45,6.25,9.30 | ASIAN తారకరామ - కాచిగూడ 11.15,2.15

అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
భ్రమరాంబ 70 - కూకట్‌పల్లి 11.30,2.45,6.30,9.45
అలంకార్(ప్రతాప్) - లంగర్‌హౌస్ 11.00,2.00,6.00,9.00
సాయిరంగ ఎ/సి - మియాపూర్ 11.00,2.15,6.00,9.15
ASIAN ముకుంద్ - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00
వైజయంతి ఎ/సి - నాచారం 11.00,2.00,6.00,9.00
SV సినీస్క్వేర్ ఎ/సి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00

ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 9.35,1.00,1.30,4.20,7.15,10.20
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.20,1.25,4.40,7.40,7.25,10.25
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 9.15,12.00,2.45,8.15,11.00
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 10.30,1.30,4.30,7.40,10.40
ఎం.పి మాల్ - కాచిగూడ 10.15,1.40,7.40,10.40
జిఎస్ఎమ్ - మదీనగూడ 10.30,1.25,4.30,7.40,10.40
నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.30,1.40,4.40,7.40,10.50
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.30,1.40,4.40,7.40,10.50
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.30,1.30,4.40,7.45,10.50
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.10,1.15,1.45,4.20,7.25,10.30,11.00
ఆర్.కె. - బంజారాహిల్స్ 11.00,2.00,8.05,11.00
ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 10.30,1.25,4.30,7.35,10.40
గలేరియా - పంజాగుట్ట 10.15,1.05,4.10,7.15,10.20
ఐకాన్ - హైటెక్‌సిటీ 10.30,1.35,4.40,7.45,10.50
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 10.30,1.25,4.30,7.35,10.40
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ 10.30,1.25,4.30,7.35,10.40
ప్రెస్టేజ్ మాల్ - గచ్చిబౌలి 10.30,1.35,4.40,7.45,10.50
అట్రియమ్ - గచ్చిబౌలి 10.30,1.35,4.40,7.45,10.50
ఎస్‌2 సోము - మల్లాపూర్ 10.30,1.35,4.40,7.45,10.50
మూవీటైమ్ - అమీర్‌పేట 11.00,4.30,7.00,10.00
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 9.30,12.00,5.30,8.00,10.55
స్కైమాల్ - సనత్‌నగర్ 10.15,1.00,7.00
మంజీరామాల్ - కూకట్‌పల్లి 10.30,1.40,4.50,8.00,11.10
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 10.30,1.40,4.50,8.00,11.10
మంత్రామాల్ - అత్తాపూర్ 10.30,1.40,4.50,8.00,11.10
సుధా - శాలిబండ 10.30,1.40,4.50,8.00,11.10
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 10.30,1.40,4.50,8.00,11.10
సినీ ప్లానెట్ - కొంపల్లి 10.40,1.40,4.30,7.40,10.30
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.40,1.45,4.45,7.40,10.30
ఏషియన్ రాధిక - కాప్రా 10.40,1.30,4.30,7.40,10.30
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.40,1.40,4.45,7.30,10.30
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.50,1.45,4.45,7.40,10.30
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,6.15,9.15
షా షహెన్‌షా - చింతల్ 11.15,6.15,9.15
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.50,1.45,4.45,7.40,10.30
ఏషియన్ సినిమార్ట్ - ఆర్.సి.పురం 10.50,1.45,4.45,7.40,10.30
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 10.15,1.20,4.30,7.40,10.50
మిరాజ్ సినిమాస్ - బాలానగర్ 10.15,1.20,4.30,7.40,10.50
మిరాజ్ సినిమాస్ - చందానగర్ 10.15,1.20,4.30,7.40,10.50
లక్ష్మీనరసింహ - మియాపూర్ 10.40,1.50,8.00,11.00
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 10.40,1.50,8.00,11.00
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 10.20,1.15,4.40,7.45,10.45
టివోలి - సికింద్రాబాద్ 11.00,4.40,10.40
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 11.00,1.40,7.30
మూవీమ్యాక్స్ - మౌలాలి 9.30,12.30,3.30,6.30,9.30

ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.30
వెంకటరమణ పద్మావతి - కాచిగూడ 6.30,9.30
రామకృష్ణ 70ఎంఎం ఎ/సి - అబిడ్స్ 11.30,2.30,6.00,9.15
శ్రీరాములు ఎ/సి - మూసాపేట్ 11.30,2.30,6.30,9.30
ప్రశాంత్ ఎ/సి - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
తాళ్ళూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ 11.00,2.00,6.00,9.00
సుష్మ 70 ఎ/సి - వనస్థలిపురం 11.00,2.00,6.00,9.00
భుజంగ 70ఎంఎం - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
శివశక్తి 70 ఎంఎం - కాప్రా 11.00,2.00,6.00,9.00
శ్రీదేవి 70 - చిలకలగూడ 11.00,2.30,6.00,9.30
శ్రీ సాయిరాం 70 - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00
జ్యోతి 70 ఎ/సి - ఆర్‌సిపురం 11.00,2.00,6.00,9.00
మహాలక్ష్మి 70 - కొత్తపేట 11.00,2.00,6.00,9.00
లక్ష్మి - కర్మన్‌ఘాట్ 6.15,9.30
శ్రీ కృష్ణ 70 ఎ/సి - ఉప్పల్ 11.00,2.15,6.00,9.15
BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.15,6.00,9.15
విజేత 70 ఎ/సి - బోరబండ 11.00,2.00,6.00,9.00
సూపర్ 70 ఎ/సి - బాలాపూర్ 11.15,2.15,6.15,9.15
సంతోష్ 70 ఎ/సి - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00
శ్రీ సాయిపూజా 70 ఎ/సి - సూరారం 11.00,2.00,6.00,9.00
శ్రీ ప్రేమ 70 ఎ/సి - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
స్వప్న 70ఎంఎం - కాటేదాన్ 11.15,6.15,9.00
శ్రీరమణ 70ఎంఎం - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ 70ఎంఎం - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
శివరంజని 70ఎంఎం - ఇస్నాపూర్ 11.00,2.00,6.00,9.00
లక్ష్మి క.మం 70 ఎ/సి - అల్వాల్ 11.00,2.00,6.00,9.00
గణేష్ 70 ఎ/సి - శంషాబాద్ 11.15,2.15,6.00,9.00
వెంకటసాయి ఎ/సి - కీసర 11.00,2.00,6.00,9.00
వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00

వరంగల్
జెమిని 70 - వరంగల్
వెంకట్రామ - వరంగల్
ఎస్‌2 - వరంగల్
శ్రీదేవి - హన్మకొండ
అశోక - హన్మకొండ
ముకుంద్ - మహబూబాబాద్
స్వర్ణ క.మం. - జనగాం
భవాని 70 - కాజీపేట్
జయశ్రీ - నర్సంపేట

జగదాంబ - వెంకటాపురం
లక్ష్మి 70ఎంఎం - కల్వూరు

కరీంనగర్
మమత - కరీంనగర్
ప్రతిమ - కరీంనగర్
శ్రీనివాస - కరీంనగర్
ఊర్వశి 70 - గోదావరిఖని
శ్రీరామ 70 - జగిత్యాల
నటరాజ్ - సిరిసిల్ల
శ్రీనివాస ఎ/సి - పెద్దపల్లి

శ్రీనివాస - మహబూబ్‌నగర్
సాయిబాబా - షాద్‌నగర్
వెంకటేశ్వర - వనపర్తి
మల్టీప్లెక్స్ 70 - గద్వాల్
మనోహర్ - నారాయణపేట్
సత్యలక్ష్మి 70 - అచ్చంపేట
రవి ఎ/సి - నాగర్‌కర్నూలు
శ్రీదేవి ఎ/సి - కొత్తకోట
అశోక ఎ/సి - కల్వకుర్తి
శ్రీమాధవ ఎ/సి - బిజా
రాఘవేంద్ర - దేవరకద్ర

లక్ష్మి - యాదగిరిగుట్ట
తార సినిమా - మోత్కూర్

ఆదిలాబాద్
నటరాజ్ - ఆదిలాబాద్
జెమిని - మంచిర్యాల
శ్రీనివాస 70 - మంచిర్యాల
నారాయణ - నిర్మల్
రామకృష్ణ - బెల్లంపల్లి
మహానంది - లక్సెట్టిపేట
పిక్చర్‌హౌస్ - ఆసిఫాబాద్

నల్గొండ

మెదక్

రంగారెడ్డి

నిజామాబాద్

ఖమ్మం

రాయచూర్

మహబూబ్‌నగర్

GLOBAL CINEMAS LLP

మహాశివరాత్రి శుభాకాంక్షలతో
ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 70 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
ఫోరం మాల్ - కూకట్‌పల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్
ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్
గలేరియా - పంజాగుట్ట
ఐకాన్ - హైటెక్‌సిటీ
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్
ప్రెస్టేజ్‌మాల్ - గచ్చిబౌలి
అట్రియమ్ - గచ్చిబౌలి
ఎస్‌2 సోము - మల్లాపూర్
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్
ఎం.పి మాల్ - కాచిగూడ
జిఎస్ఎమ్ - మదీనగూడ
నెక్లెస్ సత్య - కవాడిగూడ
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్
మంజీరామాల్ - కూకట్‌పల్లి
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
మంత్రామాల్ - అత్తాపూర్
సుధా - శాలిబండ
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఏషియన్ రాధిక - కాప్రా
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
మిరాజ్ సినిమాస్ - బాలానగర్
మిరాజ్ సినిమాస్ - చందానగర్
లక్ష్మీనరసింహ - మియాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
మూవీటైమ్ - అమీర్‌పేట
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
స్కైమాల్ - సనత్‌నగర్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
షా షహెన్‌షా - చింతల్
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మూవీమ్యాక్స్ - మౌలాలి
జె.పి.సినిమాస్ - చందానగర్
మరియు
మీ అభిమాన థియేటర్లలో

BHUVANESHWARI PICTURES

మహాశివరాత్రి శుభాకాంక్షలతో
రేపే బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ 11.00,2.00
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.00am
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.45am
ASIAN cine ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 11.00am
ASIAN ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 11.00am
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 10.45am
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.30am

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్, ఎ.ఎం.బి. - గచ్చిబౌలి, ఆర్.కె. - బంజారాహిల్స్, ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్, గలేరియా - పంజాగుట్ట, ఐకాన్ - హైటెక్‌సిటీ, పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్, పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్, ప్రెస్టేజ్‌మాల్ - గచ్చిబౌలి, అట్రియమ్ - గచ్చిబౌలి, ఎస్‌2 సోము - మల్లాపూర్, జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్, ఎం.పి మాల్ - కాచిగూడ, జిఎస్ఎమ్ - మదీనగూడ, నెక్లెస్ సత్య - కవాడిగూడ, అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్, మంజీరామాల్ - కూకట్‌పల్లి, సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి, మంత్రామాల్ - అత్తాపూర్, డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్, ఏషియన్ సత్యం - అమీర్‌పేట్, సినీ ప్లానెట్ - కొంపల్లి, ఏషియన్ రాధిక - కాప్రా, ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్, ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి, మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్, మిరాజ్ సినిమాస్ - బాలానగర్, మిరాజ్ సినిమాస్ - చందానగర్, లక్ష్మీనరసింహ - మియాపూర్, రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి, మూవీటైమ్ - అమీర్‌పేట, ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి, స్కైమాల్ - సనత్‌నగర్, టివోలి - సికింద్రాబాద్, మూవీమ్యాక్స్ - మౌలాలి, జె.పి.సినిమాస్ - చందానగర్

అరంధాల్ 70 - శంకర్ | శ్రీనివాస 70 - నర్సాపూర్ | భవాని 70 - కొత్తకోట | రంగ 70 - వనపర్తి | భువనేశ్వరి 70 - బిజా
విశ్వరూప 70 - కొత్తగూడెం | హరిహర 70 - జమ్మికుంట | సీతారామ 70 - ఇల్లందు | మల్టీప్లెక్స్ - మిర్యాలగూడ | శ్రీనివాస 70 - ఆమనగల్

మహాశివరాత్రి శుభాకాంక్షలతో
నేడే బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

ఎ.ఎం.బి. సినిమాస్ - గచ్చిబౌలి 10.30am
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.15pm
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 4.45pm
ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 1.25pm
గలేరియా - పంజాగుట్ట 4.35pm
పివిఆర్ - ఎర్రమంజిల్ 7.50pm
పివిఆర్ - ముసారాంబాగ్ 7.50pm
అట్రియమ్ - గచ్చిబౌలి 11.00am
ఎస్‌2 సోము - మల్లాపూర్ 1.15pm
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 1.20pm
ఎం.పి మాల్ - కాచిగూడ 1.00pm
జిఎస్ఎమ్ - మదీనగూడ 4.30pm
నెక్లెస్ సత్య - కవాడిగూడ 11.00am
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 4.45pm
మంజీరామాల్ - కూకట్‌పల్లి 12.00pm
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 1.50pm
మంత్రామాల్ - అత్తాపూర్ 1.45pm
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 2.50pm
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 1.15pm
సినీ ప్లానెట్ - కొంపల్లి 1.15pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 7.30pm
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 1.15pm
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.30pm
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 1.15pm
సినిమాస్ - బాలానగర్ 7.30pm
సినిమాస్ - చందానగర్ 1.15pm
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 2.30pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 4.45pm

ఎస్‌2 - వరంగల్ | శ్రీనివాస - కరీంనగర్ | వేణుమాల్ - నిజామాబాద్ | తిరుమల - మహబూబ్‌నగర్
శ్రీదేవి - హన్మకొండ | గీతా - నిజామాబాద్ | సినిమాస్ - ఆర్మూర్ | తిరుమల 70 - సూర్యాపేట్

మహాశివరాత్రి శుభాకాంక్షలతో
నేడే బ్రహ్మాండమైన విడుదల



ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 9.20am
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.30pm
PVR సినిమాస్ - ముసారాంబాగ్ 10.55am
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 1.45pm
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 5.00pm
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 2.10pm
ASIAN ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 11.00am
జె.పి.సినిమాస్ - చందానగర్ 7.30pm

ఎస్‌2 70 - వరంగల్ | గీతా - నిజామాబాద్ | భువనేశ్వరి 70 - బిజా
శ్రీదేవి - హన్మకొండ | వేణుమాల్ - నిజామాబాద్ | శ్రీనివాస 70 - నర్సాపూర్
శ్రీనివాస - కరీంనగర్ | సినిమాస్ - ఆర్మూర్ | నేషనల్ ఎ/సి - కల్వకుర్తి
తిరుమల - మహబూబ్‌నగర్
తిరంధాజ్ 70 - కరీంనగర్ | శ్రీనివాస 70 - జగిత్యాల | అలంకార్ 70 - సూర్యాపేట్

SUCHIN CINEMAS 9030161717

మహాశివరాత్రి శుభాకాంక్షలతో
నేడే బ్రహ్మాండమైన విడుదల



PVR ఫోరంమాల్ - కూకట్‌పల్లి 10.55am
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 10.45am
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.35am
PVR సినిమాస్ - మూసారాంబాగ్ 10.35am
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 11.00am
INOX నెక్లెస్ సత్వ - కవాడిగూడ 11.30am
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 5.00pm

లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ | మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్, ఎ.ఎం.బి. - గచ్చిబౌలి, సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట, ఫోరం మాల్ - కూకట్‌పల్లి, ఆర్.కె. - బంజారాహిల్స్, ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్, గలేరియా - పంజాగుట్ట, ఐకాన్ - హైటెక్‌సిటీ, పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్, పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్, ప్రెస్టేజ్‌మాల్ - గచ్చిబౌలి, అట్రియమ్ - గచ్చిబౌలి, ఎస్‌2 సోము - మల్లాపూర్, జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్, ఎం.పి మాల్ - కాచిగూడ, మంజీరామాల్ - కూకట్‌పల్లి, సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి, మంత్రామాల్ - అత్తాపూర్, సుధా - శాలిబండ, డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్, ఏషియన్ సత్యం - అమీర్‌పేట్, ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం, సినీ ప్లానెట్ - కొంపల్లి, ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్, ఏషియన్ రాధిక - కాప్రా, ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్, ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి, శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్, సినిమాస్ - బాలానగర్, సినిమాస్ - చందానగర్, లక్ష్మీనరసింహ - మియాపూర్, రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి, జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి, మూవీటైమ్ - అమీర్‌పేట, ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి, స్కైమాల్ - సనత్‌నగర్, టివోలి - సికింద్రాబాద్, మూవీమ్యాక్స్ - మౌలాలి, జె.పి.సినిమాస్ - చందానగర్

ఎస్‌2 - వరంగల్ | శ్రీనివాస - కరీంనగర్ | వేణుమాల్ - నిజామాబాద్ | తిరుమల 70ఎంఎం - మహబూబ్‌నగర్
శ్రీదేవి - హన్మకొండ | గీతా - నిజామాబాద్ | సినిమాస్ - ఆర్మూర్

B M CREATIONS RELEASE

మహాశివరాత్రి శుభాకాంక్షలతో
ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్, ఎ.ఎం.బి. - గచ్చిబౌలి, సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట, ఫోరం మాల్ - కూకట్‌పల్లి, ఆర్.కె. - బంజారాహిల్స్, ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్, గలేరియా - పంజాగుట్ట, ఐకాన్ - హైటెక్‌సిటీ, పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్, పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్, ప్రెస్టేజ్ మాల్ - గచ్చిబౌలి, అట్రియమ్ - గచ్చిబౌలి, ఎస్‌2 సోము - మల్లాపూర్, జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్, ఎం.పి మాల్ - కాచిగూడ, జిఎస్ఎమ్ - మదీనగూడ, నెక్లెస్ సత్య - కవాడిగూడ, అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్, మంజీరామాల్ - కూకట్‌పల్లి, సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి, మంత్రామాల్ - అత్తాపూర్, సుధా - శాలిబండ, డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్, ఏషియన్ సత్యం - అమీర్‌పేట్, ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం, సినీ ప్లానెట్ - కొంపల్లి, ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్, ఏషియన్ రాధిక - కాప్రా, ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్, ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి, శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్, సినిమాస్ - బాలానగర్, సినిమాస్ - చందానగర్, లక్ష్మీనరసింహ - మియాపూర్, రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి, జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి, మూవీటైమ్ - అమీర్‌పేట, ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి, స్కైమాల్ - సనత్‌నగర్, టివోలి - సికింద్రాబాద్, విజయలక్ష్మి - ఎల్.బి.నగర్, శివగంగ - దిల్‌సుఖ్‌నగర్, షా షహెన్‌షా - చింతల్, లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్, మూవీమ్యాక్స్ - మౌలాలి, జె.పి.సినిమాస్ - చందానగర్
మరియు
మీ అభిమాన థియేటర్లలో

SRI LAKSHMI PICTURES 9885291789

మహాశివరాత్రి శుభాకాంక్షలతో
నేడే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00am
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

PVR ఫోరంమాల్ - కూకట్‌పల్లి 10.15am
PVR సినిమాస్ - ఎర్రమంజిల్ 10.35am
INOX జిఎస్ఎమ్ - మదీనాగూడ 10.55am
INOX నెక్లెస్ సత్య - కావాడిగూడ 10.25am
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.40am
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.30pm
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.30am
జె.పి.సినిమాస్ - చందానగర్ 1.40pm

ఆర్తి 70ఎంఎం ఎ/సి - సంఘీనగర్ 11.00,2.00,6.00,9.00
శ్రీనివాస టాకీస్ - నర్సాపూర్ 11.00,2.00,6.00,9.00
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ | మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట

సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట, ఆర్.కె. - బంజారాహిల్స్, ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్, గలేరియా - పంజాగుట్ట, ఐకాన్ - హైటెక్‌సిటీ, పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్, ప్రెస్టేజ్ మాల్ - గచ్చిబౌలి, అట్రియమ్ - గచ్చిబౌలి, ఎస్‌2 సోము - మల్లాపూర్, జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్, ఎం.పి మాల్ - కాచిగూడ, అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్, మంజీరామాల్ - కూకట్‌పల్లి, సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి, మంత్రామాల్ - అత్తాపూర్, డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్, సినీ ప్లానెట్ - కొంపల్లి, ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్

SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

మహాశివరాత్రి శుభాకాంక్షలతో
నేడే బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00.2.15.6.00.9.15

మల్లికార్జున 70ఎంఎం - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30
మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.00,2.15,6.00,9.15
వెంకటరమణపద్మావతి 70 ఎ/సి - కాచిగూడ 11.15,2.30
లక్ష్మీకళ సినీప్రైడ - మూసాపేట్ 11.15,2.15,6.15,9.00
టివోలి 70ఎంఎం - సికింద్రాబాద్ 10.50,1.45,7.45
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 10.15,4.30,10.40
సినిమాస్ - చందానగర్ 10.00,7.15,10.30
తాళ్ళూరి 70 - ఇ.సి.ఐ.ఎల్ 11.00,2.00,6.00,9.00
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 1.45pm | స్వప్న ఎ/సి - కాటెదాన్ 2.15pm

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.45,2.30,8.20,11.00
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.05,1.15,4.05,7.15,10.30
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.15,4.55,7.55,11.00
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.00,1.15,4.30,7.45,11.00
ఆర్.కె. - బంజారాహిల్స్ 10.15,4.30,7.45
ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 10.00,1.25,7.40,10.55
గలేరియా - పంజాగుట్ట 10.05,1.20,7.35,10.50
ఐకాన్ - హైటెక్‌సిటీ 9.50,1.05,7.45,11.00
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 10.10,4.25,7.40,10.55
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ 10.25,1.40,7.45,11.00
ప్రెస్టేజ్ మాల్ - గచ్చిబౌలి 10.10,4.50,11.05
అట్రియమ్ - గచ్చిబౌలి 10.00,7.45,11.00
ఎస్‌2 సోము - మల్లాపూర్ 10.00,4.15,10.30
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 10.10,4.20,7.35,10.50
ఎం.పి మాల్ - కాచిగూడ 10.20,4.30,7.40,10.40
జిఎస్ఎమ్ - మదీనగూడ 10.00,1.20,7.40,10.40
నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.10,4.10,7.30,10.40
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.10,4.00,7.15,10.30
మంజీరామాల్ - కూకట్‌పల్లి 10.15,4.20,7.45,11.00
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 10.00,1.15,7.50,11.05
మంత్రామాల్ - అత్తాపూర్ 10.00,1.15,7.45,11.00
సుధా - శాలిబండ 10.00,1.40,4.25,10.50
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 10.00,1.15,7.45,11.00
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.15,1.10,7.30,10.30
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.55,1.35,7.30,10.30
సినీ ప్లానెట్ - కొంపల్లి 10.30,4.30,10.10
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.30,1.15,4.20,7.35,10.30
ఏషియన్ రాధిక - కాప్రా 1.30,7.30
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.45,4.30,7.35
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.30,1.30,4.15,7.30
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 10.00,4.15,10.30
సినిమాస్ - బాలానగర్ 10.00,4.15,10.30
లక్ష్మీనరసింహ - మియాపూర్ 10.15,4.30,7.40
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 1.15,10.15
మూవీటైమ్ - అమీర్‌పేట 1.00,5.00,7.00
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 10.30,4.15,7.15,10.15
స్కైమాల్ - సనత్‌నగర్ 10.30,4.00,9.30
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 2.15,9.15
షా షహెన్‌షా - చింతల్ 2.15pm
మూవీమ్యాక్స్ - మౌలాలి 10.30,1.30,4.30,7.30,10.30
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.50,1.30,7.30,10.20

జెమిని కాంప్లెక్స్ - వరంగల్ | శ్రీనివాస - కరీంనగర్ | జెమిని - మంచిర్యాల | శ్రీనివాస - గోదావరిఖని
ఎస్‌2 - వరంగల్ | ప్రతిమ - కరీంనగర్ | సినిమాస్ - గద్వాల్ | బాలాజీ - జగిత్యాల
తిరుమల - ఖమ్మం | తిరుమల - మహబూబ్‌నగర్ | సినిమాస్ - ఆర్మూర్ | కృష్ణ క.మం - జనగాం
దేవి - నిజామాబాద్ | వెంకటేశ్వర ఎ/సి - నల్గొండ | విక్టరీ మల్టీప్లెక్స్ - మిర్యాలగూడ | పరమేశ్వర ఎ/సి - షాద్‌నగర్
గీతా - నిజామాబాద్ | శ్రీదేవి - హన్మకొండ | తిరుమల - సూర్యాపేట | మీరజ్ - రాయచూర్
వేణు మాల్ - నిజామాబాద్ | విష్ణురాం సినిమాస్ - కోదాడ



ఉద్యాన్ పార్కును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బోర్డు నామినేటెడ్ మెంబర్ రామకృష్ణ

కంటోన్మెంట్ ఉద్యాన్ పార్కు ప్రారంభం

మారేడ్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మహేంద్ర హిల్స్ కాలనీలో ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నాలుగు వేల చదరపు గజాలలో అన్ని హంగులతో నిర్మించిన కంటోన్మెంట్ ఉద్యాన్ పార్కును కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు. ఉద్యాన్ పార్కులో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు, స్కేటింగ్ స్టేడియం, వాకింగ్ ట్రాక్, పచ్చదనం కలిగిన మైదానాన్ని స్థానిక కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు ప్రెసిడెంట్ కె.సోమశేఖర్, బోర్డు నామినేటెడ్ మెంబర్ జి.రామకృష్ణ, సీఈఓ మధుకర్ నాయక్, ఇంజనీర్లు, అధికారులు, నాయర్, గోపాలదాస్ కృష్ణ, ఉమాశంకర్, ఫణికుమార్, దినేష్, ఎం.రాజకుమార్, దేవేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సూచనలతో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో

● ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



ఉపాధ్యాయుల అభిప్రాయాలను డ్రాప్ బాక్స్ ద్వారా సేకరిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

సికింద్రాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సలహాలు, సూచనలతోనే బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందిస్తామని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ మేనిఫెస్టో రూపొందించనున్న నేపథ్యంలో అన్నివర్గాల ప్రజల సూచనలు తీసుకోవడంలో భాగంగా గురువారం సికింద్రాబాద్ ఆర్‌జీఆర్ సిద్ధాంతి కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది అభిప్రాయాలను డ్రాప్‌బాక్స్ ద్వారా సేకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కళాశాల చైర్మన్ పి.ఎల్.శ్రీనివాస్, ఓబీసీ మహిళా మోర్చా అధికార ప్రతినిధి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా సమ్మేళనాలను విజయవంతం చేయాలి

బర్కత్‌పుర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో నిర్వహించే ఓబీసీ మోర్చా సమ్మేళనాలను విజయవంతం చేయాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, రాజ్యసభసభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ నెల 10న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, దీనిలో కులసంఘాలను భాగస్వాములను చేయాలని సూచించారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ టి.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు చంద్రశేఖర్, ఎడెల్లి అజయ్ కుమార్, సి.కృష్ణగౌడ్, సందీప్‌సాయి, వినయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, మేకల సారంగపాణి, పూస రాజు, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న కేటీఆర్'

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్జెల కాంతం విమర్శించారు. రాజకీయాలపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గురువారం గాంధీభవన్‌లో గజ్జెల కాంతం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ తెచ్చిన అన్ని చట్టాలకు మద్దతు ఇచ్చిన బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌ను విమర్శించడం విడ్డూరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసమే రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని కలిశారని.. ప్రధానిని ఒక ముఖ్యమంత్రి పెద్దన్న అంటే తప్పేమీ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల అవసరాలు, రాష్ట్ర అభివృద్ధి కోసమే సీఎంగా రేవంత్‌రెడ్డి పీఎం మోదీకి వినతిపత్రాలు ఇచ్చారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని అందుకే బీఎస్పీతో సైతం పొత్తుకు సిద్ధపడుతున్నారని విమర్శించారు.

నిరుద్యోగ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకట్

చిక్కడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పోస్టుల సంఖ్యను పెంచేలా ప్రయత్నిస్తానన్నారు.

రసాయనశాస్త్రంలో విస్తృత పరిశోధనలు జరగాలి



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ప్రొ. గోవర్దన్ మెహతా తదితరులు

తార్నాక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని రసాయనశాస్త్రంలో పరిశోధనలు మరింత విస్తృతంగా జరపాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) మాజీ వీసీ ప్రొ.గోవర్ధన్ మెహతా అన్నారు. నేచర్ ఇన్‌స్పైర్డ్ ఇనిషియేటివ్స్ ఇన్ కెమికల్ ట్రెండ్స్ అనే అంశంపై తార్నాకలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ. గోవర్దన్ మెహతా మాట్లాడుతూ మానవజాతి ఆరోగ్య పరిరక్షణకు రసాయనశాస్త్రం, జీవశాస్త్రంలో సమన్వయంతో కలిసి పనిచేసినప్పుడే అద్భుత ఫలితాలను సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. సదస్సు కన్వీనర్ డా. సీహెచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌తరాలకు ఉపయోగపడేవిధంగా నూతన ఆవిష్కరణలు ఏవిధంగా చేయాలి అనే దానిపైన మూడురోజుల అంతర్జాతీయ సదస్సులో విస్తృతంగా చర్చించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ డా.చంద్రశేఖర్, ఐఐసీటీ డైరెక్టర్ డా.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిద్దెతోటలు సాగుచేసిన వారికి పురస్కారాలు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మిద్దెతోటలు సాగుచేసిన వారికి రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. హైదరాబాద్‌లోని ఎఫ్‌టీసీసీఐలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని 24 మందికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రైతునేస్తం కార్యక్రమంలో మిద్దెతోటల అంశాన్ని కూడా చేరుస్తామని హామీ ఇచ్చారు. మహిళలు మిద్దెతోటలపై దృష్టిపెట్టాలని, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే కూరగాయలు పండించాలని, ఆరోగ్య తెలంగాణను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, తుమ్మేటి రఘోత్తంరెడ్డి, పిన్నక పద్మ పాల్గొన్నారు.

పిస్తాహౌజ్‌లో దాడికి పాల్పడిన ఆరుగురి రిమాండ్

రాజేంద్రనగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న అర్ధరాత్రి 12:30 గంటలకు ఉప్పర్‌పల్లి పిస్తాహౌజ్‌లోకి వెళ్లి అక్కడ భోజనాలు చేస్తున్న కస్టమర్లతో పాటు సిబ్బందిపై దాడి చేసిన కేసులో ఆరుగురు వ్యక్తులను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. నౌ నంబర్‌కు చెందిన అయూబ్, తాజుద్దీన్, బాబా, షరీఫ్, బబ్లూ అలియాస్ ఇమ్రాన్, ముస్తాఫా పిస్తా హౌజ్‌కు వెళ్లి అర్ధరాత్రి బిర్యానీ అడిగారు. సమయం మించిపోయింది. బిర్యానీ లేదని అక్కడున్న మేనేజర్ మతిన్ తెలిపాడు. దీంతో రెచ్చిపోయిన ఆ ఆరుగురు వ్యక్తులు హోటల్‌లో ఉన్న వారిపై, సిబ్బందిపై దాడి చేశారు. మేనేజర్ మతిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

శివాలయాలు ముస్తాబు

● చిన్న అనంతగిరిలో ప్రారంభమైన వేడుకలు

● నేడు మహాశివరాత్రి



చిన్న అనంతగిరి శివాలయంలో గణపతి హోమం నిర్వహిస్తున్న ప్రణవ భక్త సమాజం సభ్యులు

రాజేంద్రనగర్/అఫ్జల్‌గంజ్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రికి శైవ క్షేత్రాలు ముస్తాబు అయ్యాయి. నేడు శివరాత్రి పండగ ఆలయాల్లో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు నిర్వాహకులు పూర్తిచేశారు. అత్తాపూర్ రాంబాగ్ చిన్నఅనంతగిరి శివాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. గణపతిహోమం, దేవతా విగ్రహాలకు అభిషేకాలు, సుప్రభాతసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలలో ప్రణవభక్త సమాజం అధ్యక్షుడు మొంగ్ర నర్సింహ, ప్రధానకార్యదర్శి పుస్తకాల అశోక్ పాల్గొన్నారు. రాజేంద్రనగలోని హరిహర క్షేత్రంలో మహాశివరాత్రి వేడకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంతాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని శివాలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఇన్‌స్పెక్టర్ జి.లింగేశ్వర్‌రావు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈసారి వైభవంగా వేడుకలు: శివజాగరణ సమితి

ఈ సంవత్సరం కూడా మహా శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని శ్రీమహా శివరాత్రి జాగరణ్ సేవాసమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానంద్‌గుప్తా తెలిపారు. ఉత్సవాలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే రాజాసింగ్, బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, తదితరులు హాజరు అవుతున్నారని తెలిపారు.

సమాజానికి మంచి కథలను అందించాలి

● రవీంద్ర భారతిలో 'ముగింపులేని కథలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపయోగపడే మంచి కథలను అందించాల్సిన అవసరముందని ప్రముఖ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో శ్రీకళానికేతన్ ఆధ్వర్యంలో నెమలికంటి తారకరామారావు రచించిన ముగింపులేని కథలు పుస్తకావిష్కరణ సభ గురువారం రవీంద్రభారతిలో జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కొలకలూరి ఇనాక్ పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని లయన్ సాధు శ్యాంప్రసాద్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నెమలికంటి తారకరామారావు చక్కటి పేరు సంపాదించారని అన్నారు. సమాజహితం కోరే సాహిత్యాన్ని అందించారని అన్నారు. ముగింపలేని కథలు పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరముందని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, జగన్నాథశర్మ, ఆచార్య రామవరపు గణేశ్వరరావు, లయన్ కటంగూరు హరీష్ రెడ్డి, జొన్న సాంబశివరావు, డా.వెంకట్ గోవాడ తదితరులు పాల్గొన్నారు.

మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలి



తెలుగు సంక్షేమ భవన్ ఎదుట బైఠాయించిన ఆర్.కృష్ణయ్య, నాయకులు, విద్యార్థులు

కార్వాన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థులు, బీసీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి ఆయన మాసాబ్‌ట్యాంక్‌లోని తెలుగు సంక్షేమ భవన్‌ను ముట్టడించి, కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు జీతాలు పెంచుతున్న ప్రభుత్వం, విద్యార్థులకు మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి హాస్టళ్లో ఉంటున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి. గత ఆరేళ్ల కిందటి రేట్లతో మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అవి ఎందుకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సం ఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలే లలితను కలిసిన మాధవీలత

'హైదరాబాద్'లో కాషాయ జెండా ఎగరడం ఖాయం

చాంద్రాయణగుట్ట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ సారి కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ అభ్యర్థి మాధవీలత ధీమా వ్యక్తం చేశారు. గురువారం గౌలిపురాలోని దివంగత కేంద్ర మాజీ మంత్రి ఆలే నరేంద్ర కుటుంబసభ్యులను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, బీజేపీ నాయకులు ఇ.సుమన్‌కుమార్, ఎం.వెంకటేశ్, జి.రఘుకాంత్, జీఎం జ్యోతికుమార్, జమాల్‌పూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధ్యాత్మికతపై అవగాహన ఉండాలి



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న డాక్టర్ మహ్మద్ మహమూద్ షరీఫ్

మదీన, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆధ్యాత్మికత అంశాలపట్ల అవగాహన ఉండాలని కిషన్‌బాగ్‌లోని మదర్సా దీనియా రహ్మత్ ఉల్ ఉలూమ్ కరస్పాండెంట్ మౌలానా ముఫ్తీ మహ్మద్ మహబూబ్ షరీఫ్ నిజామి సాహెబ్ అన్నారు. గురువారం మదర్సాతోపాటు రాయల్ ఇండియన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 'హిస్టరీ ఆఫ్ ఇస్లామిక్ హెరిటేజ్ ఎక్స్‌పో'ను ఆయన ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర, మక్కా, మదీన చరిత్ర, హజ్, ఉమ్రా ప్రాముఖ్యత తదితర అంశాలపై ప్రదర్శనలను ఆయన వీక్షించారు. కార్యక్రమంలో కేఎస్‌ఏ మినిస్ట్రీ ఆఫ్ ఇస్లామిక్ అఫైర్స్ డాక్టర్ మహ్మద్ మహమూద్ షరీఫ్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎస్‌ఏ మజీద్ బాదర్ సాహెబ్, ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ సఫీవుల్లా ఖాన్, రాయల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డాక్టర్ మహ్మద్ సిబ్గతుల్లా షరీఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్ర, వైజ్ఞానిక రంగాలపై అవగాహన కల్పించాలి



విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

మదీన, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్నతనం నుంచే శాస్త్ర, వైజ్ఞానిక రంగాలపై అవగాహన కల్పించాలని బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ సూచించారు. గురువారం కాలాపత్తర్‌లోని గోల్డెన్ జూబ్లీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ అండ్ ఆర్ట్ ఫెయిర్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ట్రాఫిక్, కాలుష్యం, నీటిఎద్దడి సమస్యలపై విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హుస్సేనీ పాషా, మహ్మద్ ఖాదర్, కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపీ, పాఠశాల ప్రిన్సిపాల్ అబ్బాస్ రజా, డైరెక్టర్ హైదర్ రజా పాల్గొన్నారు.

విషాదాన్ని మిగిల్చిన వాటర్ ట్యాంకర్

● మూడేళ్ల బాలిక మృతి, తల్లిదండ్రులకు గాయాలు

రాజేంద్రనగర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లి వస్తున్న కుటుంబంలో వాటర్ ట్యాంకర్ విషాదాన్ని మిగిల్చింది. పాతబస్తీ నవాబ్ సాబ్ కుంటకు చెందిన మహ్మద్ సలీం, భార్య ముజాబీన్‌బేగం, కుమార్తె సిద్రా ఫాతీమా(3), ఫజీమా (4నెలలు)తో కలిసి బుధవారం చిలుకూరిలోని ఓ శుభకార్యానికి క్వాలీస్ వాహనంలో వెళ్లారు. ఫంక్షన్ ముగిసిన తర్వాత రాత్రి 11.45 ప్రాంతంలో తిరిగి వస్తుండగా హిమాయత్‌సాగర్ వద్ద మలుపు వద్ద ఎదురుగా వచ్చిన వాటర్ ట్యాంకర్ (ఏపీ28 టీసీ 0136), క్వాలీస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్వాలీస్ వాహనంలో ఉన్న చిన్నారి ఫాతీమా అక్కడికక్కడే మృతిచెందగా, మహ్మద్ సలీమ్, ముజాబీన్ బేగంతోపాటు నాలుగు నెలల చిన్నారి షేక్ ఫజీమాకు గాయాలయ్యాయి. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ పరారయ్యాడు. ఘటనా స్థలికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ యాదగిరి

అభివృద్ధి పనులను నాణ్యతతో చేయాలి

పహడిషరీఫ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతతో చేయాలని కౌన్సిలర్ బుడుమల యాదగిరి సూచించారు. గురువారం జల్‌పల్లి వీకర్ సెక్షన్ కాలనీలో హెచ్‌ఎండీఏ నిధులు రూ.40 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జల్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ షేక్ జహంగీర్, నరసింహ, నవీన్‌గౌడ్, వెంకటేశ్, సలీం, నవాజ్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మెహిదీపట్నం ఆర్టీసీ డిపోలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ధనలక్ష్మి తదితరులు

కార్వాన్/ నార్సింగ్/ రాజేంద్రనగర్ / మదీన/ హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. గురువారం మెహిదీపట్నం ఆర్టీసీ బస్సు డిపో, రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ(ఐఐఆర్ఆర్), నార్సింగ్‌లోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నగరంలోని నోవాటెల్ హెచ్ఐసీసీల్లో మహిళా దినోత్సవాన్ని జరుపుకొన్నారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్)లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి వివిధ రకాల పోటీలను నిర్వహించారు. మహిళా సిబ్బంది వివిధ రకాల వంటకాలను తయారు చేశారు. చీరలు, ఇతర వస్తువుల అమ్మకాలపై వ్యాపార మెళకువలను ప్రదర్శించారు. నోవాటెల్ హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో హైబిజ్ టీవీ వారు వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళలను సన్మానించి అవార్డులను అందజేశారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)లో ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్‌గా, ప్రజాసంబంధాల అధికారిణి గుత్తికొండ అనీజ ఉమెన్ లీడర్‌షిప్ అవార్డు- 2024 అందుకొన్నారు.

బహదూర్‌పురాలో వినూత్న కార్ల మ్యూజియం ఆధ్వర్యంలో వినూత్న కార్లను రూపొందించారు. శివలింగం ఆకారంలో తయారు చేసిన కారు ఆకట్టుకుంది. 75 సీసీ ఇంజన్ కెపాసిటీతో కారును తయారు చేశారు. మహిళలు ఉపయోగించే హ్యాండ్ బ్యాగ్, చెప్పులు, లిప్‌స్టిక్ ఆకారాలతో కార్లను రూపొందించారు. పాడైన వాహనాల విడిభాగాలతో ఈ వాహనాలను తయారుచేసినట్లు 'సుధా'కార్ మ్యూజియం యజమాని సుధాకర్ తెలిపారు. మహిళలనుద్దేశించి పలువురు మాట్లాడుతూ మహిళలు వంటింటికి మాత్రమే పరిమితంకాకుండా సమాజ సేవ చేయడానికి ధైర్యంగా ముందుకు రావాలని అన్నారు. గురువారం నాంపల్లిలోని అసోసియేషన్ భవన్‌లో మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా విభాగం ప్రతినిధి దీపారెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు. అభివృద్ధి పథంవైపు వెళ్లాలంటే ధైర్యంగా ముందడుగు వేయాలన్నారు.



టీజీవోస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాసరావు తదితరులు



హ్యాండ్ బ్యాగ్, షూ ఆకారాల్లో కారు | ఇన్‌సెట్లో శివలింగం



చీరలను విక్రయిస్తున్న మహిళా సిబ్బంది




వంటకాలను రుచి చూస్తున్న సంస్థ డైరెక్టర్ మీనాక్షి రామన్ సుందరం

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/OQGEHs2 లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

10 నుంచి ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు

కార్వాన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నం సరోజినిదేవి ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ వైరాగ్యం రాజలింగం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వారోత్సవాలను ఆదివారం మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారని చెప్పారు. వారోత్సవాల్లో భాగంగా పలు కళాశాలల విద్యార్థులకు కంటి వ్యాధులపై అవగాహన కల్పిస్తామని అన్నారు. నీటి కాసుల వ్యాధి మెల్లగా వృద్ధి చెందుతుందని, తప్పనిసరిగా ప్రతీ ఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు.

టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాములు



బాధ్యతలు స్వీకరిస్తున్న రాములు

కార్వాన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఏ. రాములు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గురువారం రాములు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

15న రాజ్యాధికార సదస్సు

రాజేంద్రనగర్, మార్చి7(ఆంధ్రజ్యోతి): బండ్లగూడ జాగీర్, ఆరెమైసమ్మ దేవాలయం ప్రాంతంలోఈ నెల 15న రాజ్యాధికార సదస్సు నిర్వహిస్తున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు ఆదిరాల రవికుమార్ తెలిపారు. పార్టీ నాయకులతో కలిసి గురువారం ఉప్పర్‌పల్లిలోని బీఎస్పీ కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, బీఎస్పీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డాక్టర్ రవీందర్‌కు బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవీందర్

రాజేంద్రనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): షాదన్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఈసీఈ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న డాక్టర్ కోరని రవీందర్‌కు బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ జేఎన్‌టీయూ, పీపుల్ ఆర్ఆర్ఆర్ సంస్థ సంయుక్తంగా గురువారం జేఎన్‌టీయూలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం జరిగింది. జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ కట్ట నర్సింహ్మారెడ్డి, రైల్వేస్ అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్, రిజిస్ట్రార్ డాక్టర్ టి.వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్ డాక్టర్ రజనీ ఆయనకు అవార్డు అందజేశారు.

టీడీపీ పూర్వవైభవానికి కృషి



దినేశ్‌ను సన్మానిస్తున్న అశోక్, నందీశ్వర్, యాదిలాల్

అఫ్జల్‌గంజ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.డి.దినేశ్‌ను నియమిస్తూ రాష్ట్ర ఇన్‌చార్జి కె.రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం టీడీపీ సెంట్రల్ భవనంలో దినేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దినేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

'షాపులను వ్యాపారులకు కేటాయించాలి'

అఫ్జల్‌గంజ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బేగంబజార్ డివిజన్‌లో రూ.10కోట్లతో ఆధునాతన హంగులతో చేపల మార్కెట్ భవన సముదాయం నిర్మించినా, వ్యాపారులు రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తున్నారని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. షాపులను వెంటనే వ్యాపారులకు కేటాయించాలని కోరారు. గురువారం జీహెచ్ఎంసీ సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు.

రెవెన్యూ అధికారులు, ఉద్యోగులకు సెలవులు రద్దు

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని రెవెన్యూ విభాగం అధికారులు, ఉద్యోగులకు సెలవులు రద్దయ్యాయి. ఈ మేర కు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం సర్క్యులర్ జారీ చేశారు. నగరంలో నేటి (శుక్రవారం) నుంచి 10వ తేదీ వరకు సీఎం రేవంత్‌రెడ్డి అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు ఉన్నందున అధికారులు, తహసీల్దార్లు, సూపరింటెండెంట్లు, కలె క్టరేట్ సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. శుక్ర, శని, ఆదివారాల్లో పబ్లిక్ హాలీ డేస్ ఉండవని, విధుల్లో తప్పనిసరిగా ఉండాలని ఆయన ఆదేశించారు.

బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి రూ.20 లక్షల విరాళం


చెక్కును అందజేస్తున్న క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత స్క్రీనింగ్ క్యాంపుల నిర్వహణకు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.20 లక్షల విరాళాన్ని అందజేసింది. గురువారం ఉదయం ఆస్పత్రిలో క్రిటికల్ రివర్ టెక్నాలజీస్‌కు చెందిన ప్రతినిధులు చంద్ర చంద్రగిరి రూ.20లక్షల చెక్కును బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ సీఈవో డాక్టర్ కె.కృష్ణయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన చంద్ర చంద్రగిరి, క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ డైరెక్టర్ వినాయకుల్లా షేక్, శ్రీని పట్నాని, బసవతారకం ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి.ఎస్. రావు, కల్పనా రఘునాథ్, డాక్టర్ సెంథిల్ రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూలుకు
పర్యవేక్షణాధికారులు

- సర్కిళ్ల వారీగా సీనియర్ అధికారులకు బాధ్యతలు
- ఓటీఎస్ లక్ష్యం రూ.685.74 కోట్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆస్తి పన్ను వసూలుపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించింది. ఆస్తి పన్నుపై వడ్డీలో 90 శాతం మాఫీ చేస్తూ ప్రభుత్వం వన్ టైం స్కీమ్ (ఓటీఎస్) ప్రకటించిన నేపథ్యంలో సర్కిళ్ల వారీగా సీనియర్ అధికారులను పర్యవేక్షకులుగా నియమిస్తూ గురువారం కమిషనర్ రోనాల్డ్‌రోస్ సర్క్యులర్ జారీ చేశారు. 2023-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,100 కోట్ల పన్ను లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు రూ.1,428 కోట్లు వసూలైంది. ఓటీఎస్‌లో రూ.685.74 కోట్ల పన్ను వసూలును టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈ క్రమంలో పథకం విషయం ప్రజలకు తెలిసేలా చేయడంతో పాటు పన్ను వసూలు పెరిగేలా చర్యలు తీసుకోనున్నారు. సర్కిళ్ల వారీగా టాప్ బకాయిదారులు, గతంలో చెక్కులు బౌన్స్ అయిన వారి వివరాలు తీసుకొని వాటి ఆధారంగా పన్ను వసూళ్ల పెంపునకు పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ విభాగాల నుంచి పన్ను బకాయిల వసూలుపైనా ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు.

రూ.685.74 కోట్ల లక్ష్యం...

జోన్లు, సర్కిళ్ల వారీగా ఓటీఎస్ వసూలు లక్ష్యాలను ఉన్నతాధికారులు నిర్దేశించారు. బకాయిల్లో రూ.685.74 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించారు. అత్యధికంగా ఖైరతాబాద్ జోన్‌లో రూ.194.35 కోట్లు, ఎల్బీనగర్‌లో రూ.123.10 కోట్లు, శేరిలింగంపల్లిలో రూ.117.64 కోట్లు, కూకట్‌పల్లిలో రూ.101.46 కోట్లు, సికింద్రాబాద్‌లో రూ.98.63 కోట్లు, చార్మినార్ జోన్‌లో రూ.50.56 కోట్లు టార్గెట్‌గా పెట్టుకున్నారు.

అన్నింటా మహిళల పురోగతి

- పలుచోట్ల మహిళా దినోత్సవం
- ప్రతిభా వంతులకు సత్కారం..
- మార్గదర్శకంగా మహిళలు
- ఎస్‌బీఐ జీఎం ప్రకాష్ చంద్ర బరోడ్



సినీ నేపథ్య గాయని చాగంటి సాహితిని సత్కరించిన ప్రకాష్ చంద్ర బరోడ్, తదితరులు

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో అన్ని రంగాల్లో మహిళలు ముందంజ వేస్తున్నారని, మహిళలు ప్రగతి సాధించని రంగం లేదని స్టేట్ బ్యాంక్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్, జనరల్ మేనేజర్ ప్రకాష్ చంద్ర బరోడ్ అన్నారు. మహిళలు సాంకేతికంగా ముందడుగు వేయడమే గాక, సమాజంలో పలువురికి ప్రేరణ కలిగిస్తూ మార్గదర్శకంగా నిలుస్తున్నారని బరోడా అన్నారు. బేగంపేటలోని స్టేట్ బ్యాంక్ స్టాఫ్ కాలేజ్ ఆధ్వర్యంలో మార్చి 6 నుంచి 11వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రముఖ సినీ నేపథ్య గాయని చాగంటి సాహితిని ఈ సందర్భంగా సత్కరించారు. మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన వైద్యశిబిరంలో కేన్సర్ వ్యాధులు, స్త్రీ సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగించడానికి ప్రత్యేక వైద్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలతో పాటు బ్యాంకు డీజీఎంలు వెంకట్ శాస్త్రి, అజయ్ అయ్యర్, జోసెఫ్ క్రిస్టీ, సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాలలో రాణిస్తున్నారు


వేడుకల్లో పాల్గొన్న బీఎన్ఐ క్యాపిటల్ చాప్టర్ ఉద్యోగులు

బంజారాహిల్స్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంఎస్ఎంఈ (మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ ఎస్.స్వరూప్ తెలిపారు. 'బీఎన్ఐ క్యాపిటల్ చాప్టర్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ పార్క్ హయత్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీఎన్ఐ (బిజినెస్ నెట్‌వర్క్ ఇనిస్టిట్యూట్) హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా మాట్లాడుతూ జనాభాలో సగ భాగం ఉన్న మహిళలకు సమాన హక్కులు ఉండాలన్నారు. సహనం, సామాజిక నైపుణ్యాలు, ఒప్పించే శక్తి, సానుభూతి వంటి అనేక ప్రత్యేక లక్షణాలు కేవలం మహిళల్లో మాత్రమే కనిపిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ క్యాపిటల్ అధ్యక్షుడు సందీప్ జైన్, వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తం ఆది, కార్యదర్శి, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో సంకల్పశక్తి ఎక్కువ

- పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళల్లో సంకల్పశక్తి ఎక్కువగా ఉంటుందని, వారు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు తమ సత్తా చాటేందుకు ముందుకు వస్తున్నారని, పురుషుల కంటే వారు మెరుగ్గా రాణిస్తున్నారని అన్నారు. తమ వృత్తిపరమైన బాధ్యతలను గౌరవంగా నిర్వహించాలని, ధైర్యంగా పనిచేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మహిళా అధికారులందరూ పోలీసు శాఖలో భాగమై సమాజానికి చేస్తున్న కృషిని సీపీ కొనియాడారు. ఉద్యోగరీత్యా ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ అడ్మిన్ జె. పరిమళ హన నూతన్, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ధార కవిత, డీసీపీ రష్మీపెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.


అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మహిళలకు విటమిన్ 'డి' లోపం

అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్యులు

బంజారాహిల్స్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు విటమిన్ 'డి' లోపంతో బాధపడుతున్నారని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ ఆస్పత్రి వైద్యులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'స్ట్రాంగ్ ఉమెన్ స్ట్రాంగ్ భారత్' థీమ్‌తో జూబ్లీహిల్స్ ఆస్పత్రిలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నటి కుశిత కల్లాపు హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ పీడియాట్రీషియన్ డాక్టర్ షర్మిల మాట్లాడారు. 90శాతం మంది మహిళలు విటమిన్ డి సమస్యతో సతమతమవుతున్నారని చెప్పారు. డి విటమిన్ లోపం మహిళల్లో ఎముకల ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే ప్రగతిని వేగవంతం చేయవచ్చన్నారు. కన్సల్టెంట్ ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి గోగినేని మాట్లాడుతూ వేషధారణ వల్ల లేదా సూర్యరశ్మి తగలకపోవడం వల్ల మహిళల్లో డి విటమిన్ లోపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



ఇందిరాపార్కు, ధర్నాచౌక్‌లో సేవ్ ఇండియన్ ఫ్యామిలీ నేతలు గురువారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కారణాలు లేకుండా ఇష్టానుసారంగా భర్తలపై కేసులు నమోదు చేసి వేధించడాన్ని సమాజంలో ఉన్న కొంతమంది మహిళలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

పరీక్షల వేళ మమ్స్, స్కార్లెట్స్ జ్వరాలు

(5వ పేజీ తరువాయి)

వాపుగా ఏర్పడి నొప్పిగా ఉంటాయి. అన్నం నమలడం, మింగడం కష్టంగా ఉంటుంది. జ్వరం, తలనొప్పి, వెన్నునొప్పి, శరీరం నొప్పులు ఉంటాయి.

జాగ్రత్తలు ఇలా..

- మమ్స్, స్కార్లెట్స్ జ్వరం వచ్చిన వారిని ప్రత్యేక గదిలో ఉంచాలి.
- పిల్లలను ఆ సమయంలో బయటకు, స్కూళ్లకు పంపించవద్దు.
- బాధితులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు కర్చీఫ్ అడ్డంగా పెట్టుకోవాలి.
- దగ్గు, జ్వరం, జలుబు ఉంటే వైద్యుడిని సంప్రదించాలి

5 నుంచి 7 రోజుల వరకూ..

మమ్స్‌తో ఇబ్బంది పడే వారికి జ్వరం ఉంటుంది, సరిగ్గా తినరు. ఐదు నుంచి ఏడు రోజులపాటు ఇబ్బందులు ఉంటాయి. స్కార్లెట్స్ జ్వరంతో బాధపడే వారు ఆహారం మింగడం కష్టంగా ఉంటుంది. ఇది ఎక్కువగా 5 నుంచి 15 ఏళ్ల వారికి వస్తుంది. ముందుగా ముఖంలో ర్యాషెస్ కనిపిస్తాయి. తర్వాత శరీరం మొత్తం దద్దుర్ల మాదిరిగా విస్తరిస్తుంది. ఈ లక్షణాలు ఉన్న పిల్లలను స్కూల్స్‌కు పంపించవద్దు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.

- డాక్టర్ అనుపమ,
పిల్లల వైద్యురాలు, రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి

వీరమాచినేని రమకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న రమ

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన వీరమాచినేని రమకు డాక్టరేట్ పురస్కారం లభించింది. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో హోం సైన్స్ విభాగంలో డాక్టరేట్ చదువుతున్న ఆమె హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్ అంశంలోని 'ఎఫెక్టివ్‌నెస్ ఆఫ్ న్యూట్రిషనల్ సప్లిమెంటేషన్ ఆన్ థైరాయిడ్ ఫంక్షన్'పై ఇటీవల సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ పురస్కారాన్ని అందజేశారు. ఈ మేరకు వీరమాచినేని రమ గురువారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను స్వీకరించారు.

అవి ప్రభుత్వ భూములే..

- కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై హైకోర్టు తీర్పు

గచ్చిబౌలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలం కంచగచ్చిబౌలి గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 25లోని సుమారు 400ఎకరాల భూములు ప్రభుత్వ భూములేనని హైకోర్టు తీర్పునిచ్చింది. 2007నుంచి ఈ భూములపై కోర్టులో వివాదం నడుస్తున్నది. ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ అనిల్‌కుమార్ ప్రభుత్వానికి అనుకూలంగా గురువారం తీర్పు ఇచ్చినట్లు శేరిలింగంపల్లి డిప్యూటీ తహసీల్దార్ శంకర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే 2006లో అప్పటి ప్రభుత్వం ఐఎంజీ అకాడమిక్స్ భారత ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 400ఎకరాల భూమి ఇచ్చింది. కొన్నాళ్ల తర్వాత ఆ భూములను ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. దీనిని వ్యతిరేకిస్తూ సదరు సంస్థ హైకోర్టులో కేసు వేసింది. నాటినుంచి వివాదం నడుస్తుండగా నేడు ప్రభుత్వానికి అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చినట్లు డిప్యూటీ తహశీల్దార్ తెలిపారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

తార్నాక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమాజానికి మూలస్తంభాలైన విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరాం హామీ ఇచ్చారు. తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఓయూలోని టెక్నాలజీ ఆడిటోరియంలో కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు. ప్రొ. కోదండరాంతోపాటు ప్రొ.హరగోపాల్ హాజరై వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రొ. హరగోపాల్ మాట్లాడు తూ సామాజిక న్యాయంలో భాగంగా కాంట్రాక్ట్ అధ్యాపకులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ. పి.ఎల్. విశ్వేశ్వరావు. ప్రొ. రమా, కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. పరశురాం, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. జితేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డా. ప్రేమయ్య, డా. భూమయ్య, చేగుంటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌పీకి క్షమాపణ చెప్పకుంటే మంత్రి ఇంటిని ముట్టడిస్తాం : వంగపల్లి

రాంనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ తక్షణం క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో మంత్రి ఇంటిని ముట్టడిస్తామని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం విద్యానగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో పార్టీ పొత్తులనేవి సహజమని, మంత్రి అయి ఉండి ఒకపార్టీ రాష్ట్ర అధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తక్షణమే బేషరతుగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బల్కంపేట ఆలయ అభివృద్ధికి రూ. 4.40 కోట్లు

(5వ పేజీ తరువాయి)

లేజర్ షో ఈనెల 9న సాయంత్రం 5 గంటలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అలాగే, కోట్లాది రూపాయలతో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్లను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ తరహాలో ఆధునీకరిస్తున్నామన్నారు. హైటెక్‌సిటీలో దక్షిణభారత సంస్కృతి కేంద్రం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మొత్తంగా పర్యాటక మంత్రిత్వ శాఖ పరిధిలో స్వదేశ్ దర్శన్ పథకానికి సంబంధించి రూ.1400 కోట్ల విలువైన 52 ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించినట్లు చెప్పారు. తెలంగాణలో శక్తి పీఠమైన జోగులాంబ దేవాలయానికి రూ.39 కోట్లు, వరంగల్ ములుగు రామప్ప దేవాలయానికి రూ. 70కోట్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్, సరళ ఆలయ ఈవో నాగరాజు, చైర్మన్ సాయిబాబా గౌడ్, ధర్మకర్తలు షరాఫ్ సంతోష్, కూతురు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి పండ్లకు ధరల రెక్కలు

(5వ పేజీ తరువాయి)

మాత్రమే ఆహారంగా స్వీకరిస్తారు. దీన్ని వ్యాపారులు అనువుగా మార్చుకుంటున్నారు. రెండు, మూడు రోజుల్లోనే పండ్ల ధరలు పెంచేశారు. మొన్నటి వరకు రిటైల్‌మార్కెట్‌లో కిలో రూ. 50 నుంచి రూ. 60 అమ్మిన ద్రాక్ష ప్రస్తుతం రకాన్ని బట్టి 70 నుంచి 100 పలుకుతోంది. రూ. 30 ఉండే దానిమ్మ ధర 50కి చేరింది. హోల్‌సేల్‌లో కిలో రూ. 5 నుంచి 20 ఉండే పుచ్చకాయ కిలో 30 నుంచి 40కి చేరింది. సంత్ర ధరను ఒక్కొక్కటి రూ. 5 నుంచి 10కి పెంచారు. కాగా, శివారులోని బాటసింగారం పండ్ల మార్కెట్ గురువారం ఉదయం 5 గంటల నుంచే వ్యాపారులతో కిటకిటలాడింది. శివరాత్రి నేపథ్యంలో నగరానికి చెందిన పండ్లవ్యాపారులు, పెద్దఎత్తున మార్కెట్‌కు చేరుకోవడంతో జనసంద్రంగా మారింది.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

- తిరుపతి నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- నలుగురు అలియాబాద్ వాసుల దుర్మరణం


అలియాబాద్‌లో నలుగురి మృతదేహాలు

మూడుచింతలపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వివాహానంతరం తిరుపతి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని స్వగ్రామానికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన అలియాబాద్ వాసులకు గురువారం స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. నూతన దంపతులతోపాటు వరుడి తల్లిదండ్రులకు అంతిమ సంస్కారాలు పూర్తయ్యాయి.

నగరంలోని అల్వాల్ వెస్ట్ వెంకటపురంలో నివాసం ఉండే రవీందర్(55)కు భార్య లక్ష్మి(49), ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు బాలకిరణ్(30) స్వీడన్‌లో ఉద్యోగం చేసేవాడు. అతడికి పెళ్లి నిశ్చయం కావడంతో ఫిబ్రవరి 8న నగరానికి వచ్చాడు. అతడికి ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలికి చెందిన కావ్యశ్రీ(28)తో మార్చి 1న వధువు స్వస్థలంలో పెళ్లి జరిగింది. ఈనెల 3న శామీర్‌పేట మండలం తూంకుంటలోని ఓ రిసార్ట్స్‌లో రిసెప్షన్ నిర్వహించారు. సోమవారం రవీందర్, లక్ష్మి, వధూవరులు బాలకిరణ్, కావ్యశ్రీలు కలిసి వేంకటేశ్వరస్వామి దర్శనానికి కారులో తిరుమల వెళ్లారు. దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణం కాగా.. వారు ప్రయాణిస్తున్న కారు బుధవారం తెల్లవారు జామున నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అశోక్(22)తో పాటు నవ దంపతులు, వరుడి తల్లిదండ్రులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. డ్రైవర్ వినహా మిగతా వారి మృతదేహాలను శామీర్‌పేట మండలంలోని సొంతూరు అలియాబాద్‌కు తరలించారు. గురువారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

యువతిలా చాటింగ్ చేసి..

(5వ పేజీ తరువాయి)

మహ్మద్ ఫహీమ్‌ను అంతమొందించాలని కుట్రపన్నాడు. కాలాపత్తర్‌కు చెందిన టీనేజర్, షాహీన్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ మినాజ్ (20), ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖయ్యూమ్(19), మహ్మద్ ఫయీమ్(23)తో కలిసి ఫహీమ్‌ను హత్య చేయాలని పథకం వేశాడు. దీనిలోభాగంగా నేహాఖాన్ అనే యువతి పేరుతో ఇన్‌స్టాగ్రామ్ క్రియేట్ చేశారు. అందులో అందమైన యువతి ఫొటోను డీపీగా పెట్టారు. మహ్మద్ ఫహీమ్‌తో చాటింగ్ చేయడం మొదలుపెట్టారు. అలా చాటింగ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన చింతల్‌మెట్ ఎం.ఎం పహడీ వద్దకు రమ్మని మెసేజ్ చేశారు. నిజంగానే అందమైన అమ్మాయి పిలిచిందని భావించిన ఫహీమ్ అక్కడకు వెళ్లాడు. అప్పటికే అక్కడ స్నేహితులతో కాపు కాచిన మహ్మద్ యాసిన్ కత్తులతో ఫహీమ్‌ను పొడిచి, ఆ తర్వాత బండరాయితో మోది హత్య చేశారు. ఫహీమ్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులైన మహ్మద్ యాసిన్, ఓ టీనేజర్, మహ్మద్ అబ్దుల్ మినాజ్, మహ్మద్ ఖయ్యూమ్, మహ్మద్ ఫయీమ్‌లను పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, కత్తి, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

తండ్రి మరణాన్ని తట్టుకోలేక..
కుమార్తె బలవన్మరణం


కీర్తన

కొత్తపేట, మార్చి7 (ఆంధ్రజ్యోతి): తండ్రి మృతిని జీర్ణించుకోలేని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై లింగారెడ్డి కథనం ప్రకారం బాసాని శ్రీనివాస్, సునీత దంపతులు కొద్దిరోజుల క్రితం నల్లగొండ నుంచి నగరానికి వచ్చి మన్సూరాబాద్ సాయి సప్తగిరి కాలనీలో నివాసముంటున్నారు. శ్రీనివాస్ వనస్థలిపురంలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేసేవాడు. అయితే 3 నెలల క్రితం అనారోగ్యంతో అతను మరణించాడు. దీంతో అప్పటినుంచి అతని కుమార్తె కీర్తన (20) మనోవేదనకు గురవుతూ వస్తోంది. ఓ వైపు టైలరింగ్ చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నప్పటికీ తండ్రి మరణాన్ని గుర్తుకు చేసుకుని బాధ పడుతుండేది. కాగా, గురువారం సాయంత్రం ఆమె తల్లి సునీత పని నిమిత్తం బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేసరికి గడియ వేసి ఉంది. ఎంతసేపు పిలిచినా కీర్తన తలుపు తీయలేదు. అనుమానంతో ఆమె కిటికీ అద్దం పగులగొట్టి చూడగా కీర్తన చున్నీతో ఉరేసుకుని కనిపించింది. దీంతో ఆమె పక్కింటి వాళ్ల సాయంతో తలుపు తెరిచి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ పట్ల అసభ్య ప్రవర్తన

- వ్యక్తిపై పోక్సో కేసు

అడ్డగుట్ట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బడి నుంచి ఇంటికి వెళ్తున్న ఓ మైనర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై తుకారాంగేట్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ అంబటి అంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం అడ్డగుట్టకు చెందిన 15 ఏళ్ల బాలిక స్థానికంగా ఓ ప్రభుత్వ బడిలో చదువుకుంటున్నది. గురువారం స్కూలు నుంచి ఇంటికి వెళ్తున్న బాలిక వద్దకు అడ్డగుట్టకు చెందిన రాజేష్ వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో రాజేష్ పారిపోయాడు. ఈలోగా బైకుపై స్కూలుకు వస్తున్న బాలిక తండ్రి.. ఏడుస్తూ కనిపించిన కుమార్తెను ఏమైందని ప్రశ్నించాడు. దీంతో జరిగిన విషయం చెప్పింది. వెంటనే తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో రాజేష్‌పై ఫిర్యాదు చేశాడు. పోక్సో కేసు నమోదు చేసి రాజేష్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమతులు లేకుండా హెన్నా తయారీ

- నర్గీస్ హెర్బ్స్ కాస్మెటిక్ కేంద్రంపై డీసీఏ అధికారుల దాడులు
- భారీ మొత్తంలో ఉత్పత్తులు- ముడి సరుకు స్వాధీనం


స్వాధీనం చేసిన సామగ్రితో డీసీఏ అధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా కాస్మెటిక్స్, హెన్నా (గోరింటాకు) తయారు చేస్తున్న కేంద్రంపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు దాడులు నిర్వహించారు. జియాగూడలోని ఎల్ఎన్‌నగర్‌లో నర్గీస్ హెర్బ్స్ పేరిట కాస్మెటిక్స్ తయారు చేస్తున్నారన్న సమాచారంతో అధికారులు సోదాలు నిర్వహించారు. అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా, కాస్మెటిక్స్ లైసెన్సు లేకుండా జాగ్రత్తలు పాటించకుండా పాకీజా గోల్డ్ పేరిట మెహందీ కోన్స్ (హెన్నా పేస్ట్), హెన్నా పౌడర్, పాకీజా ఆర్ట్ హెన్నా, ఫాస్ట్ ఆర్ట్ హెన్నా, మెహందీ పౌడర్లను తయారు చేస్తున్నారు. హెన్నా తయారీలో కొన్నింటిలో నిషేధిత రసాయనాలు వాడినట్లు అధికారులు గుర్తించారు. నిల్వ చేసిన కాస్మెటిక్స్ ఉత్పత్తులతోపాటు భారీ మొత్తంలో ముడి సరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ తర్వాత చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు ఓల్డ్‌సిటీ మెట్రోకు శంకుస్థాపన

(5వ పేజీ తరువాయి)


పాతబస్తీకి మెట్రోరైలు రానున్నదన్నారు. 1100 నిర్మాణాలు ఈ ప్రాజెక్టులో పోనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు గుర్తించారన్నారు. ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో ఏసీపీలు శ్రీనాథ్, మోహన్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అడిషనల్ ఎస్పీ ప్రకాశ్‌రావు తదితరులు బందోబస్తును పరిశీలించారు. కాగా, లాల్‌దర్వాజ సమీపంలో మెట్రోస్టేషన్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు నానవాల ప్రమోద్‌రెడ్డి, పర్వతాల రాజేందర్, నరేశ్, పులిపాటి రాజేశ్ మెట్రోరైలు ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఎండీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

నివేదన

స్త్రీ శక్తి

అనాదిగా ఆధ్యాత్మిక మార్గంలో మహిళలు సాగించిన ప్రయాణం విశిష్టమైనది. అలాగే దేశంలోని వివిధ ఆధ్యాత్మిక సంస్థల మీద, ఉద్యమాల మీద తమదైన ముద్ర వేసిన వారు ఎందరో. మహిళా దినోత్సవం సందర్భంగా అటువంటి కొందరు మహిళలను గుర్తు చేసుకుందాం:

వారు చూపిన దారిలో...



దివ్య జనని

దివ్యజననిగా ఖ్యాతి పొందిన శ్రీశారదాదేవి... రామకృష్ణ పరమహంసకు ఆధ్యాత్మిక సహధర్మచారిణి. ఆమె 1853 డిసెంబర్ 22న పశ్చిమబెంగాల్‌లోని ఒక కుగ్రామంలో జన్మించారు. బాల్యం నుంచి దైవారాధనలో నిమగ్నమై ఉండేవారు. ఆరేళ్ళ వయసులో శ్రీ రామకృష్ణులతో ఆమెకు వివాహం జరిగింది. ఆ తరువాత సుమారు పన్నెండేళ్ళపాటు తల్లితండ్రుల దగ్గరే ఉండి, దైవ చింతనలో కాలం గడిపారు. పద్దెనిమిదేళ్ళ వయసులో కాలినడకన దక్షిణేశ్వర్ వెళ్ళి... భర్తను కలుసుకున్నారు అప్పటికే శ్రీరామకృష్ణులు ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థితికి చేరుకున్నారు. ఇంట్లో దేవతార్చన, కుటుంబ నిర్వహణ తదితర అంశాలను ఆమెకు నేర్పారు. ఆయన బోధలతో ఆమె కూడా సంపూర్ణమైన భక్తిమార్గంలో గడిపారు. శారదాదేవిని అమ్మవారి అవతారంగా శ్రీరామకృష్ణులు సంభావించారు. ఆయన భక్తులను, శిష్యులను శారదాదేవి కన్నబిడ్డలుగా భావించి, ఆదరించారు. భగవంతుడి సాక్షాత్కారాన్ని ఆశించిన ఆమె భౌతిక బంధాలకు అతీతంగా జీవించారు. రామకృష్ణుల పరిచర్యకే అంకితమయ్యారు. శ్రీ రామకృష్ణులు అనారోగ్యానికి గురైనప్పుడు... ఆయన సంరక్షణ బాధ్యతలకే అంకితమయ్యారు. శ్రీ రామకృష్ణుల మరణానంతరం కొన్నాళ్ళపాటు తీర్థయాత్రలు చేశారు. అనంతరం శిష్యుల అభ్యర్థన మేరకు శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక మార్గ సారథ్యాన్ని చేపట్టారు. కోల్‌కతాలో నివేదిత పాఠశాలను స్థాపించి, మహిళా విద్యకు పునాదులు వేశారు. ఇది ఒక విధంగా... ఆ తరువాత ఏర్పడిన రామకృష్ణ మఠ సేవా కార్యక్రమాలకు ఆరంభంగా చెప్పవచ్చు. అలాగే శ్రీ రామకృష్ణ మార్గంలో మహిళల ప్రవేశానికి నాందిగా పేర్కొనవచ్చు. 1897లో రామకృష్ణ మిషన్‌ను స్థాపించిన తరువాత, దానికి అధిపతిగా శ్రీశారదాదేవిని స్వామి వివేకానంద ప్రకటించారు. తన మార్గదర్శకత్వం కోరుతూ... భక్తితో తనను దర్శించుకున్నవారిని అమ్మగా ఆమె అక్కున చేర్చుకున్నారు. దివ్యజననిగా మన్ననలు అందుకున్న శారదాదేవి 1920 జూలై ఇరవై ఒకటిన ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు. త్రికరణశుద్ధిగా నిజాయితీగా ఉన్నవారికే భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయని ఆమె చెప్పేవారు. "నేను అందరికీ తల్లినే. ఎప్పుడూ భయపడకండి. మీరు బాధలో ఉన్నప్పుడు నాకు తల్లి ఉందని గుర్తుచేసుకోండి" అని బోధించారు. శ్రీరామకృష్ణ మఠం పాటించే విలువలకు... మాతృస్థానంలో శారదాదేవి వేసిన పునాదులు చాలా గొప్పవి.

దివ్య జ్ఞానమణి

క్రైస్తవ మతాచార్యుడితో వివాహం, సమాజంపై చర్చి జోక్యంపై తిరుగుబాటు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు, భారతీయ ఆధ్యాత్మిక మార్గంపై ఆసక్తి, భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో గణనీయమైన పాత్ర... ఇలా అనీబిసెంట్ జీవితంలో అడుగడుగునా వైరుధ్యాలే. ఏ బాధ్యతను చేపట్టినా దాన్ని అద్వితీయంగా నిర్వహించడం ఆమె ప్రత్యేకత. 1847 అక్టోబర్ ఒకటిన ఇంగ్లండ్‌లో ఆమె జన్మించారు. ఆమెది ఐరిష్ మూలాలున్న కుటుంబం. ఇరవయ్యేళ్ళ వయసులో ఒక క్రైస్తవ మతాచార్యుడితో పెళ్ళయింది. చర్చి వైఖరిని నిరసిస్తూ పోరాటాలు సాగించిన ఆమె భర్తనుంచి విడాకులు తీసుకున్నారు. 'నేషనల్ రిఫార్మర్' పత్రికలో చేరి... పలు సామాజిక అంశాలపై రచనలు చేశారు. అదే సమయంలో మహిళా కార్మికులు, రేవు కార్మికుల సంక్షేమం కోసం సమ్మెలు జరిపారు. 1875లో... లండన్‌లో ప్రారంభమైన 'దివ్యజ్ఞాన సమాజం' (థియోసాఫికల్ సొసైటీ) 1882 నుంచి మద్రాసు (ప్రస్తుతం చెన్నై) కేంద్రంగా తన కార్యకలాపాలను సాగించింది. వివిధ మతాల ప్రాచీన సంప్రదాయాలు ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ ఉద్యమం అనీబిసెంట్‌ను ఆకర్షించింది. సొసైటీ కార్యకలాపాల్లో భాగంగా 1893లో తొలిసారి భారతదేశానికి వచ్చిన ఆమె ఆ తరువాత ఇక్కడే స్థిరపడ్డారు. జ్ఞానసంపదకు నిలయమైన భారతదేశం పరాయి పాలన నుంచి విముక్తి కావాలనీ, అప్పుడే అది ప్రపంచానికి మార్గదర్శిగా నిలుస్తుందనీ ఆమె విశ్వసించారు. భారత స్వాతంత్ర్య సమరంలో, కాంగ్రెస్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. లోకమాన్య తిలక్‌తో కలిసి 'హోమ్ రూల్' ఉద్యమం ప్రారంభించి, బ్రిటిష్ వారి నిర్బంధానికి గురయ్యారు. ఆ తరువాత భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. అయితే మహాత్మా గాంధీ నేతృత్వంలో చేపడుతున్న ఉద్యమ రూపాలు ఆమెకు నచ్చలేదు. దాంతో క్రమంగా కాంగ్రెస్‌నుంచి వేరుపడ్డారు. తదనంతరం దివ్యజ్ఞాన సమాజం కార్యకలాపాలను విస్తరించారు. జిడ్డు కృష్ణమూర్తిలో తత్త్వవేత్తను లోకానికి పరిచయం చేసింది కూడా అనీబిసెంటే. భారతదేశాన్ని తన ఆధ్యాత్మిక ఉన్నతికి కేంద్రంగా ఎంచుకున్న ఆమె 1933లో చెన్నైలో మరణించారు. ఈ భూమి మీద జన్మించిన దివ్యమూర్తులలో ప్రముఖురాలుగా ఆమె పేరుపొందారు. మన దేశంలో ఆధునిక విద్యా వ్యాప్తి కోసం పలు సంస్థలు స్థాపించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి కాలేజీ వాటిలో ఒకటి. అలాగే ఆమె ఏర్పాటు చేసిన సెంట్రల్ హిందూ స్కూల్ అండ్ కాలేజీ ఆ తరువాత బెనారస్ హిందూ యూనివర్సిటీగా మారింది.

ది మదర్

భిన్నత్వంలో ఏకత్వాన్ని మానవాళి సాకారం చేసుకోవాలనే లక్ష్యంతో రూపుదిద్దుకున్న విశ్వనగరం ఆరోవిల్. దాని రూపకర్త... 'ది మదర్' మిర్రా అల్ఫాస్సా. 1878 ఫిబ్రవరి 21న ప్యారిస్‌లో జన్మించారు. సంపన్న యూదు కుటుంబంలో పుట్టిన ఆమె బాల్యం నుంచి బహుముఖ ప్రజ్ఞావంతురాలు. చిత్రలేఖనంలో, సంగీతంలో విశేష కృషి చేశారు. ఆధ్యాత్మిక బృందాలు నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. 1910లో భారతదేశం వచ్చిన ఆమె పుదుచ్చేరిలోని శ్రీ అరవిందుల గురించి విన్నారు. ఆ తరువాత 1914లో ఆయనను దర్శించుకున్నాక... తనకు దారి చూపించే గురువు ఆయనేననీ, తన ఆధ్యాత్మిక ప్రగతి భారతదేశంలోనే సాధ్యమనీ నిర్ణయించుకున్నారు. కానీ ప్రపంచ యుద్ధం కారణంగా ఆమె తిరిగి ప్యారిస్ వెళ్ళాల్సి వచ్చింది. చివరకు 1920లో భారత్‌కు తిరిగి వచ్చి... అరవిందాశ్రమంలో స్థిరపడ్డారు. ఆమె ప్రత్యేకతను గుర్తించిన శ్రీ అరవిందులు యోగ స్థాయిలో ఆమె తనతో సమానమని చెబుతూ 'ది మదర్'గా అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ ఆమెను అనుసరించాలని సూచించారు. క్రమంగా ఆశ్రమ కార్యనిర్వహణ బాధ్యత మిర్రా చేపట్టాల్సి వచ్చింది. అప్పటివరకూ అసంఘటితంగా సాగుతున్న ఆశ్రమ కార్యకలాపాలను ఆమె క్రమబద్ధం చేశారు. శ్రీ అరవిందులను అనుసరిస్తున్న అనుచరులను బృందాలుగా ఏర్పాటు చేశారు. వాటన్నిటినీ అరబిందో సొసైటీ పరిధిలోకి తెచ్చారు. ఆయన ఆశయాలను బోధించడం కోసం 1943లో ఒక పాఠశాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడది 'శ్రీ అరబిందో ఇంటర్నేషనల్ సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషన్'గా మారింది. అలాగే శ్రీ అరవిందులు ప్రతిపాదించిన సమగ్ర యోగ ప్రచారంలో మిర్రా కీలకపాత్ర పోషించారు. 1950లో శ్రీ అరవిందుల మరణం ఆమెను తీవ్రంగా కలచివేసింది. ఆ విచారం నుంచి కోలుకొని... ఆశ్రమాన్ని మరింత అంకితభావంతో ఆమె నడిపించారు. 1968లో తమిళనాడులో ఆరోవిల్ అంతర్జాతీయ టౌన్‌షిప్ ప్రాజెక్ట్‌కు ఆమె శ్రీకారం చుట్టారు. అన్ని దేశాల పురుషులు, మహిళలు శాంతియుతంగా - జాతులు, జాతీయతలు, రాజకీయాలకు అతీతంగా సామరస్యంతో జీవనం సాగించాలనేది దీని వెనుక ఆమె ఆశయం. ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యాక ఆశ్రమ నిర్వహణ బాధ్యతలు విడిచిపెట్టి, యోగ సాధనలో కాలం గడిపారు. 1973 నవంబర్ 17న కన్ను మూశారు. ఆరోవిల్‌లోని మాతృమందిరం ఆమె స్మృతి చిహ్నంగా ఆరాధనలు అందుకుంటోంది.

అన్నపూర్ణ

సిక్కు సంప్రదాయంలో లంగర్ (సామాజిక భోజనశాల)కు ఎనలేని ప్రాధాన్యం ఉంది. కులం, మతం, మతం లేదా సామాజిక హోదాతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు ఆహారాన్ని అందించే లంగర్‌లకు ఆద్యులుగా మాతా ఖీవీని, ఆమె భర్త గురు అంగద్‌ను పేర్కొంటారు. అంతేకాదు... సిక్కు మత గ్రంథమైన 'గురు గ్రంథ్ సాహెబ్‌జీ'లో ప్రస్తావన ఉన్న ఏకైక మహిళ కూడా ఆమే కావడం విశేషం. ఆమెను గొప్ప స్త్రీగా, అందరికీ ఓదార్పును, నీడను ఇచ్చే వృక్షంగా, అమృతంలాంటి ఆహారాన్ని పంచే మహిళగా అందులో ప్రశంసించారు. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న సంఘర్ ప్రాంతంలో 1506లో ఖీవీ జన్మించారు. ఆమె తండ్రి ఒక దుకాణాన్ని నడిపేవారు. లెహ్నా అనే వ్యక్తితో ఆమెకు వివాహం చేసి, తన దుకాణాన్ని ఆ దంపతులకు అప్పగించారు. కొన్నాళ్ళ తరువాత లెహ్నా, ఖీవీ తీర్థయాత్రలకు బయలుదేరారు. మార్గమధ్యంలో గురునానక్ బోధలను లెహ్నా విన్నాడు. తనను శిష్యునిగా చేర్చుకోవాలని నానక్‌ను వేడుకున్నాడు. హిందువైన అతను నానక్ ధర్మంలోకి మారాడు. అతనికి అంగద్ అని నానక్ కొత్త పేరు పెట్టారు. భర్తను అనుసరిస్తూ ఖీవీ కూడా నానక్ మార్గంలోకి అడుగుపెట్టింది. గురునానక్ మరణం తరువాత... రెండవ సిక్కు గురువుగా (గురు అంగద్ దేవ్‌జీగా) అంగద్ బాధ్యతలు స్వీకరించారు. గురువు భార్యగా కొత్త పాత్రలోకి ఖీవీ అడుగుపెట్టింది. తన ఇంటికి వచ్చిన అతిథులందరికీ ఎలాంటి పక్షపాతం లేకుండా... ఏ సమయంలోనైనా చక్కని ఆహారాన్ని వండిపెట్టేది. అలా తొలి లంగర్ మొదలయింది. సిక్కు మతాన్ని పిల్లలకు సైతం అందుబాటులో ఉంచాలని గురు అంగద్ నిర్ణయించారు. దానికోసం గురుముఖి అనే లిపిని ఎంచుకున్నారు. గురునానక్ జీవిత చరిత్రను రచించారు. వీటన్నిటివెనుకా ఖీవీ ప్రోత్సాహం ఎంతగానో ఉంది. ఆదర్శవంతమైన గృహిణిగా, మన్ననలందుకున్న ఆమె సిక్కు మత ప్రాచుర్యానికి తనదైన పాత్రను పోషించారు. గురు స్థానంలో ఉన్న తన భర్తను దర్శించడానికి వచ్చేవారి ఆకలి తీర్చడానికి ఆమె ప్రారంభించిన లంగర్ ఈనాటికీ కొనసాగుతూ... ఒక మంచి సంప్రదాయంగా మరింత విస్తరించింది.




సందేశం

శుభ మాసానికి ఆహ్వానం

సకల శుభాలను చేకూర్చే అత్యంత పవిత్రమైన మాసం రంజాన్. దైవ విశ్వాసులైన వారికి శ్రేయస్సును అందించడానికి, కారుణ్యాన్ని వర్షించడానికి త్వరలోనే ఈ మాసం ఆరంభమవుతోంది.

రజబ్, షాబాన్ మాసాల్లో నెలవంకను చూస్తూ "ఓ అల్లాహ్! మమ్మల్ని రంజాన్ మాసం వరకూ చేర్చు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ప్రార్థించేవారు. ఇస్లాం ధర్మశాస్త్రంలో రంజాన్‌కు... మరి ఏ నెలకూ లేని ప్రాధాన్యత ఉంది. ఈ మాసాన్ని ఘనంగా, హృదయపూర్వకంగా స్వాగతించడం కోసం... ముందు నెల అయిన షాబాన్ నుంచే సంసిద్ధులు కావాలని మహాప్రవక్త పిలుపునిచ్చేవారు. "ఒక శుభప్రదమైన మాసం రాబోతోంది. ఈ నెలలో ఉపవాసాలను అల్లాహ్ మీకు తప్పనిసరి విధిగా చేశాడు. ఈ మాసంలో స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయి. నరక ద్వారాలు మూసుకుంటాయి. సైతాన్లు సంకెళ్ళతో బందీలవుతారు. వెయ్యి నెలల కన్నా శ్రేష్ఠమైన రాత్రి... లైలతుల్ ఖద్ర్ (మహోన్నతమైన శుభరాత్రి) ఈ మాసంలోనే ఉంది. పూర్తి విశ్వాసంతో కూడిన ఉత్సాహంతో వరాల రంజాన్ మాసానికి స్వాగతం చెప్పేవారు గొప్ప అదృష్టవంతులు. ఆరాధనకు ఇది ఎంతో ముఖ్యమైన నెల. ఈ మాసంలో ఎవరైనా ఒక సత్కార్యాన్ని సంతోషంగా, అంతర్ ప్రేరణతో చేసినట్టయితే... ఆ సత్కార్యం ఇతర మాసాల్లో విధిగా చెయ్యవలసిన ఒక కార్యంతో సమానంగా పరిగణన పొందుతుంది. అలాగే ఎవరైనా విధిగా చెయ్యవలసిన కార్యాన్ని ఆచరిస్తే... అది ఇతర మాసాల్లో డెబ్బై విధులను ఆచరించడంతో సమానంగా పరిగణన పొందుతుంది" అని ఆయన పేర్కొన్నారు. రంజాన్ మాసంలో నెలవంకను చూడగానే "ఓ అల్లాహ్! ఈ చంద్రుణ్ణి మాకు శాంతిని, విశ్వాసాన్ని, శ్రేయస్సును కలిగించే నెలవంకగా ఉదయింపజెయ్యి. నీకు అభీష్టమైన, ప్రీతికరమైన పనులు చేసేలా మమ్మల్ని కటాక్షించు" అని ప్రార్థించాలని ఆయన చెప్పేవారు.

రంజాన్ మాసంలో అల్లాహ్ ప్రీతి కోసం అయిదు పనులను ముఖ్యంగా చెయ్యాలి. మొదటిది: కలిమా ఎ తయ్యిబహ్ (దేవుడొక్కడే. ఆయన ప్రవక్త మహమ్మద్ అని విశ్వసించడం). రెండోది: ఇస్తిగ్‌ఫార్ (క్షమాపణ కోరడం), మూడోది: అల్లాహ్‌ను ప్రార్థించి... స్వర్గ ప్రవేశాన్ని కోరడం. నాలుగోది: నరకం నుంచి కాపాడాలని వేడుకోవడం. అయిదోది: అంతిమ దివ్య గ్రంథమైన ఎక్కువసార్లు చదవడం. దానిలోని ధర్మాలను అమలు పరచడం. ఇతరులకు ఆ సందేశాన్ని చేరవెయ్యడం.



అనంత కరుణామయుడు, అపార కృపాశీలి అయిన అల్లాహ్ మానవులకు అందించిన పవిత్ర మాసంగా, సమస్త శుభాలకు నిలయంగా, సర్వ కారుణ్యాలకు ఆలవాలంగా, సహనాన్ని, దాతృత్వాన్ని పెంచే పుణ్యమాసంగా, పేద, గొప్ప తారతమ్యాలను తొలగించే మాసంగా, సర్వమానవ సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని, పరస్పర ప్రేమాభిమానాలను ద్విగుణీకృతం చేసే మాసంగా రంజాన్‌ను పవిత్ర గ్రంథాలు ప్రస్తుతించాయి. విశ్వాసులందరూ రంజాన్ మాసంలో రోజూ దివ్య ఖుర్ఆన్‌లో ఒక భాగం పారాయణ చెయ్యాలి. రాత్రివేళల్లో తరావీహ్, తహజ్జుద్ నమాజులు చెయ్యాలి. జకాత్, ఫిత్రా దానాలు, తాఖ్ రాత్రులు (బేసి రాత్రులు) ఏతేకాఫ్ (తపో నిష్ఠ), దుఆ (వేడికోలు) లాంటి ఆధ్యాత్మిక అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఫర్జ్, సున్నత్, నఫీల్ నమాజులు ఎక్కువగా చెయ్యాలి. సహరీ, ఇఫ్తార్‌లలో ఇతరులను భాగస్వాములుగా చేసుకోవాలి. ఇవన్నీ తప్పకుండా ఆచరించాలనే గట్టి సంకల్పంతో... పవిత్రమైన రంజాన్ మాసాన్ని హృదయపూర్వకంగా, సంతోషంగా స్వాగతించాలి.

• మహమ్మద్ వహీదుద్దీన్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yXh4yjMలో చదవండి.

సహజయోగ

మీ విలువ గ్రహించండి

సహజ యోగ ఆవిష్కరణ ద్వారా... భారతీయ యోగ విజ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయురాలు శ్రీమాతాజీ నిర్మలాదేవి. ప్రపంచాన్ని శాంతి మార్గంలోకి తీసుకువెళ్ళడానికి ఆమె అహర్నిశలు శ్రమించారు. ఎంతోమందికి సంపూర్ణమైన భౌతిక, మానసిక ఆరోగ్య సాధన కోసం ఉచితంగా సహజయోగాన్ని అందించారు. అలాగే మహిళాభ్యుదయం కోసం, మహిళా సాధికారత కోసం ఆమె ఎంతగానో తపనపడ్డారు. వాటికోసం అహర్నిశలూ కృషి చేశారు. ప్రపంచంలో, సమాజంలో, కుటుంబంలో మహిళల పాత్ర, వారి బాధ్యతల గురించి వివిధ సందర్భాల్లో ప్రసంగాలు చేశారు. చైనాలోని బీజింగ్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని, అద్వితీయమైన ప్రసంగం చేశారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా వాటిలో కొన్ని అంశాలను ప్రస్తావించుకుందాం:

"యావత్ ప్రపంచ చరిత్రలోనే ఉత్కృష్టమైన ప్రస్తుత కాలంలో... మహిళా సమస్యల గురించి ఇంత గొప్ప చైతన్యాన్ని నేను ఊహించలేదు. మానవ సమాజంలో మహిళల సముచిత పాత్రను, ప్రాధాన్యాన్ని మనం పూర్తిగా అర్థం చేసుకోలేకపోవడం వల్ల... ఎన్నో సంవత్సరాలుగా స్త్రీ జాతి సమస్తం అనేక బాధలకు గురయింది. మహిళల ద్వారా ఉద్భవించిన సమాజమే మహిళలను అణచివేస్తోంది. వారిపై ఆధిపత్యానికి ప్రయత్నిస్తోంది. ప్రతి దేశానికి లేదా ప్రతి నాగరికతకు అంతర్గత శక్తి మహిళలేననేది వాస్తవం. సమస్త మానవజాతి నిర్మాతలు, సంరక్షకులు స్త్రీలు అనేది నిర్వివాదాంశం. సర్వరక్షకుడైన భగవంతుడు వారికి ఇచ్చిన పాత్ర ఇది. విస్తనాలు వాటంతట అవే దేన్నీ సృష్టించలేవు. ఎంతో ఒత్తిడిని భరిస్తూ మొత్తం లోకం అంతటికీ ఫలపుష్పాలను భూమాత అందిస్తుంది. మహిళ కూడా భూమాత లాంటిదే. శిశువుకు జన్మనిచ్చి, పెంచి, పోషించి, రేపటి పౌరుడిగా తీర్చిదిద్దుతుంది. మహిళలు తమ శక్తిని తాము గుర్తిస్తే... ఈ ప్రపంచాన్ని అత్యంత సుందరంగా మార్చగలరు. ఒక శక్తిమంతుడైన పురుషుణ్ణి చూసినప్పుడు... అతని వెనుక ఒక స్త్రీ ఉందని మనం గుర్తించవచ్చు. ఆమె కావాలనుకుంటే పురుషులకన్నా ఎక్కువ పని చెయ్యగలదు. అయితే మొదట నమ్రతతో, అణకువతో, హుందాతనంతో, చక్కటి అవగాహనతో, వాత్సల్యపూరితంగా ఉండి... తనలోని శక్తులను గౌరవించుకుంటూ శాంతిని నెలకొల్పడం, కవచంలా రక్షణ కల్పించడం మహిళల బాధ్యత.

ప్రస్తుతం మన సమాజాన్ని లంచగొండితనం, హింస అనే భూతాలు పీడిస్తున్నాయి. ఈ జాడ్యాలు తలెత్తకుండా... బాల్యంలోనే పిల్లల నడవడికను సరిదిద్ది, పిల్లలను సన్మార్గంలో పెట్టడం తమ బాధ్యత అని మహిళలు గుర్తుంచుకోవాలి. ప్రస్తుత కాలంలో కొందరు మహిళలను విలువలను, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని పోగొట్టుకుంటున్నారు. పోటీతత్వం, ధనాశ, విజయం సాధించడం మీదే ధ్యాస లాంటి నిరర్థకమైన విషయాల్లో ఆసక్తి పెరిగింది. ఆధ్యాత్మిక ఎదుగుదల మీద శ్రద్ధ లోపిస్తోంది. మహిళకు ఎక్కడ గౌరవం లభిస్తుందో అక్కడ దేవతలుంటారన్నారు పూర్వులు. అయితే అలా గౌరవం పొందే స్థాయిలో మహిళలు ఉండాలి. తాళాలు మీ చేతుల్లోనే ఉన్నాయి. మీ విలువను మీరు అర్థం చేసుకొని, మిమ్మల్ని మీరు లోకువ చేసుకోకుండా, చౌకబారు పేరు ప్రతిష్ఠలకు పాకులాడకుండా... నిబద్ధతతో ఉంటే, సునాయాసంగా సమస్యలను పరిష్కరించగలరు. మొత్తం ప్రపంచాన్ని మీ స్వాధీనంలోకి తెచ్చుకోగలరు. అప్పుడు సమస్త మానవాళికీ సంపూర్ణ రక్షణ కలుగుతుంది. మరి ఆ సమతుల్యమైన స్థితిని ఎలా సాధించాలి? రోగాలు, అవినీతి, లంచగొండితనం, నైతిక పతనం, అజ్ఞానం అనే ఈ కెరటాలకు మనం ఏ విధంగా అడ్డుకట్ట వేయగలం? ప్రస్తుత సంఘర్షణను, గందరగోళ పరిస్థితిని ఏ విధంగా అంతం చెయ్యగలం? ప్రతివారి హృదయంలో, మనస్సులో శాంతిని ఏ విధంగా స్థాపించగలం? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానమైన మార్గం సహజయోగ. మనలోని కుండలినీ శక్తిని జాగృతం చేసుకొని, సర్వవ్యాపక శక్తి అయిన పరమాత్ముని ప్రేమ శక్తితో మనల్ని అనుసంధానించుకోవాలి. అప్పుడు ఆ దివ్యశక్తి మీలో ప్రవహించి, మిమ్మల్ని ఉత్సాహవంతుల్ని చేస్తుంది. మీరు అత్యంత శక్తిమంతులుగా, శాంతిస్వరూపులుగా మారుతారు. మీ వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసిస్తుంది" అని శ్రీ మాతాజీ వెల్లడించారు.



తాను చెప్పిన వాటిని ఆమె స్వయంగా పాటించి, నిరూపించి... సహజయోగ మహిళలకు ఆదర్శంగా నిలిచారు. నిస్సహాయులైన మహిళలు, బాలికల సంరక్షణే ధ్యేయంగా ఢిల్లీలో విశ్వ నిర్మల ప్రేమ ఆశ్రమాన్ని ప్రారంభించారు. రేపటి సమాజంలో ఎదురయ్యే సవాళ్ళను స్వతంత్రంగా ఎదుర్కొని... ఆనందమయమైన, గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేలా మహిళలు తయారు కావాలన్నదే శ్రీమాతాజీ ఆశయం.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్, తెలంగాణ

పర్వదినం

శివతత్త్వం అంటే...

దైవానికి ఒక ఆకారం లేదు. ఒక పరిమితి లేదు. దైవం అనంతవ్యాప్తం. అయినప్పటికీ దైవాన్ని గుర్తించడానికి ఏదో ఒక గుర్తు అవసరం. అందుకోసమే శిలా మూర్తులను, విగ్రహాలను తయారు చేశారు. అయితే విగ్రహాలు దైవం కాదు. అవి మనకు దైవం వైపు దారి చూపుతాయి. శివుణ్ణి లింగ రూపంలో కొలుస్తారు. స్థూల ప్రపంచంలో చిక్కుకొని... సూక్ష్మమైన దివ్యత్వాన్ని గ్రహించలేని వారికోసం పెద్ద పెద్ద విగ్రహాల రూపకల్పన జరిగింది. యోగులు స్థూల ప్రపంచం నుంచి సూక్ష్మమైన దానివైపు ప్రయాణిస్తూ ఉంటారు. వారు తమ మనస్సును సూక్ష్మమైన వాటి



మీద లగ్నం చెయ్యాలి. కాబట్టి పెద్ద పెద్ద విగ్రహాలు వారికి అవసరం లేదు. ద్వాదశ జ్యోతిర్లింగాలను చూస్తే... అవన్నీ చాలా చిన్నవిగానే కనిపిస్తాయి. దేవాలయాల్లో స్థాపించే దేవతా మూర్తి... మనుషుల ఆకారం కన్నా చిన్నదిగానే ఉండాలని ఆగమశాస్త్రం చెబుతుంది. ప్రాచీన దేవాలయాల్లోని కొన్నిటిలో, చాలా కొద్ది దేవాలయాల్లో మాత్రమే అటువంటి పెద్ద విగ్రహాలు మనకు కనిపిస్తాయి. వీటిలో చాలావరకూ రాజులు స్థాపించినవే. రాచరికం అంటే పెద్ద అహంకారం. ఎక్కువ అహంకారం ఉన్నవారు దాన్ని పోగొట్టుకొని... చిన్నగా కావాలనుకుంటారు. కాబట్టి తమ కన్నా పెద్దదైన విగ్రహాన్ని చూసినప్పుడే వాళ్ళు తమను తాము చిన్నగా భావించుకోగలరు.

వాస్తవానికి శివలింగానికి ముఖాలు ఉండవు. కానీ వాటికి కూడా ముఖాల్ని పెట్టేస్తున్నాం. శివుణ్ణి ఒక రూపంగా ఆరాధించడాన్ని శాస్త్రాలు నిషేధించాయి. కేవలం నటరాజ స్వరూపం మాత్రమే... అది కూడా కొన్ని ప్రదేశాల్లో మాత్రమే ఆరాధనీయం. శివలింగాన్ని బ్రహ్మ, విష్ణు, మహేశ్వర అనే మూడు విభాగాలుగా స్థాపిస్తారు. ఒక భాగం మాత్రమే కళ్ళకు కనిపిస్తుంది. శివతత్త్వం అంటే కంటికి కనిపించేది మాత్రమే కాదనీ, మనకు కనిపించేదానికన్నా (తెలిసినదాని కన్నా) రెండు రెట్లు ఎక్కువ ఉన్నదనీ దీని అర్థం. కాబట్టి కన్నులు మూసుకొని... నీలో ఉన్న శివతత్త్వాన్ని దర్శించమని సూచన. ధ్యానంలోకి వెళ్ళండి. శివుణ్ణి తెలుసుకోండి. స్థూలం నుంచి సూక్ష్మానికి ప్రయాణించండి. ఈ ప్రయాణంలో సాలగ్రామం కన్నా మంత్రాలు ఉత్తమం. మంత్రాలకన్నా మౌనం అత్యుత్తమం.

• శ్రీశ్రీరవిశంకర్

నేడు మహాశివరాత్రి

అఖండ చైతన్యమే శివం

మాఘ కృష్ణ చతుర్దశ్యా మాదిదేవో మహానిశి
శివలింగ తయోద్భూతః కోటి సూర్య సమప్రభః

కోటి సూర్యుల వెలుగుతో సమానమైన ప్రకాశంతో... మాఘ శుక్ల చతుర్దశి నాడు అర్ధరాత్రి వేళ... బ్రహ్మ, విష్ణువుల మధ్య అగ్నిర్జ్యోతిర్లింగం ప్రభవించిన రోజు... మహా శివరాత్రి. పరాశక్తి సృష్టించిన బ్రహ్మ, విష్ణు, రుద్రుల సమన్వయ స్వరూపం పరమశివుడు. ఆయన లింగరూపంలో సాక్షాత్కరించాడు. సమస్త జగత్తు ఆయనలో నిబిడీకృతమై ఉంది. నిరాకార, నిరంజన, నిరామయమైన శివతత్త్వమే ఆ లింగరూపం. శివుణ్ణి ఆ రూపంలోనే కాదు, మూర్తి రూపంలోనూ... అంటే



చంద్రశేఖర, అర్ధనారీశ్వరాది రూపాల్లోనూ ఆరాధిస్తున్నాం. అయితే బ్రహ్మరుద్రాదులు కూడా అర్చించినది లింగాకృతినేనని 'లింగాష్టకం'లోని తొలి శ్లోకం స్పష్టం చేస్తుంది. శివలింగం పానవట్టంతో ఆవృతమై ఉంటుంది. అది శివలింగానికి పీఠం. పానవట్టం శక్తికి ప్రతీక. అంటే ఇది అర్ధనారీశ్వర తత్త్వానికి సంకేతం. శివుడు జ్యోతిస్వరూపుడు. ఆ జ్యోతి ప్రసరించే కిరణాలు శక్తికి చిహ్నాలు. ఈ రెండూ అభిన్నం... అంటే విడదీయలేనివి. ఈ తత్త్వాన్ని ఆదిశంకరులు 'శివశక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుమ్' అంటూ విశ్లేషించారు. పీఠంలోని శక్తినీ, లింగాకృతిలోని ఈశ్వర శక్తినీ సమ్మిశ్రితం చేస్తూ ఆరాధించడమే... శివలింగార్చనలోని అంతర్యం.

పంచభూత లింగాలలో ఒకటైన (అరుణాచలంలోని) అగ్నిలింగం అనే మాటకు 'అగ్రమునందు ఉన్నవాడు' అని అర్థం. సృష్టికి పూర్వమే ఉన్నవాడనేది విశ్లేషణ. అతడు కాలాగ్ని రుద్రస్వరూపం. కాలం అపరిచ్ఛిన్నం... అంటే 'ఇంత' అనే పరిమితి లేనిది. అనంతమైనది. మన అవగాహనకోసం దాన్ని భూత, భవిష్యత్, వర్తమానాలుగా విభజించుకున్నాం. ఆద్యంతాలు లేని అఖండ చైతన్య స్వరూపమే శివం... మహాకాల స్వరూపమైన శివతత్త్వం. శ్మశానవాసి అయిన శివుడు ఒళ్ళంతా భస్మం ధరిస్తాడు. అది బూడిద కాదు, విభూది. అంటే ఐశ్వర్యం. భోళాశంకరుణ్ణి భక్తితో అర్చిస్తే... విభూదిని అందిస్తాడు. శివరాత్రి పర్వదినాన శివుణ్ణి అభిషేకించి, పంచాక్షరీ మంత్రం జపిస్తూ, జాగరణ చేసి, లింగోద్భవ సమయంలో శివ దర్శనం చేస్తే... ఆయన తన అనుగ్రహాన్ని కురిపిస్తాడు.

• అయపిళ్ళ రాజపాప



నాకు నేనే కొత్తగా అనిపించా


సుహాస్

సుహాస్ హీరోగా రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్నవదనం'. పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కథానాయికలు. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు అర్జున్ వై.కె. దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కె.ఎస్.మణికంఠ, టి.ఆర్.ప్రసాద్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం జరిగిన టీజర్ రిలీజ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు సాయిరాజేశ్ మాట్లాడుతూ 'సుహాస్‌కి చాలా కీలకమైన సినిమా ఇది. కథలోని పాయింట్ అదిరిపోయింది. టీజర్ చాలా బాగుంది. తప్పకుండా హిట్ అవుతుంది' అన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'ఫేస్ బ్లైండ్ నెస్ మీద తీస్తున్న మంచి థ్రిల్లర్ ఇది. బాగా వచ్చింది. ఇందులో నాకు నేనే కొత్తగా అనిపించాను. నిర్మాతలు మణికంఠ, ప్రసాద్ ఎంతో కష్టపడ్డారు. ఇది పక్కాగా బ్లాక్‌బస్టర్ అయ్యే సినిమా. అందులో డౌట్ లేదు' అన్నారు. ఈ కథకు సుహాస్ యాప్ట్ అని దర్శకుడు అర్జున్ తెలిపారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. హీరోయిన్లు పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాధికకు విశిష్ట మహిళా పురస్కారం



సీనియర్ నటి రాధికకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 2024 విశిష్ట మహిళ పురస్కారాన్ని ప్రదానం చేయనుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాధికను సన్మానించి పురస్కారం ప్రదానం చేస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ గురువారం తెలిపారు. మంచి నటిగానే కాకుండా నిర్మాతగా కూడా పేరు తెచ్చుకున్న రాధిక తెలుగు, తమిళ చిత్రాలతో పాటు బుల్లి తెరపై కూడా రాణిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, పెదకాకాని

అన్ని రకాల ఎమోషన్స్‌తో...



యూత్‌ఫుల్ చిత్రాల నిర్మాత బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జంతో కలసి రూపొందిస్తున్న చిత్రం 'రోటీ కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘ లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లు. విక్రమ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. తాజాగా, ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను ఖరారు చేస్తూ బుధవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ "కథను నమ్మి ఎమోషనల్‌గా ఫీల్ అయి చేసిన సినిమా ఇది. ఏప్రిల్ 12న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం" అని అన్నారు. దర్శకుడు విక్రమ్ మాట్లాడుతూ "దర్శకుడిని కావాలన్న నా 15 ఏళ్ల కల ఈ చిత్రంతో తీరుతోంది. ఇది అందరూ అనుకున్నట్లు కేవలం ఎంటర్టైనర్ మాత్రమే కాదు.. అన్ని రకాల ఎమోషన్స్ ఇందులో ఉన్నాయి" అని అన్నారు.















క్వార్టర్స్‌లో సింధు

● గాయత్రి జోడీ కూడా
● శ్రీకాంత్ అవుట్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో ఏస్ షట్లర్ పీవీ సింధు, గాయత్రి జోడీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లగా.. కిడాంబి శ్రీకాంత్ ఓటమితో ఇంటిముఖం పట్టాడు. మహిళల సింగిల్స్‌లో గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో సింధు 13-21, 21-10, 21-14తో వరల్డ్ నెం:10 బీవెన్ జాంగ్ (అమెరికా) గెలిచింది. తొలి గేమ్‌లో తడబడినా.. ఆ తర్వాత సింధు బలంగా పుంజుకొంది. కాగా, పురుషుల రెండో రౌండ్‌లో శ్రీకాంత్ 21-19, 12-21, 20-22తో లు గువాంగ్ జు (చైనా) చేతిలో ఓడాడు. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి జంట 21-18, 21-13తో జపాన్ ద్వయం యుకీ ఫుకుషిమా-సయాక హిరోటాపై వరుస గేముల్లో గెలిచింది.



రిత్విక్‌కు రజతం

నాసిక్: జాతీయ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ రజతం సాధించాడు. గురువారంతో ముగిసిన పోటీల్లో రిత్విక్ మొత్తం 11 రౌండ్ల నుంచి 9 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకొన్నాడు. బెంగాల్‌కు చెందిన జీఎం దీప్తయన్ ఘోష్ 9.5 పాయింట్లతో విజేతగా నిలిచాడు. ర్యాపిడ్ విభాగంలో రిత్విక్ కాంస్యం గెలిచిన సంగతి తెలిసిందే.



సన్‌రైజర్స్ కొత్త జెర్సీ

న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ కొత్త జెర్సీని గురువారం విడుదల చేసింది. గత జెర్సీ తరహాలో కాషాయ రంగులోనే ఉన్నా.. పైన నలుపు రంగులో డిజైన్ వేశారు. ఈ జెర్సీకి 'రగిలే జ్వాల' అని పేరు పెట్టారు. భువనేశ్వర్ కుమార్ ధరించిన ఈ కొత్త జెర్సీ ఫొటోను ఫ్రాంచైజీ పోస్టు చేసింది. ఈ జెర్సీ అచ్చం సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచిన సన్‌రైజర్స్ ఈస్ట్రన్ కేప్ (ఎస్‌ఈసీ) జెర్సీని పోలినట్టుగా ఉంది.



అంపైరింగ్‌కు ఎరాస్మస్ గుడ్‌బై

దుబాయ్: దక్షిణాఫ్రికాకు చెందిన అంపైర్ మరైస్ ఎరాస్మస్ (60) అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నాడు. క్రైస్ట్‌చర్చ్‌లో శుక్రవారం నుంచి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మధ్య జరిగే రెండో, ఆఖరి టెస్ట్ అతడికి చివరి మ్యాచ్. నాలుగు వన్డే వరల్డ్‌కప్‌లు, ఏడు టీ20 ప్రపంచకప్‌లు, మూడు మహిళల టీ20 విశ్వకప్‌లతోపాటు 2013, 2017 చాంపియన్స్‌ట్రోఫీల్లో అంపైర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. 2006లో కెరీర్ ఆరంభించిన ఎరాస్మస్ 81 టెస్టులు, 124 వన్డేలు, 43 టీ20లు, 18 మహిళల టీ20లకు అంపైరింగ్ చేశాడు. 131 మ్యాచ్‌లకు టీవీ రెఫరీగా వ్యవహరించాడు. 2010లో ఐసీసీ ఎలిట్ ప్యానల్ అంపైర్‌గా నియమితుడయ్యాడు.

కుల్దీప్ కమాల్

ఐదు వికెట్లతో రాణింపు ● అశ్విన్‌కు నాలుగు



ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 218

భారత్ తొలి ఇన్నింగ్స్ 135/1

జైస్వాల్, రోహిత్ అర్ధసెంచరీలు

ధర్మశాల: నామమాత్ర పోరే అయినా భారత జట్టు మొదటి రోజే అటు బంతితో.. ఇటు బ్యాట్‌తో ఇంగ్లండ్‌పై విరుచుకుపడింది. చల్లని వాతావరణంతో పాటు వికెట్‌పై తేమ కారణంగా మొదట పేసర్లకు పండగే అనుకున్నారు. అటు బ్యాటింగ్‌కు కూడా ఇబ్బందేమీ లేదని భావించారు. కానీ ధర్మశాలలో భారత స్పిన్నర్లు అంతా తారుమారు చేశారు. ముఖ్యంగా కుల్దీప్ యాదవ్ (5/72) సుడులు తిరిగే బంతులకు స్టోక్స్ సేన దాసోహమైంది. వారి టాప్-6 బ్యాటర్లలో ఐదుగురిని తనే పెవిలియన్‌కు చేర్చడంతో పర్యాటక జట్టు వెన్నువిరిగింది. అటు వందో టెస్టు ఆడుతున్న అశ్విన్ (4/51) టెయిలెండర్ల పనిబట్టడంతో తొలి రోజు గురువారం 57.4 ఓవర్లలో ఇంగ్లండ్ 218 పరుగుల వద్ద మొదటి ఇన్నింగ్స్‌ను ముగించింది. ఓపెనర్ జాక్ క్రాలే (79) మాత్రమే దీటుగా నిలబడినా, సహచరులంతా విఫలమయ్యారు. జడేజా పొదుపైన బౌలింగ్‌తో ఓ వికెట్ తీయడంతో ప్రత్యర్థి మొత్తం స్పిన్‌కే కుప్పకూలినట్టయ్యింది. ఆ తర్వాత భారత్ రోజు ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 30 ఓవర్లలో వికెట్ నష్టానికి 135 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వీ (58 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 57) వన్డే తరహా ఆటతీరును ప్రదర్శించగా, క్రీజులో రోహిత్ (52 బ్యాటింగ్), గిల్ (26 బ్యాటింగ్) ఉన్నారు.

తొలి సెషన్‌లో జాగ్రత్తగా..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌తో భారీ స్కోరు సాధించి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాలని ఆలోచించింది. కానీ పేసర్లు బుమ్రా, సిరాజ్ తొలి సెషన్ ఆరంభంలో చక్కటి సీమ్ బౌలింగ్‌తో కట్టడి చేశారు. అయితే ఈ జోడీ వికెట్లు మాత్రం తీయలేకపోయింది. పేసర్లతో 14 ఓవర్లు వేయించాక కెప్టెన్ రోహిత్ స్పిన్నర్లను దించాడు. కుల్దీప్ తన తొలి ఓవర్‌లోనే డకెట్ (27) వికెట్ తీసి 64 పరుగుల భాగస్వామ్యానికి తెర దించాడు. ఎక్స్‌ట్రా కవర్ వైపు గాల్లోకి లేచిన బంతిని గిల్ కవర్స్ నుంచి పరిగెత్తుకెళ్లి డైవింగ్ క్యాచ్‌తో అందుకున్న తీరు వహ్వా.. అనిపించింది. అటు క్రీజులో పాతుకుపోయిన క్రాలే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఐదో ఓవర్‌లో పోప్ (11) స్టంపౌట్ కావడంతో జట్టు లంచ్‌కు వెళ్లింది. అప్పటికి 100/2 స్కోరుతో ఇంగ్లండ్ పటిష్ఠంగానే కనిపించింది.

కుల్దీప్ మాయ: రెండో సెషన్‌లో ఇంగ్లండ్ మరింత తడబడి ఆరు వికెట్లు కోల్పోగా.. స్పిన్నర్ కుల్దీప్ ఇందులో ముగ్గురిని పెవిలియన్‌కు చేర్చాడు. టాపార్డర్‌నే కాకుండా మిడిలార్డర్‌ను కూడా తను కుదురుకోనీయలేదు. దీంతో 137/2 నుంచి ఒక్కసారిగా స్కోరు 183/8కి పడిపోయింది. సెషన్‌లో తొలి గంట తర్వాత కీలక క్రాలేను కుల్దీప్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత తన వరుస ఓవర్లలో బెయిర్‌స్టో (29), కెప్టెన్ స్టోక్స్ (0)లను సైతం అవుట్ చేశాడు. మధ్యలో రూట్ (26)ను జడేజా అవుట్ చేయడంతో 175 రన్స్ వద్దే జట్టు ఈ మూడు వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఇక అశ్విన్ ఒకే ఓవర్‌లో హార్ట్లీ (6), ఉడ్ (0) వికెట్లు తీయడంతో 194/8తో ఆఖరి సెషన్‌కు వెళ్లింది. ఆ తర్వాత మూడు ఓవర్లలోపే వీరి ఇన్నింగ్స్ ముగిసింది. ఫోక్స్ (24), అండర్సన్ (0)ల వికెట్లను అశ్విన్ ఒకే ఓవర్లో తీశాడు.

శతక భాగస్వామ్యం : ఇంగ్లండ్ బ్యాటర్లు బెదిరిన ట్రాక్‌పై భారత ఓపెనర్లు అదరగొట్టారు. సాధికారిక బ్యాటింగ్‌తో తొలి వికెట్‌కు 104 రన్స్ అందించారు. ఉడ్ ఓవర్‌లో రోహిత్ 6,4 బాదగా జైస్వాల్ అయితే చెలరేగాడు. స్పిన్నర్ బషీర్ తొలి ఓవర్‌లోనే మూడు సిక్సర్లతో 18 రన్స్ అందించాడు. ఇక తననే లక్ష్యంగా చేసుకుని వరుస ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అయితే 21వ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో 50 పరుగులు పూర్తి చేసినా మరో భారీ షాట్‌కు ముందుకెళ్లడంతో స్టంపయ్యాడు. ఆ తర్వాత రోహిత్ సైతం ఫిఫ్టీ పూర్తి చేయగా.. గిల్ నిలకడగా ఆడి రోజును ముగించారు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (బి) కుల్దీప్ 79; డకెట్ (సి) గిల్ (బి) కుల్దీప్ 27; పోప్ (స్టంప్) జురెల్ (బి) కుల్దీప్ 11; రూట్ (ఎల్బీ) జడేజా 26; బెయిర్‌స్టో (సి) జురెల్ (బి) కుల్దీప్ 29; స్టోక్స్ (ఎల్బీ) కుల్దీప్ 0; ఫోక్స్ (బి) అశ్విన్ 24; హార్ట్లీ (సి) దేవ్‌దత్ (బి) అశ్విన్ 6; ఉడ్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; బషీర్ (నాటౌట్) 11; అండర్సన్ (సి) దేవ్‌దత్ (బి) అశ్విన్ 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 57.4 ఓవర్లలో 218 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-64, 2-100, 3-137, 4-175, 5-175, 6-175, 7-183, 8-183, 9-218, 10-218; **బౌలింగ్:** బుమ్రా 13-2-51-0; సిరాజ్ 8-1-24-0; అశ్విన్ 11.4-1-51-4; కుల్దీప్ 15-1-72-5; జడేజా 10-2-17-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్) ఫోక్స్ (బి) బషీర్ 57; రోహిత్ (బ్యాటింగ్) 52; గిల్ (బ్యాటింగ్) 26; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 30 ఓవర్లలో 135/1. వికెట్ల పతనం:** 1-104; **బౌలింగ్:** అండర్సన్ 4-1-4-0; ఉడ్ 3-0-21-0; హార్ట్లీ 12-0-46-0; బషీర్ 11-2-64-1.



ఈ బంతి నీదే.. కాదు నీదే

తొలి రోజు ఆట ముగిశాక కుల్దీప్, అశ్విన్ మధ్య జరిగిన సరదా సంఘటన ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. సహజంగా టెస్టుల్లో ఐదు వికెట్లు తీసిన బౌలర్ మ్యాచ్ తర్వాత అంపైర్ దగ్గర నుంచి బంతి తీసుకుంటాడు. అలాగే గురువారం కుల్దీప్ ఈ ఫీట్ సాధించాక బంతిని తీసుకున్నా.. కెరీర్‌లో వందో టెస్టు ఆడుతున్న అశ్విన్‌ను ముందు నడిపిద్దామని బంతిని అతడి వైపు విసిరాడు. కానీ అశ్విన్ మాత్రం వెంటనే తిరిగి బంతిని అతడి వైపే వేశాడు. అటు కుల్దీప్ మాత్రం వద్దు.. నీకే అన్నట్టుగా మళ్లీ వేయగా, మధ్యలో సిరాజ్ అందుకుని అశ్విన్‌కు అందించాడు. అయినా అశ్విన్ మాత్రం ససేమిరా అన్నట్టుగా కుల్దీప్‌నకే ఇవ్వడంతో తను బంతిని చూపిస్తూ అందరి కంటే ముందు నడిచాడు.



1

ఇంగ్లండ్‌పై టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు (712) సాధించిన భారత బ్యాటర్‌గా జైస్వాల్. అలాగే ఒకే జట్టు (ఇంగ్లండ్)పై ఎక్కువ సిక్సర్లు (26) బాదిన భారత బ్యాటర్‌గానూ నిలిచాడు. ఈ క్రమంలో సచిన్ (ఆసీస్‌పై 25)ను అధిగమించాడు.

తక్కువ బంతుల్లోనే (1871) 50 వికెట్లు పూర్తి చేసిన భారత బౌలర్‌గా కుల్దీప్. అక్షర్ (2205)ను అధిగమించాడు. గత 100 సంవత్సరాలలో వరల్డ్ క్రికెట్‌లో ఇన్ని తక్కువ బంతుల్లో ఏ స్పిన్నరూ 50 వికెట్ల మైలురాయి చేరలేదు.



2

టెస్టుల్లో తక్కువ ఇన్నింగ్స్ (16)లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన రెండో భారత బ్యాటర్‌గా జైస్వాల్. వినోద్ కాంబ్లీ (14) టాప్‌లో ఉన్నాడు. అంతేకాకుండా ఒకే టెస్టు సిరీస్‌లో భారత్ తరఫున ఎక్కువ పరుగులు (712) సాధించిన రెండో బ్యాటర్. గవాస్కర్ (విండీస్‌పై 774, 732) ముందున్నాడు.

ముంబై.. దెబ్బకు దెబ్బ

● మెరిసిన బ్రంట్, ఇషాక్
● 42 పరుగులతో యూపీ చిత్తు

దీప్తి అర్ధ శతకం వృథా



నేటి మ్యాచ్
ఢిల్లీ x యూపీ
రాత్రి 7.30 గం. నుంచి

న్యూఢిల్లీ: స్పిన్నర్ సైకా ఇషాక్ (3/27)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సివర్ బ్రంట్ (45, 2/14) ఆల్‌రౌండ్ ప్రదర్శన తోడుకావడంతో.. డబ్ల్యూపీఎల్‌లో డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్ నాలుగో విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 42 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. బెంగళూరులో ఎదురైన పరాజయానికి గట్టిగా బదులు తీర్చుకొంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 160 పరుగులు చేసింది. ఓపెనర్లు హేలీ మాథ్యూస్ (4), యాస్తిక భాటియా (9)ను అవుట్ చేసిన చమరి అటపట్టు (2/27) ఆదిలోనే దెబ్బతీసింది. కానీ, బ్రంట్, కెప్టెన్ హర్మన్ (33) మూడో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. బ్రంట్‌ను రాజేశ్వరి బౌల్డ్ చేయగా.. హర్మన్‌ను సైమా పెవిలియన్ చేర్చింది. డెత్ ఓవర్లలో అమెలియా కెర్ (39), సజన (22 నాటౌట్) దూకుడుగా ఆడడంతో.. ముంబై స్కోరు 160 మార్క్‌ను అందుకొంది. అనంతరం ఛేదనలో యూపీ ఓవర్లన్నీ ఆడి 118/9 స్కోరు మాత్రమే చేసింది. ముంబై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. దీప్తి శర్మ (53 నాటౌట్) మినహా మిగతా బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేక పోయారు. 15 పరుగులకే టాపార్డర్ బ్యాటర్లు కిరణ్ నవ్‌గిరె (7), అటపట్టు (3), కెప్టెన్ అలిస్సా హీలీ (3) వికెట్లు చేజార్చుకొన్న యూపీ ఏ దశలోనూ మ్యాచ్‌లోకి రాలేక పోయింది.

సంక్షిప్త స్కోర్లు
ముంబై: 20 ఓవర్లలో 160/6 (సివర్ బ్రంట్ 45, కెర్ 39, హర్మన్ 33; అటపట్టు 2/27).
యూపీ: 20 ఓవర్లలో 118/9 (దీప్తి 53 నాటౌట్; ఇషాక్ 3/27, బ్రంట్ 2/14).

బిజినెస్

JM FINANCIAL


జేఎం ఫైనాన్షియల్‌పై సెబీ ఆంక్షలు

డెట్ సెక్యూరిటీ ఇష్యూలకు లీడ్ మేనేజర్‌గా వ్యవహరించకుండా సంస్థపై నిషేధం

న్యూఢిల్లీ: ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ జేఎం ఫైనాన్షియల్ లిమిటెడ్‌పై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆంక్షలు విధించింది. నియంత్రణ నియమావళిని ఉల్లంఘించినందుకు గాను కొత్తగా డెట్ సెక్యూరిటీ ఇష్యూలకు లీడ్ మేనేజర్‌గా వ్యవహరించకుండా సంస్థపై నిషేధం విధించింది. అయితే, ఇప్పటికే సంస్థ చేపట్టిన ఇష్యూలకు మాత్రం 60 రోజుల పాటు లీడ్ మేనేజర్‌గా వ్యవహరించేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు గురువారం విడుదల చేసిన మధ్యంతర ఉత్తర్వుల్లో సెబీ పేర్కొంది. ఈ వారంలో జేఎం ఫైనాన్షియల్ గ్రూప్ కంపెనీలపై నియంత్రణ మండళ్ల వేటు వేయడం ఇది రెండోసారి. ఐపీఓలకు రుణాల మంజూరు సహా షేర్లు, డిబెంచర్లపై ఎలాంటి ఫైనాన్సింగ్ అందించకుండా జేఎం ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌పై ఆర్‌బీఐ మంగళవారం నిషేధం విధించింది. గత ఏడాదిలో నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) ఇష్యూలపై జరిపిన తనిఖీల ఆధారంగా సెబీ తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ తనిఖీల్లో భాగంగా జేఎం ఫైనాన్షియల్ గ్రూప్ సంస్థల ఆధ్వ ర్యంలో జరిగిన డెట్ ఇష్యూలపై నియంత్రణ మండలి దృష్టి సారించింది. ఈ గ్రూప్ సంస్థలు డెట్ ఇష్యూలను నిర్వహించిన తీరు షాక్‌కు గురిచేసిందని సెబీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ వ్యవహారంపై దర్యాప్తును ఆరు నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపింది.

స్వల్ప లాభాలతో.. సరికొత్త గరిష్ఠాలకు

మార్కెట్ సూచీలు మరింత ముందుకు..



ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, చివరికి స్వల్ప లాభాలతో సరికొత్త జీవిత కాల గరిష్ఠాలకు చేరుకోగలిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 159.18 పాయింట్లు పెరిగి 74,245.17 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ ముగిసే సరికి, 33.40 పాయింట్ల లాభంతో 74,119.39 వద్ద స్థిరపడింది. సూచికిది సరికొత్త గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 51.6 పాయింట్లు పెరిగి 22,525.65 వద్ద ఇంట్రాడే రికార్డును, చివర్లో 19.50 పాయింట్ల లాభంతో 22,493.55 వద్ద ఆల్‌టైం గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడుల దన్నుతో మెటల్, ఎఫ్‌ఎంసీజీ రంగ షేర్లలో జరిగిన కొనుగోళ్లు మార్కెట్ సూచీలను మరింత ముందుకు నడిపించాయి.

సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 20 లాభపడ్డాయి. టాటా స్టీల్ షేరు 3.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు రెండు శాతానికి పైగా పెరిగాయి. ఎం అండ్ ఎం మాత్రం అత్యధికంగా 3.68 శాతం క్షీణించింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. కాగా, బీఎస్‌ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.39 శాతం లాభపడ్డాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్, ఎఫ్‌ఎంసీజీ ఒక శాతం 1.36 శాతం వరకు పెరిగాయి.

ముక్కా ప్రొటీన్ లిస్టింగ్ అదరహో

ఫిష్ మీల్, ఫిష్ ఆయిల్ తయారీ కంపెనీ ముక్కా ప్రొటీన్స్ లిస్టింగ్‌కు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. గురువారం కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో నమోదయ్యాయి. ఐపీఓ ధర రూ.28తో పోలిస్తే, బీఎస్‌ఈలో కంపెనీ షేరు 57.14 శాతం ప్రీమియంతో రూ.44 వద్ద లిస్టయింది. తొలి రోజు ట్రేడింగ్ నిలిచేసరికి 50.92 శాతం లాభంతో రూ.42.26 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,267.80 కోట్లుగా నమోదైంది. సోమవారంతో ముగిసిన ముక్కా ప్రొటీన్ ఐపీఓకు సైతం అపూర్వ స్పందన లభించింది. ఇష్యూ సైజుతో పోలిస్తే 136.89 రెట్ల బిడ్లు లభించాయి.

బంగారం భగ భగ

మరో రూ.500 పెరిగిన ధర

తులం రూ.65,650కి చేరిక

ఈ వేసవిలో భానుడితో పాటు బంగారమూ భగ్గుమంటోంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల పసిడి (24 క్యారెట్లు) రేటు గురువారం రూ.500 పెరిగి రూ.65,650కి ఎగబాకింది. దేశీయంగా బంగారం ధరల్లో సరికొత్త రికార్డు స్థాయిది. వెండి కూడా పరుగు తీస్తోంది. కిలో ధర రూ.400 పెరుగుదలతో రూ.74,900కు చేరుకుంది. అంతర్జాతీయంగా ఈ విలువైన లోహాలకు డిమాండ్ పెరగడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 2,161 డాలర్లకు చేరుకుంది. సిల్వర్ 24.10 డాలర్ల వద్ద ట్రేడైంది. ఈ ఏడాదిలో ప్రామాణిక వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలివ్వడంతో అంతర్జాతీయ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బాండ్ల నుంచి క్రమంగా విలువైన లోహాల్లోకి మళ్లిస్తుండటం ప్రస్తుత బులియన్ ర్యాలీకి ప్రధాన కారణం. అంతర్జాతీయ మార్కెట్లో భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో పాటు సెంట్రల్ బ్యాంక్‌లు బంగారం నిల్వలను పెద్ద ఎత్తున పెంచుకుంటూ పోతుండటం కూడా గోల్డ్ డిమాండ్ పెరుగుదలకు కారణమవుతున్నాయని బులియన్ విశ్లేషకులు అన్నారు. బంగారం ధరలు మున్ముందు మరింత ర్యాలీ తీయవచ్చని.. ఈ ఏడాది చివరినాటికి తులం రూ.72,000కు చేరుకోవచ్చని కొందరు భావిస్తున్నారు.

నేడు మార్కెట్లకు సెలవు

మహా శివరాత్రి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు శుక్రవారం సెలవు. బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. సోమవారం నుంచి మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

అంతర్జాతీయ మార్కెట్లపై కోహన్స్ దృష్టి

హైదరాబాద్: ఔషధ, స్పెషాలిటీ కెమికల్స్ రంగంలో గట్టి పట్టున్న కోహన్స్ లైఫ్‌సైన్సెస్.. అంతర్జాతీయ మార్కెట్లపై దృష్టి పెడుతోంది. ఇందుకోసం సువెన్ ఫార్మాతో సహా దేశంలోని తన ఏడు ప్లాంట్లలో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ ఉత్పత్తి విభాగాలు (సీడీఎంఓ), ఏపీఐల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. ప్రస్తుతం కంపెనీ అమ్మకాల్లో 35 శాతం సీడీఎంఓ విభాగం ద్వారా సమకూరుతోంది.

గత మూడేళ్లుగా ఈ అమ్మకాలు ఏటా సగటున 33 శాతం చొప్పున పెరుగుతున్నాయి. 'ప్రస్తుతం మేము యాంటీ బాడీ కాంజుగేట్ (ఏడీసీ) పేలోడ్ స్పేస్ సీడీఎంఓ సామర్థ్యాలపై దృష్టి పెట్టాం. ఈ విషయంలో మాకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. మా టర్నోవర్ వృద్ధిలోనూ సీడీఎంఓ విభాగం కీలక పాత్ర పోషిస్తోంది' అని కోహన్స్ లైఫ్‌సైన్సెస్ ఎండీ డాక్టర్ ప్రసాద రాజు తెలిపారు.

నెఫ్రోప్లస్ చేతికి ఫిలిప్పీన్స్ కంపెనీ

హైదరాబాద్ కేంద్రంగా డయాలసిస్ సేవలందించే నెఫ్రోప్లస్.. ఫిలిప్పీన్స్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం ఆ దేశంలో ఆరు డయాలసిస్ కేంద్రాలు నడుపుతున్న రెనల్ థెరపీ సొల్యూషన్స్ ఇంక్ (ఆర్‌టీఎస్‌ఐ) అనే కంపెనీని కొనుగోలు చేసింది. నెఫ్రోప్లస్ వ్యవస్థాపకుడు, సీఈఓ విక్రమ్ ఉప్పల సోషల్ మీడియా వేదికగా ఈ విషయం ప్రకటించారు. అయితే ఆర్‌టీఎస్‌ఐను ఎంతకు కొనుగోలు చేసిందనేది మాత్రం ఆయన వెల్లడించలేదు. 2020 అక్టోబరులోనూ నెఫ్రోప్లస్.. ఫిలిప్పీన్స్‌కు చెందిన రాయల్ కేర్ డయాలసిస్ సెంటర్స్ ఇంక్ (ఆర్‌సీడీసీ) ఈక్విటీలో మెజారిటీ వాటా కొనుగోలు చేసింది. తాజాగా ఆర్‌టీఎస్‌ఐ కొనుగోలుతో ఆ దేశంలో నెఫ్రోప్లస్ డయాలసిస్ కేంద్రాల సంఖ్య 27కు చేరింది. నెఫ్రోప్లస్ ఇప్పటికే భారత్‌తో పాటు నేపాల్, ఉజ్బెకిస్థాన్, ఫిలిప్పీన్స్ దేశాల్లోని 230 నగరాల్లో 385 కేంద్రాల ద్వారా డయాలసిస్ సేవలు అందిస్తోంది.

7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు అవార్డు

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ ప్రతిష్ఠాత్మక యానిమేటెడ్ ఫ్రేమ్స్ (బీఏఎఫ్) అవార్డును దక్కించుకుంది. అత్యుత్తమ భారతీయ గేమ్స్ విభాగం (మేడిన్ ఇండియా)లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ).. 7సీస్‌కు చెందిన రోలర్ కోస్టర్ సిమ్యులేటర్ గేమ్‌కు ఈ అవార్డును అందజేసింది. బెస్ట్ ఇండియన్ గేమ్ విభాగంలో కంపెనీకి అవార్డు లభించటం ఎంతో సంతోషంగా ఉందని, ఇప్పటికే రోలర్ కోస్టర్ గేమ్ 20 లక్షలకు పైగా డౌన్‌లోడ్స్‌కు చేరుకుందని 7సీస్ ఎండీ ఎల్ మారుతి శంకర్ తెలిపారు.

మహిళల కోసం బీఓబీ కొత్త ఆఫర్లు

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల కోసం బీఓబీ మహిళా శక్తి సేవింగ్స్ అకౌంట్, బీఓబీ విమెన్ పవర్ కరెంట్ అకౌంట్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఖాతాలు తెరిచే వారికి ఆకర్షణీయమైన ఆఫర్లు, ప్రయోజనాలు కూడా ప్రకటించింది. ఈ ఆఫర్ ఈ ఏడాది జూన్ 30 వరకు అందుబాటులో ఉంటుంది. రుణ సదుపాయాలు ఈ ఏడాది డిసెంబరు 31 వరకు అందుబాటులో ఉంటాయి.

టాటా మోటార్స్ వాణిజ్య వాహనాల ధరలు పెంపు

టాటా మోటార్స్ వాణిజ్య వాహనాల ధర ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2 శాతం మేరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ముడిసరుకు వ్యయాల పెరుగుదల భారం తగ్గించుకునేందుకు ధరలు పెంచాల్సి వచ్చిందని తెలిపింది. వాణిజ్య వాహనాలన్నింటికీ ఈ ధరల పెంపు వర్తిస్తుంది.

త్వరలో మొబైల్స్ ఎగుమతులు రూ.4.96 లక్షల కోట్లకు..

కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ల ఎగుమతిలో భారత్ దూసుకుపోతోంది. గత ఏడాది మన దేశం నుంచి 1,100 కోట్ల డాలర్ల (సుమారు రూ.91,000 కోట్లు) విలువైన మొబైల్ ఫోన్లు ఎగుమతయ్యాయి. వచ్చే కొద్ది సంవత్సరాల్లో ఇది ఐదింతలకుపైగా పెరిగి 5,000 కోట్ల డాలర్ల నుంచి 6,000 కోట్ల డాలర్ల వరకు (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.4.13 లక్షల కోట్ల నుంచి రూ.4.96 లక్షల కోట్లు) పెరిగే అవకాశం ఉంది. ఢిల్లీలో జరిగిన ఫిన్‌టెక్ సదస్సులో కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయం ప్రకటించారు. ఇదే సమయంలో ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రస్తుతం 10 లక్షలుగా ఉన్న ఉద్యోగాల సంఖ్య కూడా 25 లక్షలకు చేరుతుందన్నారు. పదేళ్ల క్రితం మనకు అవసరమైన మొబైల్ ఫోన్లలో 98 శాతం దిగుమతి చేసుకుంటే, ఇప్పుడది ఒక శాతానికి పడిపోయిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. జీడీపీ పరంగా 2014లో ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న మన దేశం ప్రస్తుతం ఐదో స్థానానికి ఎదిగిందన్నారు. 2027 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ ఐదు లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని వైష్ణవ్ తెలిపారు. కాగా ఆర్థిక చట్టాలు దేశ అభివృద్ధికి దోహదం చేసేలా ఉండాలన్నారు. వరుసగా మూడో విడత అధికారం చేపడితే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

ఎయిర్‌టెల్‌లో జీక్యూజీ పెట్టుబడులు

0.8 శాతం వాటా
రూ.5,849 కోట్లకు కొనుగోలు

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ నివేదిక దెబ్బకు కుదేలైన సమయంలో అదానీ గ్రూప్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి అనతి కాలంలోనే భారీగా లాభపడిన ప్రవాస భారతీయ ఇన్వెస్టర్, జీక్యూజీ పార్ట్‌నర్స్ చీఫ్ రాజీవ్ జైన్ తాజాగా మరో ప్రముఖ భారత కంపెనీలో ఇన్వెస్ట్ చేశారు. ప్రైవేట్ రంగ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్‌లో 0.8 శాతం వాటాను రూ.5,849 కోట్లకు దక్కించుకున్నారు. ఎయిర్‌టెల్ ప్రమోటర్ గ్రూప్ కంపెనీ సింగపూర్ టెలీకమ్యూనికేషన్స్ (సింగ్‌టెల్) నుంచి జీక్యూజీ ఈ వాటాను చేజిక్కించుకుంది. ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా ఈ షేర్ల కొనుగోలు లావాదేవీ జరిగింది. 0.8 శాతం వాటాకు సమానమైన 4.9 కోట్ల షేర్లను సగటున ఒక్కొక్కటీ రూ.1,193.70 చొప్పున జీక్యూజీ కొనుగోలు చేసింది. ఈ డీల్ తర్వాత ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా 29.8 శాతం నుంచి 29 శాతానికి తగ్గింది. భారతీ గ్రూప్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ కుటుంబం, సింగ్‌టెల్.. భారతీ టెలికాం లిమిటెడ్ సహ-ఇన్వెస్టర్లుగా ఉన్నారు.

ఇండిగోలో వాటా విక్రయించనున్న గంగ్వాల్

3.3 శాతం వాటా
రూ.3,700 కోట్లకు విక్రయం

న్యూఢిల్లీ: ఇండిగో ఎయిర్‌లైన్స్ మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్‌లో సహ ప్రమోటర్ రాకేశ్ గంగ్వాల్ స్వల్ప వాటాను విక్రయించనున్నట్లు తెలిసింది. కంపెనీలో 3.3 శాతం వాటాకు సమానమైన 1.28 శాతం వాటా షేర్లను ఒక్కొక్కటీ రూ.2,925 చొప్పున మొత్తం రూ.3,700 కోట్లకు విక్రయించనున్నట్లు సమాచారం. వచ్చే సోమవారం ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా ఈ షేర్ల విక్రయం జరగనుంది. గురువారం ఎన్‌ఎస్‌ఈలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు 0.98 శాతం పెరిగి రూ.3,100 వద్ద ముగిసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	65,560 ▲	60,010 ▲	78,500 ▲
ముంబై	64,955 ▲	59,499 ▲	72,265 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ	
హైదరాబాద్	469
8వ తేదీ	
చిత్తూరు	523
గోదావరి	463
విజయవాడ	463
విశాఖపట్నం	475
వరంగల్	471

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	107
వరంగల్	107
కరీంనగర్	107
మహబూబ్‌నగర్	107
కర్నూలు	107
విశాఖపట్నం	113
గోదావరి	114
విజయవాడ	114
గుంటూరు	114
ఒంగోలు	114
చిత్తూరు	110

రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నాం

» గిరిజన వర్సిటీలో ఈ ఏడాది నుంచే క్లాసులు: కిషన్‌రెడ్డి



వరంగల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ట్రైబల్ సర్క్యూట్ కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు ప్రాంతంలోని బొగత జలపాతం, లక్నవరం, మేడారం, దామెరవాయి ప్రాంతాల్లో రూ.80కోట్లు కేటాయించి హరిత హోటళ్లతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. గురువారం రాత్రి వరంగల్ కోటలో రూ.5 కోట్లతో చేపట్టిన లైటింగ్ అండ్ సౌండ్ సిస్టంను మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ తర్వాత వరంగల్ రెండో పెద్ద నగరమని, రాజకీయాలకతీతంగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. రూ.550 కోట్లతో వరంగల్ రింగ్ రోడ్డును చేపట్టి సగం వరకు పూర్తి చేశామని తెలిపారు. సమ్మక్క-సారలమ్మ పేరుతో ములుగులో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభిస్తామన్నారు. రామప్ప ఆలయ పునరుద్ధరణకు రెండో విడతలో రూ.5కోట్లు కేటాయించామని చెప్పారు. ప్రసాద్ స్కీం కింద భద్రాచలం, జోగులాంబ ఆలయాల అభివృద్ధికి రూ.46కోట్లు కేటాయించామని వివరించారు. వేయిస్తంభాల ఆలయంలో కల్యాణమండపాన్ని రూ.15కోట్లతో పునః నిర్మించామని, శివరాత్రి సందర్భంగా భక్తులకు అంకితం చేస్తామన్నారు.

సమన్వయంతో పనిచేయండి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచార ప్రక్రియ పక్కాగా కొనసాగించేందుకు కష్టపడి పనిచేయాలని పార్టీ నాయకులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం సాఫీగా సాగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల ప్రచారానికి రానున్న జాతీయ పార్టీ నేతల పర్యటనలపై ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం కిషన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశం జరిగింది. పార్టీకి సంబంధించి 30కి పైగా విభాగాల ఇంచార్జులతో పాటు జాతీయ కార్యవర్గసభ్యులు గరికపాటి మోహన్‌రావు, ముఖ్య నేతలు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక సామాజికవర్గాలతో నిర్వహించాల్సిన సమావేశాలపై చర్చించారు. పార్టీ జాతీయ స్థాయిలో రూపొందించే మేనిఫెస్టోలో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై సమీక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం చేసేందుకు చార్జిషీటు కమిటీ ఏర్పాటు చేశారు.

బీజేపీకి ఓటేస్తే కేంద్రం నుంచి భారీగా నిధులు

» బీజేపీ సీనియర్ నేత బూర నర్సయ్యగౌడ్

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి భారీగా నిధులు వస్తాయని బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. కాంగ్రెస్ ఖాళీ కుండ అని, బీఆర్ఎస్ చిల్లులు పడిన కుండ అని బీజేపీ లంకె బిందెలు అని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం బూర నర్సయ్యగౌడ్ విలేకరులతో మాట్లాడారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారంటీలపై నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై వీగిన అవిశ్వాసం

» వేములవాడ వైస్ చైర్మన్ పీఠం కాంగ్రెస్‌కు

» భూపాలపల్లి వైస్‌చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం

సంగారెడి టౌన్, వేములవాడ టౌన్, భూపాలపల్లి, మార్చి7 : సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్‌కు చెందిన బొంగుల విజయలక్ష్మిపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. అవిశ్వాసంపై గురువారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన సమావేశాలకు కౌన్సిలర్లు ఎవ్వరూ హాజరుకాలేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయినట్టు ఆర్డీవో ప్రకటించారు. కాగా, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి బింగి మహేష్ ఎన్నికయ్యారు. వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ మధు రాజేందర్(బీఆర్ఎస్) రాజీనామా చేయడంతో ఖాళీ అయిన పదవిని భర్తీ చేసేందుకు గురువారం ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో 28 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలిసి 29 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బింగి మహేష్‌కు 18 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి మారం కుమార్ 11 ఓట్లు వచ్చాయి. భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన గండ్ర హరీశ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో వైస్ చైర్మన్ కొత్త హరిబాబు(బీఆర్ఎస్ నేత) డిసెంబరులో పదవికి రాజీనామా చేశారు. ఆ పదవిని భర్తీ చేసేందుకు గురువారం ఎన్నిక నిర్వహించారు. అయితే, నెల రోజులుగా క్యాంపులో ఉన్న బీఆర్ఎస్‌కు చెందిన 16 మంది కౌన్సిలర్లు ఎన్నికకు హాజరయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన 13 మంది కౌన్సిలర్లతోపాటు బీజేపీకి చెందిన ఒక్క కౌన్సిలర్ ఈ ఎన్నికకు దూరంగా ఉన్నారు. అయితే, హరీశ్‌రెడ్డికి పోటీగా ఎవరూ బరిలోకి దిగకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.

మోదీకి మోకరిల్లింది ఆ తండ్రీకొడుకులే

» కేసీఆర్, కేటీఆర్‌పై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): "ప్రధాని మోదీకి మోకరిల్లింది ఆ తండ్రీకొడుకులే. కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడానికి సహకరించాలని మోదీని కోరినప్పుడు కేసీఆర్ ఆత్మగౌరవం ఏమైంది? రేవంత్ మొగోడు. ఎంతమంది ఏకమైనా ఆయన్ను ఏం చేయలేరు" అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వాఖ్యానించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఆత్మ గౌరవానికి బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ అని స్పష్టం చేశారు. కేసీఆర్ అవినీతిని ప్రోత్సహించిందే బీజేపీ అని, ఆ కమీషన్లలో కేంద్రానికి వాటా ఉందని ఆరోపించారు. అనుమతుల్లేని ప్రాజెక్టులకు కేంద్రం అప్పు ఇచ్చిందంటే వారి మధ్య బంధం ఎలాంటిదో అర్థమవుతుందన్నారు. కాగా, "రేవంత్.. నువ్వు మగాడివైతే మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేయ్" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అవివేకానికి నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి విమర్శించారు. రేవంత్ రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా 2019లోనే గెలిచారని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి కూడా అయ్యారని గుర్తు చేశారు.

నకిలీ డాక్యుమెంట్లతో భూమి రిజిస్ట్రేషన్!

» 2016లో తహసీల్దార్ నిర్వాకం.. 30 గుంటలు తారుమారు

» కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో ఘటన.. అప్పటి అధికారి అరెస్ట్

కరీంనగర్ క్రైం, మార్చి 7: నకిలీ పత్రాలు సృష్టించి భూమిని అక్రమంగా ఇతరులకు కట్టబెట్టి.. కొంత భూమిని తన బినామీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్న తహసీల్దార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్. ప్రస్తుతం ఆయన సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో పనిచేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘురాజు తాత ఐలయ్యకు ఉన్న ఆస్తులను రఘురాజు తండ్రికి, చిన్నాన్నకి 2012లో సమాన భాగాలుగా పంచి రిజిస్ట్రేషన్లు చేయించాడు. సర్వే నంబర్ 29లోని 30 గుంటల భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయినా కూడా ఆన్‌లైన్‌లో చూపించలేదు. దీనిపై అప్పటి కొత్తపల్లి తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను రఘురాజు సంప్రదించగా సమస్యను పరిష్కరించేందుకు లంచంగా ఆ భూమి నుంచి 3.25 గుంటలను తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. ఇందుకు రఘురాజు ఒప్పుకోలేదు. 2015లో రఘురాజు తాత ఐలయ్య చనిపోయాడు. 2016లో ఐలయ్య సర్వే నంబర్ 29లోని 30 గుంటల భూమిని ఆయన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లుగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న అప్పటి వీఆర్ఏ అయిన పల్లె జీవన్ సాయంతో, 2022 ఆగస్టులో రఘురాజు చిన్నాన్నతోపాటు ఆయన నలుగురి మేనత్తలు ఒక్కొక్కరి పేరిట నాలుగున్నర గంటలు, తహసీల్దార్ బినామీ అయిన గోదావరిఖని కల్యాణ్ నగర్‌కు చెందిన చందా సంతోష్ పేరిట 3.25 గుంటల భూమిని మార్చారు. రఘురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో బాధితుల వివరాలు నిజమేనని వెల్లడికావడంతో చిల్ల శ్రీనివాస్, చంద సంతోష్, బొంతల రవి, బొంతల లావణ్య, ఉప్పుల కనక లక్ష్మి, దాడి రాధా, చుప్ప మంజుల, చిలువేరు స్వప్న, చిలువేరు మల్లేశం, పల్లె జీవన్, వినోద్, బుచ్చిరాజుపై కేసు నమోదు చేశారు. గురువారం తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్, చంద సంతోష్, పల్లె జీవన్‌ను అరెస్టు చేసి కరీంనగర్ కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ వారికి 14 రోజుల రిమాండ్ విధించారు.

15,403 మెగావాట్ల డిమాండ్!

» ఈ నెల 6న సీజన్‌లోనే అత్యధికం

» రికార్డు స్థాయి విద్యుత్తు వినియోగం!

» రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ రోజురోజుకూ పెరిగిపోతోంది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం విద్యుత్తు వాడకం ఎక్కువగా నమోదవుతోంది. రాబోయే రోజుల్లో ఇంది మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడం, వ్యవసాయంతో పాటు అన్ని కేటగిరీల వినియోగదారులకు నిరంతర విద్యుత్తు సరఫరా అందుబాటులో ఉండడంతో వినియోగం భారీగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్తును సరఫరా చేయడం కోసం ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. గత ఏడాది మార్చి 6 వరకు 14,856 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదవగా, ఈ ఏడాది మార్చి 1 నుంచే 15 వేల మెగావాట్లకు పైగా డిమాండ్ ఏర్పడింది. ఈ నెల 6న ఈ సీజన్‌లోనే అత్యధికంగా 15,403 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. ఇది గత ఏడాది కంటే 573 మెగావాట్లు అదనం. రాష్ట్రంలో గత ఏడాది 297.89 మిలియన్ యూనిట్లుగా ఉన్న అత్యధిక విద్యుత్తు వినియోగం, బుధవారానికి 298.19 మిలియన్ యూనిట్లతో కొత్త రికార్డును నెలకొల్పింది.

డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా

రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ ఎంత పెరిగినా.. సరఫరా చేయడానికి విద్యుత్తు సంస్థలు సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రంలో గత ఏడాది జనవరిలో సరాసరి విద్యుత్తు వినియోగం 227.42 మిలియన్ యూనిట్లు కాగా, ఈ ఏడాది జనవరిలో 243.12 మిలియన్ యూనిట్లకు పెరిగింది. గత ఏడాది ఫిబ్రవరిలో సరాసరి విద్యుత్తు వినియోగం 263.48 మిలియన్ యూనిట్లు కాగా, ఈ ఏడాది అది 272.86 మిలియన్ యూనిట్లకు చేరింది. గత ఏడాది మార్చి 6 వరకు సరాసరి వినియోగం 291.33 మెగావాట్లు కాగా ఈ ఏడాది అదే సమయానికి 292.66 మిలియన్ యూనిట్లకు చేరింది. విద్యుత్తు లభ్యత పుష్కలంగా ఉండడంతో మరికొద్ది రోజుల్లో వినియోగం 300 మిలియన్ యూనిట్లు దాటే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలోనూ..

జీహెచ్ఎంసీ పరిధిలో గత ఏడాది మార్చి 6న 59.53 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండగా, ఈ ఏడాది 69.31 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అధికం కావడం విశేషం. జీహెచ్ఎంసీ పరిధిలో గత ఏడాది మార్చి 6 నాటికి 2910 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదవగా ఈ ఏడాది మార్చి 1 నుంచే 3000 మెగావాట్లు దాటుతోంది. ఈ నెల 6న సీజన్లోనే అత్యధికంగా 3335 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ నమోదైంది.

బాంబులు మీ పక్కనే ఉన్నాయ్

నల్లగొండ, ఖమ్మం బాంబులే.. మీ ప్రభుత్వాన్ని ఏమైనా చేస్తాయ్.. జేబులో కత్తెర పెట్టుకునేది దొంగలే

» హామీలు అమలుచేయకుంటే వెంటబడతాం

» మగాడివైతే 17లోగా రుణమాఫీ చేయ్

» కేసీఆర్ ఉంటే నీళ్ల సమస్య వచ్చేదే కాదు

» మేడిగడ్డకు వెంటనే రిపేర్ చేయాలి: కేటీఆర్



కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్లలో ఎండిన పొలాల్ని పరిశీలిస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్/కరీంనగర్ రూరల్/చొప్పదండి, మార్చి 7: 'మానవ బాంబులు మీ పక్కనే ఉన్నాయ్. కాంగ్రెస్ పార్టీలో బాంబులు, ఎవరో కాదు.. నల్లగొండ బాంబు, ఖమ్మం బాంబు. మీ గవర్నమెంట్ మీద చేసేదంతా వాళ్లే చేస్తరు.. మా వైపు నుంచి ఎలాంటి ప్రమాదం లేదు' అని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కదనభేరి బహిరంగ సభ సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "మూడు నెలలుగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న మాటలు అందరూ గమనిస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో నాకేం అర్థం కాలేదు.. ఆ భాషా ప్రయోగం, ఆ ఆవేశంతో ఊగిపోవడం. నోటికొచ్చినట్టు మాట్లాడాడు. ఆ మాటలు వింటే అధికారంలో ఉండి కూడా ఇంత విసుగు ఎందుకో అనిపిస్తోంది. ఇంత ఆగమాగం ఎందుకు అవుతున్నాడో అర్థం కావడం లేదు. ప్రభుత్వాన్ని ఏమైనా చేస్తే మానవ బాంబులైతాం... జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నా.. ఎవరైనా పిచ్చిపిచ్చి పనులు చేస్తే గొంతు కోస్తా.. కడుపుచింపుతా.. అంటున్నాడు. ఒక ముఖ్యమంత్రి మాట్లాడే మాటలా ఇవి..? జేబులో కత్తెర పెట్టుకుని జేబు దొంగలే తిరుగుతారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు నిక్షేపంగా ఉండాలని, ప్రజలకిచ్చిన 420 హామీలు అమలు చేయాలని కోరుకుంటున్నాం. హామీలు నిలబెట్టుకోబోతే వెంటబడతాం. మగతనమంటే ఎన్నికల్లో గెలవడం కాదు.. దమ్ముంటే మార్చి 17లోగా రూ.2లక్షల రుణమాఫీ చేసి నిరూపించుకోవాలి. రాష్ట్రంలో సాగు నీరు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఇది కాలం తెచ్చిన కరువు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరువు. మేడిగడ్డకు మరమ్మతు చేయకుండా.. బీఆర్ఎస్, కేసీఆర్‌ను బద్నామ్ చేసేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారు. కేసీఆర్ అధికారంలో ఉండి ఉంటే నీళ్ల సమస్య వచ్చేదే కాదు. ఈ నెల 12న పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఎన్నికల కదనభేరి మోగించడానికి కరీంనగర్ వస్తున్నారు. వేలాదిగా నాయకులు, కార్యకర్తలు సభకు తరలిరావాలి" అని అన్నారు.

సాగుకు కరెంటు అర్ధరాత్రి వస్తోంది..

తెలంగాణలో కరువు కాంగ్రెస్ తెచ్చిందేనని కేటీఆర్ విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రైతులకు నీరందించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్లలో ఎండిపోయిన పంట పొలాలను కేటీఆర్ పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ప్రాంతానికి నీరు అందిస్తూ, మరో ప్రాంతంపై వివక్ష చూపుతోందన్నారు. పెద్దపల్లికి నీరు అందిస్తున్న అధికారులు.. కరీంనగర్ నియోజకవర్గానికి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు అందించాలని డిమాండ్ చేశారు. రాత్రి 11గంటలకు త్రీఫేజ్ కరెంట్ వస్తుందని రైతులకు అధికారులే మేసేజ్‌లు పంపుతున్నారని, పదేళ్ల తర్వాత రైతులు రాత్రిళ్లు బావుల వద్ద పడుకునే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం చాకుంటలో ఎండిపోయిన పంటలను పరిశీలించేందుకు కేటీఆర్ వస్తున్నారన్న సమాచారంతో గ్రామ రైతులు రాయపట్నం రహదారిపై ఆందోళనకు దిగారు. గత ఏప్రిల్‌లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని చెప్పిన కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతుల నిరసన నేపథ్యంలో కేటీఆర్ పర్యటన రద్దు చేసుకున్నారు.

నీటి సమస్య తీర్చడం చేతగాక..

హైదరాబాద్: నీటి సమస్య తీర్చడం చేతగాక.. లోటు వర్షపాతం అని సాకులు చెబుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. భారత వాతావరణ శాఖ లెక్కల ప్రకారం 2023-24 సంవత్సరానికి గాను రాష్ట్రంలో సాధారణం కంటే 14శాతం ఎక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. పాలమూరు సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎక్స్ వేదిగా ఖండించారు.

మోదీ బడేభాయ్.. రేవంత్ చోటేభాయ్!

» టీడీపీ, కాంగ్రెస్ వల్లే పాలమూరు వెనుకబాటు

» రేవంత్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

» అధికారం ఎవరికీ శాశ్వతం కాదు: హరీశ్‌రావు



నారాయణఖేడ్/సంగారెడ్డి, మార్చి 7(ఆంధ్ర జ్యోతి): "మోదీ బడేభాయ్.. రేవంత్ చోటేభాయ్.. వాళ్లిద్దరూ ఒక్కటే" అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ తెలంగాణ కోసమే పుట్టిందని, పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం కొట్లాడే పార్టీనే గెలిపించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడూ పాల్గొనని, ఎప్పుడూ జై తెలంగాణ అనని ముఖ్యమంత్రి రేవంత్‌కు రాష్ట్ర ప్రజలపై ప్రేమ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. నారాయణఖేడ్‌లో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంతోపాటు సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్ మాట్లాడారు. బీఆర్ఎస్ హయాలో చేపట్టిన పథకాలు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతల మెడలు వంచాలన్నారు. పాలమూరు వెనుకబాటుకు నాటి టీడీపీ, కాంగ్రెస్ పాలనలే కారణమని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తిట్టాల్సివస్తే ముందుగా తన గురువు చంద్రబాబును తిట్టాలని, కాంగ్రెస్ చేసిన మోసాలను నిందించాలని సూచించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాతే పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారన్నారు. అలాంటి కేసీఆర్‌ను తిట్టడం అవివేకమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదే పదే తన ఎత్తు గురించి మాట్లాడతారని, కానీ తాను అలా మాట్లాడి విలువ తగ్గించుకోనని అన్నారు.

స్వేచ్ఛా ప్రపంచంలోకి సాయిబాబ

» నాగ్‌పూర్ జైలు నుంచి విడుదల

» కారాగారంలో నరకం అనుభవించా..

» విడుదల అనంతరం సాయిబాబ



విడుదల తర్వాత భార్య వసంతతో సాయిబాబ

నాగ్‌పూర్, మార్చి 7: మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబ నాగ్‌పూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే కేసులో బాంబే హైకోర్టు రెండ్రోజుల కిందే ఆయనను నిర్దోషిగా తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన గురువారం జైలు నుంచి విడుదలై స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగుపెట్టారు. జైలు బయట వేచిచూస్తున్న తన కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇంత క్రూరమైన జైలు జీవితం అనుభవించి ప్రాణాలతో బయటకు రావడం నిజంగా ఆశ్చర్యంగా ఉంది. వీల్‌చైర్ నుంచి కదల్లేకపోయాను. సొంతంగా కనీసం టాయిలెట్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి. జైల్లో నరకం అనుభవించాను' అని ఆవేదన చెందారు. తనపై పెట్టిన కేసును ఓ కల్పిత కేసుగా కొట్టిపారేశారు. 'సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా అన్యాయంగా మాపై కేసులు పెట్టారు. ఉన్నత న్యాయస్థానం ఇదే విషయాన్ని చెప్పింది. దాదాపు 10 ఏళ్లు.. నన్ను, మరికొందరిని జైల్లో బందీ చేశారు. ఆ సమయాన్ని తిరిగి ఎవరిస్తారు..?' అని ప్రశ్నించారు. 'నా ఆరోగ్యం చాలా క్షీణించింది. నేను ఇప్పుడు ఎక్కువగా మాట్లాడలేను. వైద్య చికిత్స తర్వాత మీతో అన్ని విషయాలు మాట్లాడుతా..' అని చెప్పారు.

2014లో అరెస్టు

మావోయిస్టులతో సంబంధాలు పెట్టుకొని దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ సాయిబాబతో పాటు మరో ఐదుగురిని 2014లో మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత 2016 వరకు కొంత కాలం బెయిల్‌పైన బయటికొచ్చారు. ఇటు కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించారు. ఈ నేపథ్యంలోనే 2017 మార్చిలో గడ్చిరోలి సెషన్స్ కోర్టు సాయిబాబతో పాటు నిందితులందరికీ జీవిత ఖైదు విధించింది. దీంతో సాయిబాబ అప్పట్నుంచి నాగ్‌పూర్ జైల్లోనే ఉన్నారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ కేసుపై బాంబే హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 5న నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.

నిందితురాలిని కాదు బాధితురాలిని

» టీవీ సీరియల్‌లా లిక్కర్ కేసు.. చిట్‌చాట్‌లో ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసును టీవీ సీరియల్‌లా సాగదీస్తున్నారని, ఆ కేసులో తాను నిందితురాలని కాదని బాధితురాలినని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీలను బొంద పెట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. కానీ, ప్రాంతీయ పార్టీలను దెబ్బతీయడం అసాధ్యమని స్పష్టం చేశారు. రాజకీయాల్లో సిద్ధాంతాలకు చోటు లేకుండా పోయిందని వాపోయారు. ఎమ్మెల్సీ కవిత ఈ మేరకు మీడియాతో గురువారం చిట్‌చాట్ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి రేసు గుర్రం కాదని కీలు గుర్రమని ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. మానవ బాంబులవుతాం అంటున్న రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌ను నియంత అని మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రతిపక్షాలను బెదిరించడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశం తమకు లేదని చెబుతున్నా సరే ముఖ్యమంత్రి తీవ్ర పదజాలంతో కేసీఆర్‌ను దూషించడం తగదన్నారు. రేవంత్ డీఎన్ఏలోనే బీజేపీ ఉందని ఆయన తొందర్లోనే ఆ పార్టీతో కలుస్తారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేది బీజేపీ అని పేర్కొన్నారు. పాలన అనుభవం లేకపోవడం వల్ల ముఖ్యమంత్రి రాష్ట్రంలో కృత్రిక కరువు సృష్టిస్తున్నారని కవిత ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును, కేసీఆర్‌ను బద్నాం చేయాలనే రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించారని అన్నారు. కాగా, మహిళలకు ఉద్యోగావకాశాల్లో జీవో 3 వల్ల జరిగే నష్టంపై శుక్రవారం చేపట్టిన ధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. అలాగే, తాను పోటీలో ఉన్నా, లేకున్నా.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అర్వింద్ ఎక్కడి నుంచి పోటీ చేసినా అతన్ని ఓడిస్తానని కవిత పేర్కొన్నారు.

భూకేటాయింపు ఒప్పందం, సేల్‌డీడ్ రద్దు సబబే!

» ప్రభుత్వం చేసిన చట్టాన్ని సమర్థించిన హైకోర్టు

» ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ పిటిషన్ కొట్టివేత

» అత్యంత విలువైన 850 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికే!



హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం ద్వారా ఐఎంజీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని, అందుకు సంబంధించిన సేల్‌డీడ్‌ను రద్దు చేయడం సబబేనని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు ఒప్పందాన్ని అమలు చేయాలని, ప్రత్యేక చట్టం ద్వారా ఒప్పందాన్ని, సేల్‌డీడ్‌ను రద్దు చేయడం చెల్లదని పేర్కొంటూ ఐఎంజీ భారత్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే అత్యంత విలువైన 850 ఎకరాల భూమి ప్రభుత్వపరం కావడం విశేషం. ఐఎంజీ భారత్ కంపెనీ 2003 ఆగస్టు 5న కంపెనీల చట్టం ప్రకారం ఏర్పాటైంది. 2003లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం పిటిషనర్ కంపెనీని క్రీడాసౌకర్యాల అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణలో నైపుణ్యం కలిగిన కంపెనీగా గుర్తించి.. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబర్ 25లో 400 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం మామిడిపల్లి గ్రామం సర్వే నంబర్ 99 /1 లో 450 ఎకరాలు, హెడ్‌కార్టర్స్ నిర్మాణానికి బంజారాహిల్స్ నుంచి శిల్పారామం ప్రధాన రహదారిలో ఒక ఎకరం నుంచి 5 ఎకరాల భూమి కేటాయించేందుకు ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. రూ.50 వేలకు ఎకరం చొప్పున 400 ఎకరాలను రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా అప్పగించింది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం 2006లో ఎంవోయూ, సేల్‌డీడ్ రద్దుకు ఆర్డినెన్స్ 12 ఆఫ్ 2006ను తీసుకొచ్చింది. తర్వాత సదరు ఆర్డినెన్స్ యాక్ట్ 11 ఆఫ్ 2007 ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ప్రాపర్టీ (ప్రివెన్షన్, ప్రొటెక్షన్ అండ్ రిసంప్షన్) చట్టం-2007గా ఆమోదించింది. పిటిషనర్ కంపెనీతో చేసుకున్న ఎంవోయూ, సేల్‌డీడ్, ఇతర రాయితీలను రద్దుచేసింది. కాగా ఈ చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని.. దానిని కొట్టేయాలని పిటిషనర్ కంపెనీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ అప్పటి రాష్ట్ర ప్రభుత్వాన్ని మోసం చేయడం ద్వారా 850 ఎకరాల భూకేటాయింపునకు సంబంధించిన ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు. రూ. వందల కోట్ల విలువైన భూమిని కేవలం రూ. 3.12 కోట్లకు దక్కించుకుందని ఆరోపించారు. భూకేటాయింపు ఒప్పందం డ్రాఫ్టులను అప్పటి క్యాబినెట్ సబ్‌కమిటీకి సర్క్యులేట్ చేయడం సహా యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చరల్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి ముఖ్యమంత్రి దాకా కేవలం ఒకే ఒక్క రోజులో ఫైల్ క్లియర్ అయిందని పేర్కొన్నారు. 2003 ఆగస్టు 9న ఎంవోయూ జరగ్గా అంతకంటే ఐదురోజుల ముందే ఐఎంజీ అకాడమీస్ భారత్ కంపెనీని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. భూములను కంపెనీ పేరిట సేల్ డీడ్ ఎగ్జిక్యూట్ చేసేనాటికి రాష్ట్రంలో ఆపద్ధర్మ ప్రభుత్వం ఉందని.. పబ్లిక్ ప్రాపర్టీని కొల్లగొట్టే ఉద్దేశంతోనే కంపెనీ ఏర్పడిందని ఆరోపించారు. ఐఎంజీ వరల్డ్‌వైడ్ కంపెనీలో భాగమైన అమెరికాలోని డెలావేర్ రాష్ట్రానికి చెందిన ఐఎంజీ అకాడమీస్ ఈస్ట్ లిమిటెడ్‌కు 100 శాతం సబ్సిడరీ కంపెనీ అని పేర్కొన్నారని..అమెరికా కంపెనీకి సబ్సిడరీ అని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. ఒక్క సేల్ డీడ్, ఎంవోయుయూ రద్దు చేయడానికి చట్టం చేయడం చెల్లదని పిటిషనర్ చెప్పడం సమంజసం కాదని..భూములు, ఒప్పందాలకు సంబంధించి చట్టాలు చేసే అధికారం రాజ్యాంగం రాష్ట్రాలకు కల్పించిందని పేర్కొన్నారు. పిటిషనర్ ఐఎంజీ భారత్ తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. ఒక ఒప్పందాన్ని, సేల్‌డీడ్‌ను రద్దు చేయడానికి చేసిన చట్టం చెల్లదని.. ఇది సింగిల్‌మెన్ లెజిస్లేషన్ అని.. ఏకవ్యక్తి కోసం చట్టం చేయడం చెల్లదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. చట్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగం అధికారాలు ఇచ్చిందని పేర్కొంది. ఈ మేరకు ఐఎంజీ భారత్ పిటిషన్‌ను కొట్టేసింది. గతనెలలో తీర్పును రిజర్వు చేసిన ధర్మాసనం.. గురువారం తీర్పు వెలువరించింది.

మహారాష్ట్రలో బీఆర్ఎస్ పోటీ చేస్తుందా? లేదా?

» లోక్‌సభ ఎన్నికల్లో పోటీపై వారంలో స్పష్టత ఇవ్వండి

» బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మహారాష్ట్ర నేతల లేఖ

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్ పోటీ చేస్తుందో? లేదో? స్పష్టత ఇవ్వాలని ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు అక్కడి నేతలు లేఖ రాశారు. ఈ మేరకు పలువురు బీఆర్ఎస్ నేతలు బుధవారం మహారాష్ట్రలో సమావేశమై చర్చించినట్లు తెలిసింది. అనంతరం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు వారు లేఖ రాసినట్లు సమాచారం. "మహారాష్ట్ర ప్రజల జీవితాల్లో మార్పు తెస్తాం.. అంటూ మా రాష్ట్రానికి వచ్చి సభలు నిర్వహించారు. మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేద్దామని చెప్పి.. ఆ తర్వాత తక్కువ సమయం ఉందని వెనుకంజ వేశారు. జాతీయ స్థాయిలో పార్టీని బలంగా తీసుకువెళ్తామంటూ ప్రజాసంఘాలు, వివిధ పార్టీలకు చెందిన నేతల్లో ఆశలు పెంచారు. వచ్చిన వారందరినీ పార్టీలో చేర్చుకున్నారు. ఇప్పుడు మా రాష్ట్రంపై కనీసం దృష్టి పెట్టడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి పోటీ చేసే ఉద్దేశం ఉందా? లేదా? మీ వైఖరేంటే వారం రోజుల్లో మాకు చెప్పండి. ఒక వేళ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయబోదంటే.. తాము పార్టీలో కొనసాగాలా? వద్దా? అన్నది నిర్ణయించుకుంటాం" అని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది.

మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నవీన్‌రెడ్డి!



షాద్‌నగర్/నందిగామ (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగర్‌కుంట నవీన్‌రెడ్డి పేరును బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మొదళ్లగూడ గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. గత శాసనసభ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్య యాదవ్ తరఫున నియోజకవర్గంలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. రాజకీయ అనుభవంతో పాటు, ఆర్థికంగా బలంగా ఉన్నారన్న ఆలోచనతోనే నవీన్‌రెడ్డి పేరును ఖరారు చేయబోతున్నారన్న వార్తలు సోషల్ మీడియాలో గుప్పుమంటున్నాయి.

గ్రూప్-2. 3లో అదనపు పోస్టులు!

» ఖాళీ పోస్టుల వివరాలివ్వాలని శాఖలకు ప్రభుత్వ ఆదేశం

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఓ శుభవార్త. టీఎస్‌పీఎస్సీ నియామకాల్లో గ్రూప్- 2, 3 పోస్టుల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తుంది. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-2, 3 పోస్టుల వివరాలను ఆర్థిక శాఖకు అందించాలని అన్ని శాఖాధిపతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించి ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు సచివాలయంలోని అన్ని శాఖలకు గురువారం ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్-2లో 783 పోస్టులను, గ్రూప్-3లో 1,388 పోస్టులను టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీకి ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. అయితే, కొత్తగా ఏర్పడిన ఖాళీలను కూడా భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

బొగ్గు గనుల మైనింగ్‌కు అనుమతులివ్వండి

» కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి డిప్యూటీ సీఎం భట్టి విజ్ఞప్తి



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి పుష్పగుచ్ఛం ఇస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సింగరేణికి కేటాయించిన తాడిచర్ల రెండో కోల్‌బ్లాక్‌లో మైనింగ్ జరిపేందుకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. విద్యుత్తుకు డిమాండ్ పెరిగిన దృష్ట్యా బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని, అందుకు వీలుగా తాడిచర్ల బ్లాక్‌లో మైనింగ్ కోసం అనుమతులు ఇవ్వాలని కోరారు. గురువారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో భట్టి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గత బీఆర్‌ఎస్ సర్కారు అనుమతులు తీసుకోకపోవడం వల్ల తాడిచర్ల బొగ్గు బ్లాక్‌లో 5 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నా వినియోగించుకోలేకపోతున్నామని కేంద్ర మంత్రికి తెలిపారు. జైపూర్ విద్యుత్ ప్లాంట్ కోసం ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకును కేంద్రం గతంలో కేటాయించిందని, అయితే మైనింగ్‌కు కావాల్సిన అనుమతులు గత ప్రభుత్వం తీసుకోలేదన్నారు. దీని మూలంగా సింగరేణిపై అదనపు భారం పడుతుందని మంత్రి దృష్టికితీసుకెళ్లారు. స్పందించిన కేంద్ర మంత్రి.. ఒడిశా సీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తాడిచర్ల కోల్ బ్లాక్ అనుమతులకు ఆదేశాలు ఇస్తామన్నారు. అలాగే కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కే సింగ్‌తోనూ భేటీ అయిన డిప్యూటీ సీఎం భట్టి.. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద సబ్‌స్టేషన్ల పరిసర ప్రాంతాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అనంతరం విలేకరులతో భట్టి మాట్లాడుతూ.. అధికారం కోల్పోయాక బీఆర్‌ఎస్ నేతలు ఆలోచన, జ్ఞానం కూడా కోల్పోయారని విమర్శించారు. కుంగిన మేడిగడ్డ ప్రాజెక్టు మరమ్మత్తులకు సంబంధించి కేసీఆర్, కేటీఆర్ చెప్పినట్లు చేయడానికి వారేమీ ఇంజనీర్లు కాదని చెప్పారు. వారు ఇంజనీర్లమని ఊహించుకొని, డిజైన్ చేసి కట్టడం వల్లే మేడిగడ్డ కుంగిందని ఎద్దేవా చేశారు.

స్పెషల్ డ్రైవ్‌తో ధరణి భూ సమస్యలు కొలిక్కి

» 6 రోజుల్లో 76 వేల దరఖాస్తులకు పరిష్కారం:పొంగులేటి

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ వల్ల ఉత్పన్నమైన సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఏదో ఒక కుటుంబం ధరణితో సమస్యలను ఎదుర్కొంటున్నదని, ఈ సమస్యలను పరిష్కరించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ధరణికి సంబంధించి గత ప్రభుత్వంలో వచ్చిన 2,46,536 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారానికి ఈ నెల 1 నుంచి ఎమ్మార్వో స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఇందులో 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీఓ, తహశీల్దార్ స్థాయిలో 76,382 దరఖాస్తులను పరిష్కరించినట్లు మంత్రి పొంగులేటి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజుకు 15 వేలకు పైగా దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని, ప్రధానంగా పెండింగ్ మ్యూటేషన్‌కు వచ్చిన 15,070 దరఖాస్తుల్లో 5,471 పరిష్కరించామని పేర్కొన్నారు. గ్రీవెన్స్ ఆఫ్ ల్యాండ్ మ్యాటర్ కింద వచ్చిన 40,605 దరఖాస్తులకు గాను 17,372, పాస్ బుక్ డేటా కలెక్షన్‌కు సంబంధించి 1,01,132 దరఖాస్తులకు గాను 27,047లకు పరిష్కారం జరిగిందన్నారు. కోర్టు కేసులకు సంబంధించి వచ్చిన 27,672 దరఖాస్తులకు గాను 9,883 పరిష్కరించినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం:పొన్నం

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సీసీఎస్, పీఎఫ్ వంటి ఆర్థికపరమైన విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఆర్టీసీ కళాభవన్‌లో గురువారం గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్, మేడారం జాతరలో ఉత్తమ సేవలందించిన 157మంది ఉద్యోగులకు అవార్డుల తోపాటు దసరా లక్కీ డ్రా విజేతలకు బహుమతులను మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కండక్టర్లు, డ్రైవర్లు ఆర్టీసీకి పునాది లాంటి వారని, నిబద్ధతతో పనిచేస్తోన్న సిబ్బందిని సన్మానించుకోవడం అభినందనీయమన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల్లోకి వస్తోందని తెలిపారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం సక్సెస్ అయిన నేపథ్యంలో ఆ పేరుతోనే మహిళా ఉద్యోగులకు అవార్డులు అందజేయాలని సూచించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ టీఎస్‌ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని, మేడారం మహాజాతరలో సిబ్బంది అద్భుతంగా పని చేశారని కొనియాడారు.

త్వరలో రాష్ట్రంలో స్కిల్ వర్సిటీ :మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణ విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇంటర్న్‌షిప్, ఉద్యోగాల కల్పన, విద్యార్థుల అభివృద్ధి' అనే అంశంపై గురువారం అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో శ్రీధర్ బాబు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం విద్యతోపాటు ఐటీలో దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. రాష్ట్రంలోని ఏ విద్యార్థి కూడా నైపుణ్యలేమి కారణంగా ఉపాధి అవకాశాలు కోల్పోరాదని, ఆ దిశగా ఉన్నత విద్యా మండలి, తెలంగాణ విద్యా శాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి సమక్షంలో ఉన్నత విద్యా మండలి, బీఎఫ్‌ఎస్ఐ సంస్థ మధ్య కుదిరిన అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. అనంతరం ఉన్నత విద్యా మండలి రూపొందించిన తెలంగాణ రాష్ట్ర విద్యాభివృద్ధి గణాంకాల నివేదికను, డైరీని మంత్రి ఆవిష్కరించారు.

భారత్ జోడో న్యాయ్ యాత్ర
మారథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర మారథాన్ పోస్టర్‌ను గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. యూత్ కాంగ్రెస్ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ మహమ్మద్ అసదుద్దీన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న భారత్ జోడో న్యాయ్ యాత్రను నిర్వహించనున్నారు. ఇండియా కూటమిని బలపర్చాలని యువతను కోరుతూ.. కృష్ణకాంత్ పార్క్ నుంచి యూసుఫ్‌గూడ వరకు ఈ మారథాన్ జరుగుతుంది. ఈ మారథాన్‌లో పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డిని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి ఆహ్వానించారు.

వైద్యసేవలతో దేశానికి పేరు తేవాలి

జవహర్‌నగర్, మార్చి 7: ఆర్మీ డెంటల్ కాలేజీలో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు.. ప్రజలకు, సైనికులకు వైద్యసేవలు అందిస్తు దేశానికి పేరు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మేడ్చల్ జిల్లా, జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్మీడెంటల్ కాలేజీలో గురువారం నిర్వహించిన స్నాతకోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రి.. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందించారు. అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని శ్రేయ శుక్లాకు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ ట్రోఫీ, ప్రశంసాపత్రం అందజేశారు.

వారిది సంఘర్షణ.. మాది సహకారం

కేంద్రానికి భూములిచ్చాం .. ప్రతిగా కేంద్రం ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతిచ్చింది

- గత సర్కారు ఘర్షణ ధోరణితో ప్రజలకు నష్టం జరిగింది
- ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ముఖద్వారం ఈ కారిడార్
- హైదరాబాద్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తాం: సీఎం
- అల్వాల్‌లో ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన
- దళిత బహుజనులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం
- బాబు జగ్జీవన్‌రామ్ భవనం ప్రారంభోత్సవంలో రేవంత్

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి రాగానే కేంద్రంతో సఖ్యతగా వ్యవహరిస్తూ అనుగుణమైన చర్యలు తీసుకున్నామని దాని వల్లనే కేంద్రం కూడా సహకరించటానికి ముందుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రంతో పెట్టుకున్న ఘర్షణ వల్ల రాష్ట్ర ప్రజానీకం నష్టపోయిందన్నారు. సికింద్రాబాద్‌లోని అల్వాల్ సమీపంలో ప్యారడైజ్-శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ పనులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే కరీంనగర్, ఆదిలాబాద్ ప్రయాణం సులభతరం అవుతుందన్నారు. 40 ఏళ్లగా కుత్బుల్లాపూర్, మేడ్చల్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, గత ప్రభుత్వం కేంద్రంతో అనుసరించిన ఘర్షణ వైఖరి కారణంగా ఈ ప్రాజెక్టు ఆలస్యమైందని తెలిపారు. గత ప్రభుత్వం సరైన సంప్రదింపులు జరపలేదని రక్షణ శాఖ అధికారులు స్వయంగా చెప్పారన్నారు. తాము అధికారంలోకి రాగానే ప్రధాని మోదీని, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను కలిసి ప్రాజెక్టు అవసరాన్ని వివరించి సమస్యను పరిష్కరించామన్నారు. అయితే, తమ పోరాటం వల్లనే ఇది సాధ్యమైందని కేటీఆర్ చెబుతున్నారని.. ట్విటర్‌లో పోస్టులు పెట్టడమే పోరాటమా? మేం అనుమతులు తీసుకొస్తే ఆయన పోరాటం చేసినట్లుగా చెప్పుకోవటం ఏమిటని సీఎం ప్రశ్నించారు. 'గతంలో కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని అన్నరు. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని కేటీఆర్ సచ్చుడో అభివృద్ధికి కేంద్రం నిధులు వచ్చుడో అని కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలి. మీకు కాపలాగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును ఉంచుతా' అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వికారాబాద్ పూడూర్‌లో నౌకాదళానికి భూముల కేటాయింపు, చాంద్రాయణగుట్ట రక్షణశాఖ భూముల లీజ్ రెన్యువల్ అంశాల్లోనూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందని, తాము అధికారం చేపట్టగానే అధికారులతో సమీక్షించి పూడూర్‌లో 2 వేల ఎకరాలను నౌకాదళానికి, 2,400 ఎకరాల ఇమ్రాత్ భూములను కేంద్రానికి అప్పగించామని సీఎం వెల్లడించారు. ఈ విధంగా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంతో కేంద్రం రాష్ట్రానికి సహకరించిందన్నారు. రక్షణ శాఖ అంటే దేశ భద్రతకు సంబంధించినదని.. అందుకే సత్వర నిర్ణయం తీసుకున్నామని, అంతేగాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఘర్షణతో ప్రజలు నష్టపోతారని భావించి ఆ పరిస్థితి తలెత్తకుండా భూములు అప్పగించామని తెలిపారు. హైటెక్‌సిటీ, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు తరహాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాల అభివృద్ధి జరగాలంటే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం జరగాలని.. ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ఎలివేటెడ్ కారిడార్ ముఖద్వారం వంటిదని సీఎం పేర్కొన్నారు. 'రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతూనే ఉంటాం. రాబట్టుకుంటాం. ఇవ్వకపోతే కచ్చితంగా కేంద్రంతో కొట్లాడుతాం. ఇందులో ఎలాంటి శషభిషలకు తావులేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవ్వరితోనైనా కొట్లాడే శక్తి మాకుంది. ఆ శక్తి ప్రజలే ఇచ్చారు. ప్రజాప్రయోజనాల కోసం ఒక మెట్టు దిగడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.



ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం

పదేళ్ల దిక్కుమాలిన విధానంతో ప్రజలకు శిక్ష

ఇటీవల ప్రధాని మోదీ వచ్చినప్పుడు.. తుమ్మిడిహెట్టి, మూసీ రివర్ ఫ్రంట్, మెట్రోరైలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల తదితర అంశాలపై విజ్ఞప్తి చేశామని, ఆయన సానుకూలంగా స్పందించినట్లు అనిపించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే కొందరు మాత్రం.. ముఖ్యమంత్రి ఏవిధంగా ప్రధానిని కలుస్తారని ప్రశ్నిస్తున్నారని సీఎం పేర్కొన్నారు. వాళ్లు పదేళ్లు దిక్కుమాలిన విధానాన్ని (కేంద్రంతో ఘర్షణ వైఖరిని) అనుసరించారని, దానికి శిక్ష ప్రజలకు పడిందని, వాళ్లు మాత్రం ఫామ్‌హౌజ్‌లు కట్టుకొని సంతోషంగా ఉన్నారని విమర్శించారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధి చెందాలంటే ఎలివేటెడ్ కారిడార్ పూర్తవ్వాల్సిందేనని చెప్పారు. 354 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్డు 50 శాతం మంజూరైందని, మిగతాది కూడా మంజూరైతే తెలంగాణకు మణిహారంగా ఉంటుందని ప్రధాని మోదీకి, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. యూపీఏ-1, యూపీఏ-2 హయాంలో నాటి సీఎం వైఎస్సార్ ఓఆర్ఆర్, ఎయిర్‌పోర్టు, మెట్రో వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపట్టారని, ఐటీ, ఫార్మా కంపెనీల నుంచి గణనీయంగా పెట్టుబడులు తీసుకొచ్చారని, దీనివల్లే హైదరాబాద్ మహానగరానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో 70 శాతం హైదరాబాద్ నుంచే వస్తుందంటే ఆనాడు కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలతోనే అన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్‌లో ఏదైనా ఒక శాశ్వత అభివృద్ధి ప్రాజెక్టును పూర్తి చేశారా అని ప్రశ్నించారు. నగరంలో వారు సాధించిన అభివృద్ధి గంజాయి, డ్రగ్స్, పబ్‌లేనని, ఇవి తప్ప పదేళ్లలో జరిగిందేమీ లేదని విమర్శించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడానికి వీలుగా పలు పథకాలు చేపట్టనున్నామని.. మెట్రో ఫేజ్-2లో 75 కి.మీ.ల పనులకు శంకుస్థాపన చేస్తామని, మూసీని 55 కి.మీ.ల మేర అభివృద్ధి చేయడానికి అధికారులకు ఆదేశాలిచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.



డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌ను ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్, మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి

దళిత బహుజనులకు అండగా..

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దళిత, బహుజనులు తెగించి కొట్లాడారని, వారికి తమ ప్రభుత్వం అనునిత్యం అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్-10లో రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌ను ముఖ్యమంత్రి గురువారం ప్రారంభించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తోపాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో సంస్కరణలకు బాబు జగ్జీవన్‌రామ్ కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జగ్జీవన్‌రామ్ కుమార్తె, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ కారణంగానే తెలంగాణ బిల్లుకు ఆమోదం లభించిందని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తాను సీఎంగా, తన క్యాబినెట్ సహచరులు మంత్రులుగా ఉన్నారంటే ఆమెనే కారణమన్నారు. కులపరమైన అంతరాలను నిర్మూలించటంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రతి నియోజకవర్గంలో ఒకే క్యాంపస్‌లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో చేపట్టే ఇందిరమ్మ ఇళ్లను కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి పక్కపక్కనే కట్టిస్తామని సీఎం తెలిపారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, చదువుపై పెట్టుబడి పెడితే.. అది తిరిగి సంపదను సృష్టిస్తోందన్నారు. తమ ప్రభుత్వంలో స్పీకర్, డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పదవులను దళిత వర్గాలకు కేటాయించి తగు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. గత ప్రభుత్వంలో ఏలిన దొరలు.. ఇప్పుడు అసెంబ్లీలో మైక్ కావాలంటే దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు విజ్ఞప్తి చేయాలని, ఆయన కరుణిస్తేనే వారికి అవకాశం లభిస్తుందన్నారు. 'కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. అధికారం ఒకసారి దొరల చేతిలో ఉంటే.. ఒకసారి దళితుల చేతుల్లో ఉంటుంది. నేడు రాష్ట్రంలో అధికారం దళితుల చేతుల్లో ఉంది' అని ముఖ్యమంత్రి చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కూడా దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని, ఆయన కుటుంబంపై రజాకార్లు దాడి చేసినా భయపడలేదని, ఖర్గే 50 ఏళ్లగా ప్రజల చేత వరుసగా ఎన్నికవుతున్న నాయకుడని సీఎం తెలిపారు. 10-15 ఏళ్ల కష్టపడి చదివితే మంచి ఉద్యోగాన్ని సాధించి 50 ఏళ్ల హాయిగా జీవించవచ్చని, లేకుంటే అదే 50 ఏళ్ల కష్టాలు ఎదుర్కొవాల్సి వస్తుందని విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హితబోధ చేశారు.

గత ప్రభుత్వం దళితుల్ని మోసగించింది: స్పీకర్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయకుండా దళితబంధు పేరిట దళితుల్ని మోసగించిందని స్పీకర్ గడ్డం ప్రసాద్ విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభయహస్తం పేరిట దళిత కుటుంబాలకు రూ.12 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేయటానికి, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్‌లో దానిని పొందుపర్చటానికి చర్యలు చేపట్టిందని వెల్లడించారు. కులాంతర వివాహం చేసుకున్న ఏడు జంటలకు సీఎం రేవంత్ రూ.2.5 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు.

13న ఎన్నికల షెడ్యూల్?

(మొదటిపేజీ తరువాయి)

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, సభలతో బిజీబిజీగా గడుపుతున్నారు. ప్రత్యర్థులపై వాడివేడి మాటలతో విరుచుకుపడుతున్నారు. ఇతర పార్టీలు కూడా సభలు, సమావేశాలతో దూసుకెళ్తున్నాయి.

ప్రారంభోత్సవాల్లో సీఎం.. పర్యటనల్లో బీఆర్‌ఎస్, బీజేపీ

సీఎం రేవంత్‌రెడ్డి రోజూ కీలక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడితే కోడ్ ఆటంకంగా మారుతుందన్న ఉద్దేశంతో పలు కార్యక్రమాలను ప్రారంభించేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో అల్వాల్ వద్ద ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే బంజారాహిల్స్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. శుక్రవారం (8వ తేదీన) ఓల్డ్ సిటీ మెట్రో రైల్ ప్రాజెక్టు పనులకు ఫరూక్‌నగర్ వద్ద శంకుస్థాపన చేయనున్నారు. మీరాలం ట్యాంకు వద్ద ఎస్‌టీపీ(మురుగునీటి శుద్ధి కేంద్రం), గోల్కొండ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. శనివారం (9న) బైరామల్‌గూడ ఫ్లై-ఓవర్‌ను ప్రారంభించి, ఉప్పల్‌లో నల్ల చెరువు ఎస్‌టీపీని ప్రారంభిస్తారు. బోయినపల్లి నుంచి ఆదిలాబాద్ మీదుగా నాగ్‌పూర్ వెళ్లే 44వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మించే ఎలివేటెడ్ కారిడార్‌కు సికింద్రాబాద్ వద్ద శంకుస్థాపన చేస్తారు. 11న భద్రాచలంలో వివిధ పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. 12న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో స్వయం సహాయక బృందాల మహిళలతో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సులో పాల్గొంటారు. ఇలా సీఎం 12 వరకూ బిజీ బిజీగా గడపనున్నారు. మరోవైపు.. బీజేపీ, బీఆర్‌ఎస్ కీలక నేతలు వివిధ జిల్లాల్లో పర్యటిస్తూ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తున్నారు. ప్రజలను ఓట్లు అడిగే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బీఆర్‌ఎస్ నుంచి కేటీఆర్, హరీశ్‌రావు, బీజేపీ నుంచి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

అధికారుల హడావుడి ఇలా..

రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లు కూడా అప్రమత్తమయ్యారు. ప్రభుత్వం నుంచి అందుతున్న అంతర్గత సందేశాల మేరకు చిన్న చిన్న ప్రారంభోత్సవాలను పూర్తికానిచ్చే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాల స్థాయిలో పూర్తిచేయాల్సిన పనుల వేగవంతంపై దృష్టి సారిస్తున్నారు. ఈ నెల 12వ తేదీకల్లా ఆయా పనులను పూర్తిచేసి ప్రారంభించడానికి కలెక్టర్లు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రస్థాయి కమిషనర్లు, డైరెక్టర్లు కింది స్థాయి అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్లు రెవెన్యూ సిబ్బందికి సెలవులను సైతం రద్దు చేస్తున్నారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఎవరూ సెలవు పెట్టడానికి వీల్లేదంటూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ గురువారం అంతర్గత ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉన్నదని వాటిలో పేర్కొన్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఉన్న ఇతర జిల్లాల్లోనూ కలెక్టర్లు ఇలాంటి ఆదేశాలే జారీచేసినట్లు తెలిసింది.

9 పేర్లు ఖరారు!

కాంగ్రెస్ అభ్యర్థులుగా వంశీచంద్‌రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి, బొంతు రామ్మోహన్, సురేష్ షెట్కార్, జీవన్‌రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, నీలం మధు, రఘువీర్‌రెడ్డి!

- కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో నిర్ణయం
- నేడు తొలి జాబితా విడుదల!
- తెలంగాణ సహా పలు రాష్ట్రాలలోని 60 స్థానాలకు అభ్యర్థుల ఎంపిక

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాలలో తొమ్మిది స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు అభ్యర్థుల తొలి జాబితాను శుక్రవారం విడుదల చేసే అవకాశం ఉంది. మహబూబ్‌నగర్ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి, చేవెళ్ల నుంచి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ నుంచి బొంతు రామ్మోహన్, జహీరాబాద్ నుంచి సురేష్ షెట్కార్, నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణ, మల్కాజ్‌గిరి నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, మెదక్ నుంచి నీలం మధు, నల్గొండ నుంచి జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డిని అభ్యర్థులుగా నిర్ణయించినట్లు సమాచారం. మహబూబాబాద్ నుంచి మాజీ మంత్రి బలరాంనాయక్ వైపే అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గురువారం సాయంత్రం ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశం జరిగింది. పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో పార్టీ అగ్రనేత సోనియాగాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్, ముఖ్యనేతలు జైరాం రమేష్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధిర్ రంజన్ చౌదరి, అంబికా సోని, ముకుల్ వాస్నిక్, టీఎస్ సింగ్ దేవ్‌తోపాటు సీఈసీ సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణతో సహా పది రాష్ట్రాలకు సంబంధించిన నియోజకవర్గాలలో అభ్యర్థులను నిర్ణయించేందుకు ఆయా రాష్ట్రాల నేతలతో కమిటీ విడివిడిగా సమావేశమైంది. కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఛత్తీస్‌గఢ్, హరియాణా, మేఘాలయ, త్రిపుర, సిక్కిం, మణిపూర్ రాష్ట్రాలలో 60 సీట్లకు అభ్యర్థులను ఖరారు చేయడంపై దృష్టి సారించారు. తొలుత తెలంగాణకు సంబంధించి కమిటీ సమావేశమైంది. రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమైన సమావేశం దాదాపు అర గంట పాటు సాగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీప్‌దాస్ మున్షీ తదితరులు పాల్గొన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఉన్న రాహుల్‌గాంధీ వర్చువల్‌గా పాల్గొన్నారు. తెలంగాణలోని మొత్తం 17 సీట్లకు గాను తొమ్మిది సీట్లకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది.

ఖమ్మం, భువనగిరి, నాగర్‌కర్నూల్ పెండింగ్

ఖమ్మం, భువనగిరి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలలో అభ్యర్థుల ఎంపికపై పీటముడి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఖమ్మం నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని టికెట్‌ను ఆశిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన తమ్ముడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు మంత్రి తుమ్మల కూడా తన కుమారుడు యుగంధర్‌కు టికెట్ అడుగుతున్నారు. నాగర్ కర్నూల్ సీటుకు డిప్యూటీ సీఎం సోదరుడు మల్లు రవి పోటీ పడుతున్నారు. టికెట్ కోసం ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవికి కూడా రాజీనామా చేసినట్లు ఆయన ప్రకటించారు. రెండు రోజుల కిందట పార్టీ చీఫ్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసి టికెట్ కోసం విజ్ఞప్తి చేశారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డితో కూడా ఆయన భేటీ అయి టికెట్‌పై చర్చించారు. గత ఎన్నికలలో అలంపూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మాదిగ కోటాలో నాగర్‌కర్నూల్ సీటు తనకు కేటాయించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే భువనగిరి నుంచి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన భార్యకు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి ఇక్కడి నుంచే పోటీకి సిద్ధంగా ఉన్నారు. కరీంనగర్ నుంచి ప్రవీణ్‌రెడ్డి, హైదరాబాద్ నుంచి మస్కతితో పాటు ఒక ముస్లిం మహిళా అభ్యర్థి, వరంగల్ నుంచి దొమ్మాట సాంబయ్య పేర్లు అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఆదిలాబాద్ నుంచి అభ్యర్థిని ఖరారు చేసేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

తొలి జాబితాలోనే రాహుల్!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎక్కడి నుంచి పోటీ చేయనున్నారో ఆ పార్టీ తొలిజాబితా ద్వారా వెల్లడి కానుంది. రాహుల్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్నది జాబితా ద్వారా తెలుపుతామని సీఈసీ సభ్యుడు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశనంతరం తెలిపారు. త్వరలో తొలి జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందన్నారు.

ఢిల్లీలో సీఎం రేవంత్

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వచ్చిన సీఎం.. కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం అనంతరం యమునా బ్లాక్‌లో ఉన్న తన నివాసానికి వెళ్లారు.

కలిసి గెలుద్దాం

కీలక దశకు టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు

- మాకు ఎక్కువ ఎంపీ సీట్లు ఇవ్వండి
- 370 స్థానాలు లక్ష్యంగా పెట్టుకున్నాం
- అమిత్ షా, నడ్డా ప్రతిపాదన
- చంద్రబాబు, పవన్‌తో భేటీ

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు అంశం కీలక దశకు చేరుకుంది. పొత్తులో భాగంగా బీజేపీకి ఎన్ని స్థానాలు ఇవ్వాలనే అంశంపై ఢిల్లీలో సుదీర్ఘ చర్చలు జరిగాయి. బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆహ్వానం మేరకు తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు గురువారం సాయంత్రం 5 గంటలకు ఢిల్లీకి చేరుకున్నారు. రాత్రి 8 గంటలకు జనసేన అధిపతి పవన్ కల్యాణ్ కూడా ఢిల్లీకి వచ్చారు. ఇద్దరూ కలిసి రాత్రి 10.30 గంటల సమయంలో అమిత్‌షాతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. గంటన్నర పాటు ఈ భేటీ జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... తమకు వీలైనన్ని ఎక్కువ లోక్‌సభ స్థానాలు కేటాయించాలని అమిత్ షా, నడ్డా కోరారు. వాటిని గెలిపించుకునేందుకు గట్టిగా కృషి చేద్దామన్నారు. 8 నుంచి 10 లోక్‌సభ స్థానాలు తమకు కేటాయించాలని బీజేపీ పెద్దలు కోరినట్లు తెలిసింది. "అసెంబ్లీలో మీరు సాధ్యమైనన్ని సీట్లు గెలిచి అధికారంలోకి రావాలని మాకు తెలుసు. లోక్‌సభలో కనీసం 370 స్థానాలు నెగ్గాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. అందువల్ల ప్రతి మిత్రపక్షం నుంచి సాధ్యమైనన్ని ఎక్కువగా అడుగుతున్నాం" అని బీజేపీ నేతలు చెప్పినట్లు తెలిసింది. అయితే... బీజేపీ ఆశిస్తున్నన్ని స్థానాలు కాకుండా బీజేపీ 4 లోక్‌సభ, 6 అసెంబ్లీ సీట్లలో పోటీ చేస్తే గెలిచే అవకాశాలు కచ్చితంగా ఉన్నాయని చంద్రబాబు, పవన్ పేర్కొన్నట్లు సమాచారం. ఆ తర్వాత ఒక రాజ్యసభ స్థానాన్ని కూడా కేటాయించవచ్చునని చెప్పినట్లు తెలిసింది. గెలవలేని సీట్లు తీసుకోవడంవల్ల అక్కడ వైసీపీకి ప్రయోజనం కలుగుతుందని కూడా అభిప్రాయపడినట్లు సమాచారం. అమిత్ షాను కలిసేముందు పార్టీ నేతలు రామ్మోహన్ నాయుడు, కనకమేడల రవీంద్ర కుమార్, రఘురామకృష్ణం రాజు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, లావు కృష్ణదేవరాయలు తదితరులతో చంద్రబాబు చర్చలు జరిపారు.

రాష్ట్ర బీజేపీ నేతలతో సమీక్ష...

అమిత్ షా, నడ్డా, రాష్ట్ర సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి మధుకర్.. రాష్ట్ర బీజేపీ నేతలతో బుధవారమే సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని సీట్లకు పోటీ చేయాలన్న విషయంపై రాత్రి పొద్దుపోయేదాకా చర్చించారు. విజయావకాశాలు ఉన్న సీట్ల గురించి స్పష్టమైన అంచనాకు రావాలని ఆదేశించారు. దీంతో రాష్ట్ర బీజేపీ నేతలు గురువారం మరోమారు ఢిల్లీలో సమావేశమయ్యారు. పొత్తులో భాగంగా టీడీపీని పది లోక్‌సభ సీట్లు, 20 అసెంబ్లీ సీట్లు అడగాలని వారు అధిష్ఠానానికి ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే... అసెంబ్లీ సీట్లపై తమకు పెద్దగా ఆసక్తిలేదని, లోక్‌సభ సీట్లే వీలైనన్ని ఎక్కువగా అడగాలని అధిష్ఠానం పెద్దలు రాష్ట్ర నేతలకు చెప్పినట్లు తెలిసింది. కాగా, నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ప్రముఖసినీనటుడు కృష్ణంరాజు సతీమణి పేరును ప్రస్తావించినట్లు సమాచారం. శుక్రవారం కూడా ఢిల్లీలోనే ఉండాలని, చంద్రబాబు, పవన్‌లతో చర్చించిన తర్వాత మళ్లీ పిలిపిస్తామని రాష్ట్ర నేతలకు పార్టీ పెద్దలు చెప్పినట్లు తెలిసింది. తాము పోటీ చేయబోయే స్థానాలపై స్పష్టత వచ్చిన వెంటనే అభ్యర్థుల పేర్లతో సిద్ధంగా ఉండాలని చెప్పినట్లు సమాచారం.

30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

- డిగ్రీ లేదా డిప్లొమా ఉన్న 25 ఏళ్లలోపు వారందరికీ ఏడాదికి రూ. లక్ష స్టైపెండ్
- 5 గ్యారెంటీలు ప్రకటించిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మార్చి 7: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమకు అధికారమిస్తే దేశంలో డిగ్రీ లేదా డిప్లొమా ఉన్న 25 ఏళ్లలోపు వయసున్న ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.లక్ష అందిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. అలాగే దేశంలో ఖాళీగా ఉన్న 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. గురువారం భారత్ జోడో న్యాయ్‌యాత్రలో భాగంగా రాజస్థాన్‌లోని బాన్స్‌వాడలో ఓ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. యువతే లక్ష్యంగా 'యువ న్యాయ్' పేరిట ఐదు గ్యారంటీలను ప్రకటించారు. దేశంలోని యువతకు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కంపెనీల్లో అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని, అందుకు చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అప్రెంటిస్‌షిప్‌లో ఏడాది శిక్షణ ఇస్తామని, ఆ సమయంలో రూ.1 లక్ష స్టైపెండ్ ఇస్తామని ప్రకటించారు. పేపరు లీకేజీలను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని, అందుకు చట్టం తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే నేరుగా పోటీ పరీక్షలను నిర్వహిస్తుందని చెప్పారు. ట్రక్కు డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, కార్పెంటర్లు, మెకానిక్‌లు..వంటి గిగ్ వర్కర్లకు సామాజిక భద్రతకు చట్టం చేస్తామన్నారు. రూ.5వేల కోట్ల స్టార్టప్ నిధిని ఏర్పాటు చేస్తామని, కొత్తగా వ్యాపారం మొదలుపెట్టే 40ఏళ్ల లోపు వారికి ఈ నిధులను పంపిణీ చేస్తామన్నారు.

ఎస్‌బీఐపై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)కి వ్యతిరేకంగా కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఎన్నికల బాండ్ల వివరాల సమర్పణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ముగిసిన నేపథ్యంలో అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫామ్స్(ఏడీఆర్), కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థలు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ద్వారా గురువారం ఈ మేరకు సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశాయి. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, వాటి వివరాలను వెల్లడించాల్సిందేనంటూ ఫిబ్రవరి 15న సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. మార్చి 6లోగా ఆ వివరాలను అందజేయాలని ఈ బాండ్లను జారీ చేసే ఎస్‌బీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే.. తమకు జూన్30 వరకు గడువు కావాలంటూ ఎస్‌బీఐ ఈ నెల 4న పిటిషన్ వేసింది. దీనిపై ఈ నెల 11న విచారణ జరగనుంది. అయితే.. గడువులోగా వివరాలను అందజేయకపోవడం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని ఏడీఆర్, కామన్ కాజ్ పేర్కొన్నాయి. తమ పిటిషన్‌ను ఎస్‌బీఐ వ్యాజ్యంతో కలిపి ఈ నెల11న విచారించాలని కోర్టును కోరాయి. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ధర్మాసనం ఈ విచారణ జరపనుంది. న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి.. ఆ మేరకు పిటిషన్‌ను ఈ-మెయిల్ చేయాలని, అందుకు సంబంధించిన ఆదేశాలను జారీ చేస్తామని పేర్కొన్నారు. కాగా.. ఎస్‌బీఐ గడువు కోరడాన్ని కాంగ్రెస్, సీపీఎం తప్పుబట్టాయి."ఎన్నికల బాండ్ల వివరాలు తెలుసుకోవాలని దేశం కోరుకుంటోంది. కానీ, ప్రధాని మోదీ మాత్రం ఆ వివరాలను దాచాలని చూస్తున్నారు" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో విమర్శించారు. ఎస్‌బీఐ తీరును తప్పుబడుతూ సీపీఎం పొలిట్‌బ్యూరో గురువారం ఓ ప్రకటనను విడుదల చేసింది. లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీకి లబ్ధి కలిగించేందుకే ఎస్‌బీఐ గడువు కోరుతోందని విమర్శించింది.

రష్యాకు పౌరుల అక్రమ తరలింపుపై సీబీఐ ఆరా

న్యూఢిల్లీ, మార్చి 7: ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధంలో రష్యా పక్షాన పాల్గొని హైదరాబాద్ వాసి ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం అందడంతో సీబీఐ అప్రమత్తమైంది. అధిక జీతాలకు ఉద్యోగాలు ఇప్పిస్తామన్న ఆశ చూపి సుమారు రెండు డజన్ల మందిని అక్రమంగా రష్యాకు తీసుకెళ్లి, వారితో బలవంతంగా యుద్ధం చేయిస్తున్నట్టు కూడా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇందుకు కారకులైన ఏజెంట్లపై సీబీఐ దృష్టి పెట్టింది. గురువారం ఏడు నగరాల్లో పది చోట్ల సోదాలు చేసింది. ఢిల్లీ, ముంబయి, చెన్నై, తిరువనంతపురం, అంబాలా, చండీగఢ్, మధురైల్లో సోదాలు చేసింది. అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తోంది.

'సీస్పేస్'.. కేరళ సర్కారు ఓటీటీ ప్లాట్‌ఫామ్

న్యూఢిల్లీ, మార్చి7: కేరళ ప్రభుత్వం ఓటీటీ రంగంలోకి అడుగుపెట్టింది. సీస్పేస్ పేరిట ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను గురువారం ప్రారంభించింది. రాష్ట్ర సీఎం పినరయి విజయన్ చేతులమీదుగా ఈ కార్యక్రమం జరిగింది. దీంతో దేశంలో ఓ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే తొలి ఓటీటీగా సీస్పేస్ నిలిచింది. కేరళ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నేతృత్వంలోని సీస్పేస్ లో ప్రస్తుతం 35సినిమాలు, 7డాక్యుమెంటరీలు, ఓ షార్ట్ ఫిలిం అందుబాటులో ఉండగా.. ఈ కంటెంట్‌ను చూసేందుకు ఒక్కో సినిమాకు రూ.75చెల్లించాలి.

370 రద్దుతో సంకెళ్లు తెగాయ్!

స్వేచ్ఛావాయువులు పీలుస్తున్న జమ్మూకశ్మీరు: ప్రధాని.. అభివృద్ధిలో కొత్త శిఖరాలకు చేరుతోంది

- రాష్ట్రాన్ని 2 కేంద్రపాలిత ప్రాంతాలు చేశాక తొలిసారి శ్రీనగర్‌లో పర్యటన
- రూ.5 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం

శ్రీనగర్, మార్చి 7: రాజ్యాంగంలోని 370 అధికరణ రద్దుతో జమ్మూకశ్మీరు సంకెళ్లు తెగిపోయాయని ప్రధాని మోదీ అన్నారు. స్వేచ్ఛావాయువులు పీలుస్తోందని.. అభివృద్ధిలో నూతన శిఖరాలను అందుకుంటోందని చెప్పారు. 'వికసిత్ భారత్-వికసిత్ జమ్మూకశ్మీరు' పేరిట గురువారమిక్కడ నిర్వహించిన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. 2019లో 370 రద్దు, రాష్ట్రాన్ని జమ్మూకశ్మీరు, లదాఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చాక ఆయన శ్రీనగర్ రావడం ఇదే మొదటిసారి. వ్యవసాయ-ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే రూ.5 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు. వీటితో జమ్మూకశ్మీరు మరింత పురోగతి సాధిస్తుందన్నారు. ప్రజల హృదయాలు గెలుచుకోవడానికి తాను ఇక్కడకు వచ్చానని తెలిపారు. 370 రద్దుతో కశ్మీరీ యువతకు తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభించిందని.. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. వారికి కొత్త అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. 'ఇవాళ అందరికీ సమాన హక్కులు, సమాన చాన్సులు వస్తున్నాయి. జమ్మూకశ్మీరు దేశానికి మణికిరీటంలాంటిది. పర్యాటక రంగ అభివృద్ధి, రైతుల సాధికారత, యువ నాయకత్వంతో ఈ ప్రాంతం అభివృద్ధి పథాన నడుస్తుంది. ఇది కేవలం ఓ ప్రాంతం కాదు. దేశానికి తలవంటిది. ఇక్కడ 40 పర్యాటక ప్రాంతాలను గుర్తించాం' అని వెల్లడించారు. జమ్మూకశ్మీరు కుటుంబ రాజకీయాలకు బలైందని.. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కుటుంబ రాజకీయాలపైనే దృష్టిపెట్టాయని.. అవినీతిని ప్రోత్సహించాయని ధ్వజమెత్తారు. తనకు కుటుంబం లేదని ఆర్‌జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను మోదీ మళ్లీ ప్రస్తావించారు. యావత్ జమ్మూకశ్మీరు ప్రజలు తన కుటుంబ సభ్యులేనన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఏమైనా చేస్తానన్నారు. ప్రజలకు మహాశివరాత్రితో పాటు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రసంగాన్ని ముగించారు. ప్రధాని ప్రారంభించిన అభివృద్ధి ప్రాజెక్టుల్లో రూ.1,400 కోట్ల విలువైన 'స్వదేశీ దర్శన్', 'ప్రసాద్' స్కీంలు, హజ్రత్‌బాల్ దర్గా సమగ్రాభివృద్ధి పథకాలు కూడా ఉన్నాయి. కొత్తగా జమ్మూకశ్మీరు ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులైన 1,000 మందికి మోదీ నియామక పత్రాలు అందజేశారు.

శంకరాచార్య హిల్‌కు మోదీ ప్రణామం

శ్రీనగర్ పర్యటనలో మోదీ తొలుత ఇక్కడి ప్రసిద్ధ 'శంకరాచార్య హిల్'కు చేతులు జోడించి ప్రణామం చేశారు. ఆ ఫొటోలను ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. శ్రీనగర్‌లోని జబర్వాన్ కొండలపైన ఆదిశంకరాచార్య ఆలయం ఉంది. ఏటా ఏప్రిల్‌లో ఆలయ ప్రతిబింబం దాల్ సరస్సులో కనువిందు చేస్తుంది. కాగా, తన 'మిత్రుడు నజీంతో చిరస్మరణీయ సెల్ఫీ' అంటూ మోదీ సోషల్ మీడియాలో ఆసక్తికరమైన పోస్టు పెట్టారు. 'నజీం చేసే గొప్ప పని నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది' అని ట్వీట్ చేశారు. పుల్వామాకు చెందిన నజీం 2018 నుంచి తేనె వ్యాపారం చేస్తున్నారు.


శ్రీనగర్‌లో ఓ స్టాల్‌ను సందర్శించిన మోదీ

తెలంగాణలో 2 అభివృద్ధి పనులకు..

వికారాబాద్, భువనగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖమైన రెండు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండలను ఎకో టూరిజం జోన్‌గా అభివృద్ధి చేసే పనులకు, యాదాద్రి భువనగిరి జిల్లా మొదటి దశ అభివృద్ధి పనులకు గురువారం శ్రీనగర్ నుంచి మోదీ శంకుస్థాపన చేశారు. అనంతగిరి కొండలను ఎకో టూరిజం జోన్‌గా అభివృద్ధి పరిచే పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం 137.92కోట్లు. ఇందులో మొదటి ప్యాకేజీకి రూ.30.65 కోట్లు, రెండో ప్యాకేజీకి రూ.68.81కోట్లు, మూడో ప్యాకేజీకి రూ.9.87కోట్లు, నాలుగో ప్యాకేజీకి రూ.2.8కోట్ల చొప్పు న ఖర్చు చేస్తారు. మొదటి ప్యాకేజీల గ్లాంపింగ్(గ్లామరస్ క్యాంపింగ్) జోన్లు, అంతర్గత మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు, కనీస సౌకర్యాలు, క్యాంపస్ చుట్టూ ఫెన్సింగ్, ఈ-వెహికిల్ అండ్ చార్జింగ్ స్టేషన్, సైకిళ్లు, సైకిల్ పార్కింగ్ పనులు చేపడతారు. రెండో ప్యాకేజీ కింద అడ్వంచర్ పార్క్, గ్రీన్ బఫర్ జోన్, ఎంఐసీఈ అండ్ ఎంట్రెన్స్ ప్లాజా, రిసార్ట్ జోన్, నేచర్ కేర్ సెంటర్, బొటానికల్ గార్డెన్, మూడో ప్యాకేజీ కింద కోట్‌పల్లి రిజర్వాయర్, అనంత పద్మనాభస్వామి ఆలయం వద్ద అభివృద్ధి పనులు, నాలుగో ప్యాకేజీ కింద అనంతగిరి పర్యాటకులు, సందర్శకుల సౌకర్యం కోసం వాట్సాప్ చాట్‌బాట్, డిజిటల్ ప్లాట్‌ఫారం రూపొందించనున్నారు. ఇక భువనగిరి కోట అభివృద్ధి కోసం కేంద్రం రూ.118 కోట్లు కేటాయించి.. తొలి దశ కింద రూ.69 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రోప్‌వే, పార్కింగ్ వసతి, ప్రారంభ ద్వారం, పర్యాటకులకు వసతులు, హరితవనాలు తదితర పనులు చేపట్టనున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4% డీఏ

- 50 శాతానికి చేరనున్న కరువు భత్యం.. జనవరి నుంచి వర్తింపు
- 'ఈశాన్యం'లో పారిశ్రామికాభివృద్ధికి రూ.10వేల కోట్లతో 'ఉన్నతి'
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ, మార్చి 7: సాధారణ ఎన్నికల ముంగిట వివిధ వర్గాలపై కేంద్రం ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. గురువారం కేబినెట్ భేటీ అనంతరం ఈ వివరాలను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ)ను 4శాతం పెంచారు. ఏడో కేంద్ర వేతన సంఘం సిఫారసులమేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం డీఏ 46% ఉండగా పెంపు తర్వాత 50 శాతానికి చేరనుంది. ఈ ఏడాది జనవరి1 నుంచి ఇది అమల్లోకిరానుంది. దీంతో 49.18 లక్షల మంది ఉద్యోగులు, 67.95 లక్షలమంది పింఛనర్లకు లబ్ధి జరగనుంది. డీఏ పెంపుతో ఏటా ఖజానాపై రూ.12,869 కోట్ల భారం పడనుంది. మరోవైపు డీఏ పెంపు రవాణా భత్యం, క్యాంటీన్ అలవెన్స్, డిప్యుటేషన్ అలవెన్స్ 25% పెరిగాయి. ఇంటి అద్దె భత్యం శ్లాబుల వారీగా 27% నుంచి 30కి, 19 నుంచి 20కి, 9 నుంచి 10 శాతానికి చేరింది. గ్రాట్యుటీ ప్రయోజనాల పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారు. కాగా, కృత్రిమ మేధ (ఏఐ)లో అభివృద్ధి, పరిశోధనలకు రూ.10,372 కోట్లతో ఇండియా ఏఐ మిషన్‌ను కేంద్రం నెలకొల్పనుంది. ఈ నిధులతో ఐదేళ్లలో ప్రభుత్వం-ప్రైవేటు భాగస్వామ్యంతో యువతకు శిక్షణ, ఆవిష్కరణ కేంద్రాల ఏర్పాటు, కంప్యూటింగ్ మౌలిక వసతులను కల్పించనున్నారు. ఉజ్వల పథకం కింద నిరుపేద మహిళలకు అందిస్తున్న రూ.300 రాయితీని కేంద్రం వచ్చే ఏడాది మార్చి 31వరకు పొడిగించింది. పది కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకంతో రూ.12 వేల కోట్ల భారం పడనుంది. ఇక ఈశాన్య భారత్‌లో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించేందుకు 'ఉన్నతి' పేరిట రూ.10,037 కోట్లతో పారిశ్రామికాభివృద్ధి పథకాన్ని ప్రకటించింది. ముడి జనపనార మద్దతు ధరను క్వింటాకు రూ.285 పెంచారు. దీంతో క్వింటా ధర రూ.5,335కు చేరనుంది. గోవా అసెంబ్లీలో షెడ్యూల్ తెగ (ఎస్టీ)లకు రిజర్వేషన్లు కల్పించే బిల్లు పెట్టేందుకు ఆమోదం తెలిపింది. కాగా ఐదోతరం స్టెల్త్ ఫైటర్ విమానాలకు సంబంధించి డీఆర్‌డీఓ ప్రతిపాదనను భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది. దీనికి రూ.15 వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా. సైన్యం, కోస్ట్ గార్డుకు కొత్తగా 34 ధ్రువ్ హెలికాప్టర్లు సమకూర్చే ప్రతిపాదనకూ కమిటీ ఆమోదం తెలిపింది.

గుప్త నిధుల అడ్డాగా ఎన్నికల బాండ్లు

- జాతీయపార్టీలకు గుప్త మార్గాల్లో రూ.1,832 కోట్లు
- 2022-23లో పార్టీలకు అందిన విరాళాల ఆధారంగా ఏడీఆర్ నివేదిక విడుదల

న్యూఢిల్లీ, మార్చి 7: జాతీయ పార్టీలకు గుప్త మార్గాల్లో అందిన నిధుల్లో 82.42% ఎన్నికల బాండ్ల రూపంలోనే లభించాయని స్వతంత్ర ప్రజాస్వామ్య వేదిక ఏడీఆర్ (అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) తెలిపింది. 2022-23 సంవత్సరానికి జాతీయ పార్టీలు ఈసీకి సమర్పించిన విరాళాల జాబితా, ఆడిట్ నివేదికలను పరిశీలిస్తే ఈ విషయం తెలిసిందని వివరించింది. ఆ ఏడాది ఈ పార్టీలకు అందిన విరాళాల్లో మొత్తం రూ.1,832.88 కోట్లు గుప్త మార్గంలో అందగా, అందులో రూ.1,510 కోట్లు ఎన్నిల బాండ్ల రూపంలో లభించాయని తెలిపింది. బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, బీఎస్పీ, ఆప్, నేషనల్ పీపుల్స్ పార్టీల (ఎన్‌పీపీ) ఆడిట్, ఇతర ఆర్థిక వివరాలపై సేకరించిన సమాచారం ఆధారంగా ఏడీఆర్ తన నివేదికను తయారుచేసింది. దీనిని అనుసరించి.. ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు అందుకు న్న పార్టీల్లో బీజేపీ ముందు వరుసలో ఉంది. 2022-23లో జాతీయ పార్టీలు ఆర్జించిన మొత్తం ఆదాయంలో బీజేపీ కి రూ.1,400 కోట్లు (76.39%) ఈ రూపంలోనే లభించాయని తెలిపింది. ఇక.. కాంగ్రెస్‌కు రూ.315.11 కోట్లు (17.19%) లభించాయని ఏడీఆర్ పేర్కొంది. వలంటరీ కంట్రిబ్యూషన్లు/కూపన్ల అమ్మకం/ఎన్నికల బాండ్లు, గుప్త మార్గాల్లో తమకు రూపాయి కూడా అందలేదని బీఎస్పీ ప్రకటించిందని వెల్లడించింది. అయితే, బ్యాంకు వడ్డీ, సభ్యత్వ రుసుం, స్థిరాస్తి అమ్మకాలు తదితర మార్గాల్లో బీఎస్పీకి రూ.29.27 కోట్ల ఆదాయం లభించిందని పేర్కొంది. కూపన్ల అమ్మకం ద్వారా తమకు రూ.136.79 కోట్లు లభించాయని కాంగ్రెస్, సీపీఎం తెలిపాయని పేర్కొంది. ఎన్నికల బాండ్ల వినియోగంలో జాతీయ పార్టీల ప్రస్తావన ప్రముఖంగా కనిపించినా, ప్రాంతీయ పార్టీలూ గణనీయమైన స్థాయిలోనే ఈ నిధులను పొందుతున్నాయని ఏడీఆర్ వెల్లడించింది.

అక్కడి ఘటనలపై మోదీ నోరు మెదపరు

- యూపీ, మణిపూర్‌లలో మహిళలపై దారుణమైన అకృత్యాలు
- సందేశ్‌ఖాలీపై బీజేపీ వదంతులను వ్యాపింపజేస్తోంది: మమతా బెనర్జీ

కోల్‌కతా, మార్చి 7: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరిగే అకృత్యాల గురించి నోరు మెదపని ప్రధాని నరేంద్రమోదీ.. బెంగాల్ విషయంలో మాత్రం తమకు పాఠాలు చెబుతున్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ విమర్శించారు. సందేశ్‌ఖాలీ ఘటనలపై బీజేపీ పెద్ద ఎత్తున వదంతులను వ్యాపింపజేస్తోందని, వాస్తవానికి దేశంలోనే మహిళలకు పశ్చిమ బెంగాల్ అత్యంత సురక్షిత ప్రాంతమని మమత తెలిపారు. గురువారం కోల్‌కతాలో 'మహిళల హక్కులకు కట్టుబడి ఉన్నాం' అనే పేరుతో తృణమూల్ నిర్వహించిన మహిళా ర్యాలీలో మమత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్యాయాలు, అకృత్యాల గురించి తమకు తెలిసినప్పుడు వాటిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, తమ పార్టీకి చెందిన వారు తప్పు చేసినా వదిలిపెట్టమని హెచ్చరించారు. అయితే, సందేశ్‌ఖాలీ ఘటనలపై పలువురు తప్పుడు సందేశాలు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. 'నిన్న ఇక్కడికి వచ్చి మహిళల మీద బెంగాల్‌లో జరుగుతున్న అకృత్యాల గురించి మాకు బోధనలు చేశారు. కానీ, యూపీలో మహిళల మీద అత్యం త దారుణమైన అత్యాచారాలు జరుగుతున్నాయి. మణిపూర్‌లో మన బిడ్డలను రేప్ చేసి కాల్చి చంపుతున్నారు. దీనికి బీజేపీ సిగ్గుపడాలి' అని మమత పేర్కొన్నారు.



జెలెన్‌స్కీ, గ్రీస్ ప్రధాని కిరియాకోస్ సమీపంలో

రష్యా క్షిపణి దాడి

- కాన్వాయ్‌కు 500 మీటర్ల దూరంలోనే ఘటన
- ఐదుగురి మృతి.. పలువురికి తీవ్ర గాయాలు

ఒడెస్సా, మార్చి 7: ఉక్రెయిన్-రష్యా యుద్ధం మరింత ఉద్రిక్తతలకు దారితీసే పరిణామం త్రుటిలో తప్పింది. నాటో సభ్య దేశమైన గ్రీస్ ప్రధాని కిరియాకోస్ మిత్సొటకిస్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కాన్వాయ్‌కి 500మీటర్ల దూరంలో క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. రష్యా తమపై యుద్ధానికి దిగి రెండేళ్లయిన సందర్భంగా జెలెన్‌స్కీ మిత్రదేశాల నాయకులను పిలిచి జరిగిన నష్టాన్ని వారికి వివరిస్తున్నారు. ఈ క్రమంలో కిరియాకోస్‌ను నల్ల సముద్ర తీర నగరం ఒడెస్సా సందర్శనకు తీసుకెళ్లారు. పర్యటన ముగించుకుని దేశాధినేతలిద్దరూ వాహనాల్లోకి ఎక్కబోతుండగా సమీపంలో క్షిపణి దాడి జరిగింది. వీరికి ఎలాంటి గాయాలు కాలేదు. దీనిపై జెలెన్‌స్కీ స్పందిస్తూ.. గగనతల రక్షణ వ్యవస్థ ద్వారానే తమను తాము రక్షించుకోగలమన్నారు. కాగా, క్షిపణితో ఒడెస్సాలోని హ్యాంగర్‌పై దాడి చేశామని, అక్కడ యుద్ధంలో వాడేందుకు మానవరహిత బోట్ల తయారీ జరుగుతోందని రష్యా వెల్లడించింది. ఒడెస్సా. దక్షిణ ఉక్రెయిన్ నౌకా దళానికి ప్రధాన స్థావరం.

యూకో బ్యాంకులో రూ.820 కోట్ల స్కాం

న్యూఢిల్లీ, మార్చి 7: యూకో బ్యాంకులో రూ.820 కోట్ల అనుమానాస్పద ఐఎంపీఎస్ లావాదేవీలకు సంబంధించి సీబీఐ దర్యాప్తు వేగవంతమైంది. గురువారం మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఏడు నగరాల్లోని 67 ప్రాంతాల్లో దర్యాప్తు బృందాలు తనిఖీలు నిర్వహించాయి. గతేడాది నవంబరు 10-13 తేదీల మధ్యలో 8,53,049 ఐఎంపీఎస్ లావాదేవీలు జరిగాయి. "ఏడు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన 14,600 మంది ఖాతాదారుల నుంచి ఐఎంపీఎస్ విధానంలో 41వేల మందికి పైగా యూకో బ్యాంకు ఖాతాదారుల ఖాతాల్లో రూ.820కోట్లు అక్రమంగా జమ చేశారు. అయితే ఈ మొత్తం ప్రైవేట్ బ్యాంకుల ఖాతాల్లో మాత్రం డెబిట్ కాలేదు" అని సీబీఐ ప్రతినిధి ఒకరు తెలిపారు. రాజస్థాన్, మహారాష్ట్రల్లో తమ ఖాతాలో పొరపాటుగా జమ అయిన డబ్బును విత్‌డ్రా చేసుకొని తిరిగి బ్యాంకుకు చెల్లించని వ్యక్తుల ఇళ్లల్లో తాజాగా సోదాలు చేపట్టినట్లు ఆయన వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.


ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 8 మార్చి 2024

టీఎస్ ఐసెట్ నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఐసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షని వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మాక్ టెస్ట్‌ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు అందిస్తున్న యూనివర్సిటీలు

- ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్
- కాకతీయ యూనివర్సిటీ, వరంగల్
- మహాత్మాగాంధీ యూనివర్సిటీ, నల్లగొండ
- పాలమూరు యూనివర్సిటీ, మహబూబ్‌నగర్
- శాతవాహన యూనివర్సిటీ, కరీంనగర్
- తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్
- డా.బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్
- ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, హైదరాబాద్
- జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్



అర్హత: ఎంబీఏలో ప్రవేశానికి ద్వితీయశ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ/బీబీఏ/బీబీఎం/బీసీఏ/బీఈ/బీటెక్/బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంసీఏలో ప్రవేశానికి మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసి ఉండాలి.
- ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; డిస్టెన్స్/ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానాల్లో డిగ్రీ చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.
- అభ్యర్థుల వయసు 2024 మార్చి 5 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

టీఎస్ ఐసెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. మొత్తం మార్కులు 200. ఈ పరీక్షలో మూడు సెక్షన్‌లు ఉంటాయి. అనలిటికల్ ఎబిలిటీ సెక్షన్‌లో డేటా సఫిషియెన్సీ నుంచి 20 ప్రశ్నలు, ప్రాబ్లం సాల్వింగ్ (సిరీస్, డేటా అనాలిసిస్, కోడింగ్ అండ్ డీకోడింగ్, డేట్, టైం, అరేంజ్‌మెంట్) అంశాల నుంచి 55 ప్రశ్నలు; మేథమెటిక్ ఎబిలిటీ సెక్షన్‌లో అర్థమెటికల్ ఎబిలిటీ నుంచి 35, ఆల్జీబ్రిక్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ నుంచి 30, స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి 10 ప్రశ్నలు; కమ్యూనికేషన్ ఎబిలిటీ సెక్షన్‌లో మీనింగ్స్, సినోనమ్స్-ఆంటోనమ్స్, వర్బ్(టెన్స్-వాయిస్), ఫ్రేజల్ వర్బ్స్-ఇడియమ్స్, ఆర్టికల్స్-ప్రిపోజిషన్స్, కంప్యూటర్ టర్మినాలజీ, బిజినెస్ టర్మినాలజీ అంశాల నుంచి ఒక్కోదానిలో 5 ప్రశ్నలు, కాంప్రహెన్షన్ నుంచి 15 ప్రశ్నలు అడుగుతారు. కమ్యూనికేటివ్ ఎబిలిటీ ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఇస్తారు. మిగిలిన ప్రశ్నలను ఇంగ్లీష్-తెలుగు, ఇంగ్లీష్-ఉర్దూ మాధ్యమాల్లో ఇస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.750; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.550
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 17 నుంచి 20 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 28 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, కోదాడ, మహబూబ్‌నగర్, సత్తుపల్లి, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, నర్సంపేట్, వరంగల్, కర్నూలు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **టీఎస్ ఐసెట్ తేదీలు:** జూన్ 4, 5
- **వెబ్‌సైట్:** https://icet.tsche.ac.in

నిట్ వరంగల్‌లో పీజీ, పీహెచ్‌డీ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్ వరంగల్)- ఎంబీఏ, ఎంటెక్(సెల్ఫ్ ఫైనాన్స్), పీహెచ్‌డీ జూలై సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడి విడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఆసక్తి గల అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. ● వెబ్‌సైట్: *www.nitw.ac.in*

ఎంబీఏ

సంస్థ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్) ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తుంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫండమెంటల్ కోర్సులు, ల్యాబ్స్, నాన్ క్రెడిట్ కోర్సులు, సమ్మర్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. క్యాట్/మ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 77 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కాలేజీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. క్యాట్/మ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 16

గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల: ఏప్రిల్ 30

గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు: మే 20 నుంచి 22 వరకు

ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: మే 31

పీహెచ్‌డీ

ఫుల్ టైం, పార్ట్ టైం విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. మొత్తం 13 కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో ఇన్‌స్టిట్యూట్ ఫెలోషిప్, ప్రభుత్వ ఫెలోషిప్, ప్రాజెక్ట్ ఫెలోస్, స్పాన్సర్డ్, ఎక్స్‌టర్నల్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ తదితర కేటగిరీలు; పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో పర్మినెంట్ ఫ్యాకల్టీ కేటగిరీలు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ, అనుభవం, జాతీయ పరీక్ష స్కోర్ (గేట్/నెట్/ఇన్‌స్పయిర్) ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి మెరిట్ ప్రకారం అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఫుల్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. డాక్టోరల్ కమిటీ అనుమతి మేరకు మరో ఏడాది పొడిగించే వీలుంది.

విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్



అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/ఎంఎస్-రీసెర్చ్ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమశ్రేణి మార్కులు ఉండాలి. ఇంజనీరింగ్ విభాగాలకు కనీసం 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌కు ఏదేని డిగ్రీతోపాటు పీజీ(ఇంగ్లీష్); మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి రెండేళ్ల పీజీడీఎం/సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణులై ఉండాలి. విభాగాన్ని అనుసరించి గేట్/జెస్ట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ఇన్‌స్పయిర్/డీబీటీ జేఆర్ఎఫ్/జీప్యాట్/ఐసీఎంఆర్/ఐడీఆర్‌బీటీ/క్యాట్/జీమ్యాట్ అర్హత ఉండాలి. పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో చేరేవారికి ఈ అర్హత తప్పనిసరి కాదు. నిట్ వరంగల్ సహా ఇతర ప్రభుత్వ/ప్రైవేట్ అకడమిక్ సంస్థల్లోని లెక్చరర్లు/ప్రొఫెసర్లు, పీఎస్‌యూల్లో పనిచేస్తున్నవారు, ప్రముఖ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/ల్యాబొరేటరీల ఉద్యోగులు పార్ట్ టైం ప్రోగ్రామ్‌నకు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి నిబంధనల మేరకు కనీసం మూడేళ్ల అనుభవం తప్పనిసరి. నిట్ వరంగల్ ఫ్యాకల్టీ మెంబర్లకు రాత పరీక్ష నుంచి మినహాయింపు వర్తిస్తుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800 **చివరి తేదీ:** ఏప్రిల్ 3

రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల: ఏప్రిల్ 16

రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు: ఏప్రిల్ 29 నుంచి మే 2 వరకు

ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: మే 14

ఎంటెక్(సెల్ఫ్ ఫైనాన్స్)

ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. రిటెన్ టెస్ట్ గేట్ సిలబస్ ఆధారంగా ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో చేరే అభ్యర్థులకు రిజర్వేషన్‌లు వర్తించవు. వర్కింగ్ పర్సన్స్- పనిచేస్తున్న సంస్థ నుంచి 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా సబ్మిట్ చేయాలి.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు:

- **సివిల్ ఇంజనీరింగ్:** ఇంజనీరింగ్ స్ట్రక్చర్స్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, జియో ఇన్ఫర్మాటిక్స్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, స్మార్ట్ ఎలక్ట్రిక్ గ్రిడ్
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ & కెమికల్ ఇంజనీరింగ్ (జాయింట్ కోర్సు):** కంట్రోల్ అండ్ ఆటోమేషన్
- **మెకానికల్ ఇంజనీరింగ్:** థర్మల్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫాక్చరింగ్, మెషిన్ డిజైన్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్:** ఎంబెడెడ్ అండ్ మెషిన్ లెర్నింగ్ సిస్టమ్, వీఎల్ఎస్ఐ సిస్టమ్స్ డిజైన్, అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్
- **మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్:** మెటీరియల్స్ టెక్నాలజీ, వెల్డింగ్ టెక్నాలజీ అండ్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్
- **కెమికల్ ఇంజనీరింగ్:** కెమికల్ ఇంజనీరింగ్, సస్టయినబుల్ ఎనర్జీ జెనరేషన్ అండ్ స్టోరేజ్ టెక్నాలజీస్
- **కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ
- బయోటెక్నాలజీ

అర్హత: విభాగం-స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో బీఈ/బీటెక్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో జనరల్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.1600

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30

రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల: మే 14

రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూ: జూన్ 3 నుంచి 6 వరకు

ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: జూన్ 14

లిటిల్స్




దేశం- ఇండోనేషియా

- ఇండోనేషా, మలయ్ ద్వీపాల సముదాయంలో ఉండే దేశం ఇండోనేషియా. మనదేశంతో పాటు చైనా, ఆస్ట్రేలియాల మధ్య ఇండియన్, పసిఫిక్ మహాసముద్రాలలో విస్తరించి ఉందీ దేశం.
- ఈ దేశ రాజధాని పేరు జకర్తా.
- భూమిమీద ఒక్కశాతం భూమి ఉండే ఈ దేశంలో ప్రపంచంలోని పదిశాతం చెట్లు, 12 శాతం జంతువులు, 17 శాతం పక్షులూ ఇక్కడే ఉన్నాయి.



- 'కార్ప్స్ లిల్లీ' అనే పువ్వు ప్రపంచంలోనే అతి పెద్దది. 27 కోట్లు జనాభా ఉండే ఈ దేశంలో 700 భాషలు ఉన్నాయి.
- పంక జయా అనే ప్రాంతం భూమిమీద అతి ఎత్తయిన ఐలాండ్. సముద్ర మట్టానికి 4884 మీటర్ల ఎత్తులో ఉంది.
- 17,504 ఐలాండ్స్ సముదాయమే ఇండోనేషియా.
- 9వ శతాబ్దంలో కట్టిన బుద్ధిజం టెంపుల్ ప్రపంచంలోనే అతి పెద్ద బుద్ధిస్ట్ టెంపుల్.
- 1512 సంవత్సరంలో మొదటిసారిగా పోర్చుగీసు నావికుడు ఫ్రాన్సిస్కో సెరారో ఈ దేశానికి వెళ్లాడు. ఆ తర్వాత డచ్, బ్రిటీష్ వాళ్లు ఇక్కడి వెళ్లారు.
- నెదర్లాండ్స్‌నుంచి స్వాతంత్ర్యం పొందింది 1945లోనే అయితే డిసెంబర్ 1949లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండోనేషియాగా ఆవిర్భవించింది.
- ఇండోనేషియా అనగానే మనదేశంలో చాలా మందికి గుర్తొచ్చే ప్రాంతం 'బాలి'.
- ప్రపంచంలోనే అతి పెద్ద గోల్డ్‌మైన్ ఇక్కడే ఉంది.
- ఇక్కడ ఫుట్‌బాల్ అభిమానులు ఎక్కువ. డచ్ ఈస్ట్ ఇండీస్ పేరుతో ఓ ఫుట్‌బాల్ టీమ్ తయారైంది. 1938 సంవత్సరంలో ఫిఫా వరల్డ్ కప్‌కు ఎంపికైన తొలి సౌతీస్ట్ దేశం ఇదే.



దారి కనుక్కోండి



ఎన్ని పక్షులు ఉన్నాయి

సరైన నీడ ఏది?



గోవా షిప్‌యార్డ్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌లు

ఖాళీలు 106

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్...శాశ్వత ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ సూరింటెండెంట్(హెచ్ఆర్): **2 పోస్టులు**
2. అసిస్టెంట్ సూపరిటెండెంట్(హిందీ ట్రాన్స్‌లేటర్): **1 పోస్టు**
3. అసిస్టెంట్ సూపరింటెండెంట్(సీఎస్): **1 పోస్టు**
4. టెక్నికల్ అసిస్టెంట్(ఎలక్ట్రికల్): **4 పోస్టులు**
5. టెక్నికల్ అసిస్టెంట్(ఇన్‌స్ట్రుమెంటేషన్): **1 పోస్టు**
6. టెక్నికల్ అసిస్టెంట్(మెకానికల్):**4 పోస్టులు**
7. టెక్నికల్ అసిస్టెంట్(షిప్ బిల్డింగ్): **20 పోస్టులు**
8. టెక్నికల్ అసిస్టెంట్(సివిల్): **1 పోస్టు**
9. టెక్నికల్ అసిస్టెంట్(ఐటీ): **1 పోస్టు**
10. ఆఫీస్ అసిస్టెంట్ - క్లరికల్ స్టాఫ్: **32 పోస్టులు**
11. ఆఫీస్ అసిస్టెంట్(ఫైనాన్స్/ఐఏ): **6 పోస్టులు**
12. పెయింటర్: **20 పోస్టులు**
13. వెహికల్ డ్రైవర్: **5 పోస్టులు**
14. రికార్డ్ కీపర్: **3 పోస్టులు**
15. కుక్(ఢిల్లీ ఆఫీస్): **1 పోస్టు**
16. కుక్: **2 పోస్టులు**
17. ప్లంబర్: **1 పోస్టు**
18. సేఫ్టీ స్టీవర్డ్: **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీబీఏ, గ్రాడ్యుయేట్, ఇంజనీరింగ్ పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా, డిగ్రీ, బీఏ, బీఎస్‌డబ్ల్యూ.

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 27

వెబ్‌సైట్: https://goashipyard.in/

జాబ్ కార్నర్

ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్‌లో ఎస్ఐ ఉద్యోగాలు

ఖాళీలు 4187

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్... ఢిల్లీ పోలీస్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్ నియామక పరీక్ష-2024కు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా ఢిల్లీ పోలీస్ విభాగంతో పాటు కేంద్ర సాయుధ బలగాలైన(సీఏపీఎఫ్), బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు భర్తీ చేస్తారు.

ఖాళీల వివరాలు

1. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ)లో సబ్ ఇన్‌స్పెక్టర్(జీడీ): **4,001 పోస్టులు**
2. ఢిల్లీ పోలీస్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎగ్జిక్యూటివ్) - పురుషులు: **125 పోస్టులు**
3. ఢిల్లీ పోలీస్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎగ్జిక్యూటివ్)- మహిళలు: **61 పోస్టులు**

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ డిగ్రీతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20-25 సంవత్సరాల మధ్య ఉండాలి.

జీతభత్యాలు: నెలకు రూ.35,400 - రూ.1,12,400

ఎంపిక ప్రక్రియ: సీబీటీ రాత పరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష(పీఈటీ)/ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ/ఎస్టీ/మహిళలు/ఎక్స్-సర్వీస్‌మన్ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, నెల్లూరు, చీరాల, విజయనగరం, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 28

కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు: 2024 మే 9, 10, 13

వెబ్‌సైట్: https://ssc.gov.in/



డీఆర్‌డీవోలో జేఆర్ఎఫ్‌లు

న్యూఢిల్లీలోని డీఆర్‌డీవో - సైంటిఫిక్ అనాలసిస్ గ్రూప్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 19

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్ స్కోరు సాధించి ఉండాలి.

వేతనం: నెలకు రూ.37,000

వయోపరిమితి: 28 ఏళ్లు మించ కూడదు

ఇంటర్వ్యూ తేదీ: మార్చి 18

వెబ్‌సైట్: www.drdo.gov.in/

టీహెచ్ఎస్‌టీఐలో ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్లు

గుర్‌గావ్‌లోని బ్రిక్‌కు చెందిన ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-1: **1 పోస్టు**
2. ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్: **1 పోస్టు**
3. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-3: **1 పోస్టు**
4. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3:**1 పోస్టు**

అర్హత: డిగ్రీ, లైఫ్ సైన్స్ విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: పోస్టును అనుసరించి రూ.35,000 నుంచి రూ.78,000 చెల్లిస్తారు.

వయోపరిమితి: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఉంటుంది.

ఇంటర్వ్యూ తేదీలు: మార్చి 19, 20, 27

వేదిక: టీహెచ్ఎస్‌టీఐ, ఎన్‌సీఆర్ బయోటెక్ సైన్స్ క్లస్టర్, 3వ మైల్‌స్టోన్, ఫరీదాబాద్- గుర్‌గావ్, ఎక్స్‌ప్రెస్‌వే, ఫరీదాబాద్.

వెబ్‌సైట్: https://thsti.res.in/

thsti
Translational Health Science and Technology Institute

డైలీ సుడోకు - 249

	2			4	5			7
4	8	9	2	1	7			
	6							
		7		3	9		6	
5			4		6			3
	1		7	5		4		
							7	
			5	7	2	6	9	1
1			9	8			3	

సుడోకు - 248 సమాధానం

9	1	4	5	6	7	2	8	3
6	5	8	3	2	9	7	4	1
2	3	7	8	4	1	6	5	9
7	9	6	4	1	2	8	3	5
1	4	3	7	8	5	9	6	2
5	8	2	6	9	3	1	7	4
4	7	1	9	3	8	5	2	6
8	6	9	2	5	4	3	1	7
3	2	5	1	7	6	4	9	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.